ఉగాది ప్రత్యేక సంచిక


Regd. No. H.

ఆంధ్రప్రదేశ్




సంపుటి: 4 మార్చి, 1960

సంచిక: 5 ఫాల్గుణం, 1881 శక



ప్రపంచ వ్యవసాయ ప్రదర్శనంలో ప్రశంసలందుకొన్న ఒంగోలు వృషభం—రష్యా అధ్యక్షుడు మార్షల్ ఒరోషిలోవ్ దాని ముఖం దువ్వుతున్నారు.



ఆర్థిక మంత్రి శ్రీ కె. బ్రహ్మానందరెడ్డి 20-2-60 న రాష్ట్ర శాసన సభలో 1960-61 బడ్జెటును ప్రతిపాదిస్తున్న దృశ్యం.

ఆంధ్ర ప్రదేశ్

సంపుటి 4 | మార్చి, 1960 | సంచిక 5

ఫాల్గుణం, శకము—1881

విషయసూచిక

ముందు అట్ట: ఉగాది వేడుకలు.

వెనుక అట్ట: సకల సౌకర్యాలుగల కోచ్-యాత్రికుల సౌకర్యార్థం రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ యిటీవల దీనిని సంపాదించింది.

చందా వివరాలు :

సంవత్సరానికి . . . 2 రూపాయల 16 నయాపైసలు.

విడిప్రతి వెల . . . 18 నయాపైసలు.

Edited and Published by the Director of Information and Public Relations, Hyderabad
Printed at: Vir Milap Press, Mukaramjahi Road, Hyderabad.

కథానికల పోటీ

"ఆంధ్ర ప్రదేశ్" తెలుగు, ఉర్దూ సంచికలకై కథానికల పోటీ నిర్వహించబడుతుంది.

ఒక్కొక్క భాషలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను పొందిన కథలకు వరుసగా రూ. 200, రూ. 100, రూ. 50 బహుమతులు యివ్వబడుతాయి.

కథలను టైపు చేయించి లేక చక్కని దస్తూరీలో అక్షరాలు తెలిసేట్టు వ్రాసి నాలుగు ప్రతులలో పంపాలి. అవి స్వతంత్ర రచనలయి ఉండాలి. అనువాదాలు, అనుసరణలు అంగీకరించబడవు. కథ స్వతంత్ర రచన అనీ, అది మరెక్కడా ప్రచురించబడలేదని తెలిపే రచయిత సర్టిఫికెట్టు కథతో పాటు జతచేసి పంపబడాలి.

కథ 4000 మాటలకు మించ కూడదు. ఇతివృత్తం ఆంధ్ర ప్రదేశ్‌లో ఏదో ఒక జిల్లా జీవితానికి సన్నిహితమయి, స్థానిక సంప్రదాయాలకు సంబంధించి ఉండాలి.

ఈ విషయంలో యిందు నిమిత్తం నియమించబడిన సంఘం నిర్ణయమే తుది నిర్ణయం.

కథల సమర్పణకు 1960 ఏప్రిల్ 1వ తేదీ ఆఖరు రోజు. ఆ తేదీ తరువాత వచ్చే కథలు పరిశీలించబడవు.

రచయిత పేరు, పూర్తి చిరునామా విడిగా ఒక కాగితంపై వ్రాయబడాలే కాని కథ ప్రతులలో యెక్కడా ఉండకూడదు.

పోటీకి పంపే కథలను ఆంధ్ర ప్రదేశ్ సమాచార పౌర సంబంధాల శాఖ డైరెక్టరు, హైదరాబాద్—1 చిరునామాకు పంపాలి.

నవ మౌక్తిక మాలికా

— నండూరి రామకృష్ణమా చార్యః

త్రింశల్లక్షదళ ప్రజాహిత విశాలాంధ్రీ మధుక్షీరధా
శ్రీశైల ప్రముఖ త్రిలింగ శిఖరీ ప్రాతర్నవోషస్వినీ
కృష్ణా కంకణ కింకిణీ ఝణఝణద్ గోదావరీకాంచికా
ద్రాక్షా పేశలవాఙ్మయీ విజయతాంతె లింగపృధ్వీస్థలీ!

జయతు వింధ్యాచల కిరీటా
జయతు స్వర్ణముఖీ నదీ మం
జీర శింజిత మంజు మంజుల
చరణ కంజాతా

ధర్మ శూరసుత ప్రసూతా
దేశ భాషాతి శయ కవితా
రస నిభృత నిర్ఝర సమేతా
జయతు ప్రియ మాతా

ఖడ్గవీరాః కార్యశూరాః
సాహితీరణ సార్వభౌమాః
బోధి సత్వాస్తవ ప్రియ సుతాః
పూజ్య మాతృధరే

ఔత్త రాహారసార్ద్రహృదయం
దాక్షిణాత్య విదగ్ధ మేధా
తవ శుభగళే తరళ మంగళ
సూత్రయుగళ దశే

యత్ర భాషణ కరణ శుద్ధిః
యత్ర కరుణార్ద్రాను భూతిః
తత్ర కృపయా సర్మ దాస్మాన్
గమయ ప్రియ మాతః

యత్ర దాస్యం నాస్తి భావే
యత్ర విశ్వహితైక దీక్షా
కార్యరూప నిరంతరాస్యాత్
తత్ర గమయ సదా

హృద్వి ధేయా యత్ర ధిషణా
యత్ర హేతుః సంప్రదాయ సు
వర్ణ నిగళక బంధ ముక్తః
తత్ర గమయ సదా.

సంగీతార్ద్రా మధురస ఘనీ కావ్యలావణ్య పూర్ణా
త్యాగ బ్రహ్మ ప్రగదిత మహాగాన సామ్రాజ్య రాజ్ఞీ
శ్రీమన్నాగార్జున నగకళా శిల్ప సా హి త్య ధాత్రీ
విశ్వాదర్శా విజయతు విశాలాంధ్ర పృధ్వీమతల్లీ।

ఆడదాని చేతి అర్థము మొగవాని చేతి బిడ్డ బతకదు.

* * *

ఆహారమునందు వ్యవహారమునందు సిగ్గుపడకూడదు.

— తెలుగు సామెతలు.

ఆంధ్ర ప్రవేశ్

తెలుగు కళలు

— కొడవటిగంటి కుటుంబరావు

సంపదను అభివృద్ధి చేసుకోవటానికి పరిశ్రమలు ఎంత అవసరమో, సంస్కారాన్ని పెంపొందించుకోవటానికి కళా పరిశ్రమ అంత అవసరం. సంస్కృతి ఒక మహత్తర మైన సాంఘిక శక్తి. అది నియమబద్ధంగా ప్రవర్తిల్లినట్ట యితే అపూర్వమైన సాంఘిక చైతన్యం ఉత్పన్నమై జాతి ఘన విజయాలను సాధించగలుగుతుంది. లేని పక్షంలో ఉన్న సంస్కృతి కాస్తా తెరిచిన గిన్నెలలోని నీరులాగా ఆవిరి అయి గాలిలో కలిసిపోతుంది తప్ప, రైళ్ళను లాగ లేదు, ఇంజన్లను నడపలేదు.

ప్రస్తుతం తెలుగు కళలు తెరిచిన గిన్నెలోని నీరులాగా ఉన్నట్టు తోస్తుంది. తెలుగు జాతి కళా సంప్రదాయాలు ఎరగని జాతికాదు. తెలుగు గడ్డమీద ఎప్పుడో ఒకప్పుడు ప్రతి కళాఉచ్చదశలో రాణించింది. కాని రానురాను తెలుగు కళా పరిశ్రమ ఎదుగు బొదుగూ లేక పోవటమో, గుంట పూలు పూయటమో, నశించిపోవటమో జరిగింది. ఇందుకు రాజకీయమైన మార్పులూ, సామాజికమైన మార్పులూ ప్రధాన కారణాలనటానికి సందేహం లేదు.

గాంధీ శకంలో జనంలో కలిగిన భావ చైతన్యం ఆ కాలపు కళలలో దాదాపు ప్రతిబింబించనే లేదని చెప్పవచ్చు. వెలువడిన కొద్ది రచనలు వగైరాలను అప్పటి ప్రభుత్వం నిషేధించింది. అయితే గాంధీజీ ప్రచారం చేసిన సాంఘిక సంస్కరణల ప్రభావం మరింత ప్రస్ఫుటంగా తెలుగు కళ లలో వ్యక్తమయింది, ముఖ్యంగా దరిద్ర నారాయణులను గురించి, హరిజనులను గురించీ భావ వాదంతోకూడిన కథలూ, పాటలూ, చిత్రాలూ, నాటకాలూకూడావెలువడ్డాయి. భావ వాదం దేనికంటే ప్రత్యక్ష చర్యలకింకా మార్గాలు ఏర్పాటు కాలేదు. ఇవి పరిమితమైన ప్రయోజనాన్ని కూడా సాధించాయన వచ్చు.

అయితే జీవితంలో చెప్పుకోదగిన పెద్ద మార్పులు తీసుకు వచ్చినది రెండవ ప్రపంచ యుద్ధం. దీనితో ప్రపంచ ఖండాలు ఒకే మూసలో వచ్చి పడ్డాయి. ప్రజలలో ఒక విశాల అంతర్జాతీయ దృక్పథం ఏర్పడింది. మేధావులు తమ పరిస్థితుల సాదృశ్యాల కోసం ప్రపంచమంతా, చరిత్ర అంతా ఘూలించసాగారు. యుద్ధంలో ఓడిపోయి గూడా ఫాసిజం మంచి గుణపాఠం నేర్పింది. ఫాసిజం అన్నది ప్రజాతంత్రానికి గొడ్డలిపెట్టుగానూ, సైనిక సమీకరణగానూ నిర్వచించబడింది. ప్రపంచమంతటా ప్రజాతంత్రానికీ, విశ్వ శాంతికీ పరపతి హెచ్చింది. అదే విధంగా పేద దేశాలలో సోషలిస్టు విధానాలకు పరపతి హెచ్చింది.

మన పురోభివృద్ధికి దోహదంచేసే ఈ ప్రధానాంశాలన్ని టినీ మన రాజ్యాంగం స్వీకరించింది. మనం యుద్ధతంత్రాల జోలికి పోకుండా ప్రపంచశాంతికి శాయశక్తులా కృషి చేస్తూ ప్రజాతంత్రాన్ని కాపాడుకుంటూ. మత విభేదాలు దేశాభ్యు దయానికి అడ్డురాకుండా చూసుకుంటూ సోషలిస్టువిధానంలో దేశ సంపదను పెంపొందించుకొని పంచశీల సూత్రంతో అన్ని ప్రపంచ దేశాలతోనూ సత్సంబంధాలు ఏర్పరచుకుని వర్గరహిత సమాజ వ్యవస్థ లక్ష్యంగా పెట్టుకుని పురోగ మించటానికి ప్రమాణం స్వీకరించాలి.

ఇది ఆచరణలో అమలు జరగటానికి ఎంతో కృషి అవసరం. ఆ కృషికి అవసరమైన అనంత శక్తి మన సంస్కృతిలో నుంచి ఉద్భవించాలి. ప్రజలలో పాత వాస నలు ఏమాత్రమూ చావలేదు. మతస్పర్ధలూ. కులతత్వాలు విజృంభిస్తూనే ఉన్నాయి. లాభ కాంక్ష, స్వార్థమూ, అధి కార వ్యామోహమూ, అవినీతి. పక్షపాతమూ, దేశద్రోహ చింతా, యుద్ధోన్మాదమూ మొదలుగాగల అనేకమైన అవాంఛనీయమైన మానసిక ప్రవృత్తులు అంటువ్యాధులలాగా

జాతిని పీడిస్తున్నాయి. 1930లోనూ, తిరిగి 1942 లోనూ ప్రజలలో ఉండిన ఐక్యభావం స్వాతంత్ర్యం సిద్ధించిన ఇంత కాలానికి దేశంలో మృగ్యంగా ఉన్నట్టు స్పష్టమవుతున్నది. ఈ అంటువ్యాధులు నిర్మూలనం కాకపోతే మన గమ్యానికీ గమనానికీ ఎలాటి పొంతనా ఉండబోదు.

ఈ సమస్యను ప్రభుత్వమూ, ప్రజలు ఎన్నుకున్న మంత్రులూ పరిష్కరించగలరని ఎవరన్నా అనుకుంటే అది కేవలం భ్రమ. శాసనాలూ, చట్టాలూ మనిషిలోని కుసంస్కారాన్ని కొంతవరకు నిగ్రహించగలవు గాని మనిషికి సంస్కారాన్ని ఇవ్వలేవు. సంస్కారానికి తిలోదకాలిచ్చినవాడు శాసనాలన్నిటినీ అధిగమించి స్వప్రయోజనం చూసుకోవటానికి తన యావచ్ఛక్తిని వినియోగిస్తాడు. అందుచేత మంచి శాసనాలూ, చట్టాలూ సవ్యంగా అమలుజరగటానికి కూడా ప్రజలకు ఒక కనీస సంస్కృతి అత్యవసరం. రాతియుగంలో నివసించే వారికి నాగరికమైన చట్టాల నిచ్చి నాగరికులను చేయలేం; వాళ్ళ జీవితం భౌతికంగా ఒక్కొక్క మెట్టే ఎక్కి రావాలి, అందుకు తగిన సంస్కారంకూడా వారికి అడుగడుగునా లభించాలి.

ప్రజల సంస్కృతిని పెంచేవి కళలు. ఈనాటి తెలుగు కళలలో రేపటి తెలుగు ప్రజల భవిష్యత్తు ఛాయలు కనిపించటం లేదు. నిన్న మొన్నటిదాకా తెలుగు వారికి మద్రాసు నగరమే సంస్కృతీ కేంద్రంగా ఉండేది. ఇప్పుడిప్పుడు హైదరాబాదు నగరం ఆస్థానం ఆక్రమించుకుంటున్నది. కాని సంస్కృతీ కేంద్రంగా హైదరాబాదు మద్రాసుకు చాలా దశాబ్దులు వెనకబడి ఉన్నట్టుగా కనిపిస్తుంది. కళాప్రచార సాధనాల దృష్ట్యా చూస్తే ఇందులో అబద్ధం ఆవగింజంతకూడా లేదు.

ప్రజా సామాన్యాన్ని సంస్కృతీవంతం చేయాలంటే పారిశ్రామిక సాధనాలు అత్యవసరం. నన్నయ తిక్కనల కాలంలో తాటాకులతోనూ గంటాలతోనూ సాహిత్య దేవతకు అమూల్యాలంకారాలు లభ్యమయాయి. ఈనాటి సాహిత్యం అచ్చు యంత్రాల మీద చౌకగా తయారై, రైళ్లమీదా విమానాలలోనూ, రేడియోద్వారానూ దేశం నాలుగుమూలలా అందాలి. అచ్చు యంత్రాలున్నాయి. రైళ్లూ. విమానాలూ రేడియోలూ ఉన్నాయి, ప్రజలలో అత్యవసరమైన సంస్కృతిని పెంపొందించి వారి జడత్వాన్ని వదలగొట్టి, చైతన్యాన్ని ప్రసాదించే సాహిత్యమే బహు తక్కువగా ఉన్నది.

కళలలో చాలా రకాలుంటాయి. వెనక్కు చూసేవీ; ముందుకు చూసేవీ, జాతికి ఉపకరించేవీ, నష్టం కలిగించేవీ, ఏదీ చెయ్యనివీ, ప్రజలకు ముందుండేవీ, ప్రజల వెనకాల నడిపించేవీ ఇత్యాది. వీటిలో కొన్ని మాత్రమే ప్రచారయోగ్యమైనవి. ముఖ్యంగా కళాసాధనాలు వ్యాపార వస్తువులైనప్పుడు లాభం ప్రధానంగా ఉంటుంది. కళా సాధనాలు చేతిలో ఉన్నవాడు ప్రజలవెనక నడిచే కళలనే ప్రోత్సహిస్తాడు. అందువల్ల అతడికి ఎక్కువ లాభం. ఈ లక్షణం సినిమా పరిశ్రమలో కొట్టవచ్చినట్టు కనిపిస్తుంది. సినిమా చిత్రాలను నిర్మించే వారు తమ ఆశయాలను బహిరంగంగానే ఒప్పుకుంటున్నారు. ప్రజలకు అత్యంత సన్నిహితంగా ఉన్న సినిమా కళనుంచి మనం చైతన్యవంతమైన సంస్కృతిని ఆశించటానికి లేదు.

తెలుగు సంగీతమూ, తెలుగు చిత్రకళా, తెలుగు నాట్యకళా గుంట పూలు పూస్తున్నాయి. ఉత్తమ సంగీతమూ, చిత్రకళా పాత సంప్రదాయాలను వదిలి ముందుకు వచ్చినట్టు కనబడదు. ప్రజలను అధికంగా ఆకర్షించే గాయకులూ, చిత్రకారులూ నటులూ సినిమా పరిశ్రమలో నాలుగు డబ్బులు చేసుకుంటున్నారు. ఇక నాటకాల మాటకు వస్తే తెలుగు దేశంలో నాటక రంగమే మృగ్యమైపోయింది.

ఈ సమస్య ఇలా ఉంచి తెలుగు దేశంలో యాంత్రిక సాధనాలే మృగ్యమై పోయాయి. తెలుగు పత్రికలూ, పుస్తకాలూ, బొమ్మల పుస్తకాలూ విరివిగా తయారుచేసే మంచి అచ్చు మాటలు లేవు. కళా సాధనాలను కేవల వ్యాపార సరుకులుగా పరిగణించినా వాటిని చౌకగానూ, ఆకర్షవంతంగానూ, విరివిగానూ తయారుచేసే పారిశ్రామిక యంత్రాలు తెలుగు దేశంలో ఏర్పాటుకాలేదు. తెలుగువాళ్లు పరిశ్రమలు నెలకొల్పి విజయవంతంగా నిర్వహించటం నేర్చుకోవటమనేది తెలుగు జాతియొక్క పురోభివృద్ధికి మొదటి మెట్టులాగా కనిపిస్తుంది. అలాటి సాధన సంపత్తి ఏర్పడిననాడు సంస్కృతిని సరి అయిన మార్గాన నడిపించే సమర్థతగల వాళ్లు వాటిని ఉపయోగపరుచుకో గలుగుతారు.

తెలుగుదేశం పారిశ్రామికంగా అభివృద్ధి కావటం తక్షణ కర్తవ్యం.

———:*:———

ఉగాది శుభాభినందనము

— వేములపల్లి సుధాకరరావు

చెట్ల చేమల కెక్కిన సివము చూడు !
మధువు వచ్చె నటంచును మందజనులు
మిడిసి పడరేమి ? రసికత యుడిగి పోయె ;
సంతస మొసంగ లేని వసంతు డపుడు
కోకిలపుటీల బిల్చెను గుసుమశరుని.

2

పూల కోలల నూనెను పుష్పధన్వ,
హేలగా నవ్వి వైచెను హీనజనము,
సృష్టి సర్వము సొగయించు చిన్నవాండు)
కోయిల ముఖమ్ముగానె నా పోయినారు.

3

ఈ మధుమా సారంభో
హా మధురిమ పిచ్చలించి యలరెడు మదితో
శ్రీ మత్ సంజీవయ్యకు
క్షేమార్థం బాశిషమ్ము చెప్పి నుడివెదన్.

అల రుద్రాంబిక నాడు పొల్చెను విశాలాంధ్రమ్ము విశ్వంభరా
స్థల మాణిక్యముగాగ తత్ప్రతిభ సంధానించె నీ గడ్డ నా
డులుగా బీటలు వడ్డ గడ్డకును రెడ్డుల్ రాజులై ప్రోచిరీ
యిల కేకాకృతి గూర్చినట్టిదగు నా యింతిన్ ప్రశంసించెదన్.

5

హూణున్ సర్షపమంత లెక్కిడ కమరావే శదుర్ధర్షులై
వర్ణించెంగద అస్మదుజ్జ్వల ప్రతాపంబుల్; తదు గ్రాహవో
త్కర్షన్ ధర్షిత సర్వ వీర్యుడగు నాధాత్రీశు డాత్రంబునన్
శిరం బెత్తక పాఱినట్టిదగు నా చిత్రమ్ము గీర్తించెదన్.

6

కావ్య నిర్మాణమా కవిలోక మూర్ధన్య
కవితా పితామహు గన్నతల్లి!
నగర నిర్మాణ మా నానా వనీ దూత
సంస్తుతి సాచిన చరమరేఖ;
బాహాబలం బెన్న బాపురే యది మఱి
గరుడి ఱెక్కలయందు వరలు నేమొ;
సకల సామంత మస్తక కిరీట శిఖండి
బర్హాధూత పరాగ పాదతలుడు;
కృష్ణరాయ లొకండు దృగ్వీధినిలుచు
సృష్టి చిననాట నుండియు చేవగలిగి
గడ్డ నేలిన యట్టి మగండు లేడు
రాయలకు మించి యీ భువి; రాజకులము
వండు కొన్నది దాని క్రౌర్యాది పసకు.

7

రిపులు చచ్చిరి వాని స్మరించి నంత,
కవులు చచ్చిరి యవ్వాని కబ్బమునకు;
దిగులు కొన్నవి వాని యేద్త్రెరకు జడిసి
రాజకవి లోకములును విక్రాంతి నుడిగి,

8

అంతట మహీయు తేలిన యట్టి నేల
పడతి నిస్సత్త్వగా స్వయం వరము నందు
మన్ని పిసికెడి జాతిలో మాన్యునెన్ని
తన సుఖమె చూచుకొన్నది తలిరుబోడి.

9

కరుణా వేశము తోడ క్రింది జనునిన్ గైకొన్న సందర్భముల్
చరితం జూపుము ? సామరస్యకలనా సంతోషివై సాగి చె
చ్చెర సాధింపుము సర్వమంగళములన్ శ్రీ విశ్వ విశ్వంభరన్ ;
వర సంకల్ప గభీర ! వత్సరశతం త్వంజీవ ! సంజీవయా !

10

హరి శబ్దమ్మున హాస్యలౌజనులు నిద్రా హారముల్ లేక చా
కిరితో గుండె దిగుళ్లతో వనటతో గీర్తించె నే దైవమున్
బరమార్తిన్ సుకృతం బదంతయును సంప్రాప్తించె నీ యందు;భూ
వరమా విద్ధుఃవైచు బంధుజనులన్ బ్రాల్మాలినన్ దోషమౌ.

11

క్షేమము సంజీవునకున్
సీమా క్షేమైక నిఖిల జీవనునకును
ద్దామ భవిష్య మహోసం
గ్రామ విజయ శోభి వదన రాజీవునకున్

ఆవు చేన్లో మేస్తే దూడ గట్టున మేస్తుందా?

*　　　*　　　*

మోసే వానికి తెలుసు కావిటి బరువు.

*　　　*　　　*

చేనుకుగట్టు ఊరికికట్టు ఉండవలెను.

*　　　*　　　*

కాని కాలముకు కఱ్ఱ పామౌతుంది.

— తెనుగు సామెతలు.

"ఆంధ్రత్వము"

— కుంటిమద్ది శేష శర్మ

"ఆంధ్రత్వ మాంధ్ర భాషాచ నహాలుజన్మతపః ఫలం."
అని యొక సూక్తి. ఇతర భాషలు పరికించనివాడు, ఇతర ప్రాంతములను బరిశీలించనివాడు నొక్కదానిగూర్చి యిట్టి నిర్ణయ మొసంగలేదు. బాగోగులు కేవల వస్తు ధర్మములు గాక పరస్పర సాపేక్షములు. "ఆత్మీయాభిమానము వస్తువు నెడలేని గొప్పదనమును గల్గించుననుట నిరాకరింపరానిదే. జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపిగరీయసీ" అనుట త్రోసి వేయ రాని సత్యమే. ఐనను వస్తువునందు కొన్ని నైజ గుణగణములు లేనిదే కేవలాభిమానము చేతనే దానిని గొప్పగ భావించుట, దానినే యాశ్రయించి గుణాతిశయముగల దానిని గ్రహింప నొల్లకుండుట వ్యక్తియొక్క సంకుచితాభిప్రాయమును సూచించును.

"తాతస్య కూపోయమితి బ్రువాణాః క్షారం జలం
కాపురుషాః పిబంతి."

తండ్రి త్రవ్వించిన బావియని యభిమాన ముండుగాక, అంత మాత్రము చేత నుప్పునీరైనను త్రావుదురా? త్రాగిన తుచ్ఛులు గాక బుద్ధిమంతులా? కేవలాభిమానము ఎంతకాలము సజాతీయ వ్యక్తుల మధ్యమున ప్రతిష్ఠను నిలువరించ గల్గును?

మన యాంధ్ర దేశము ఆర్యావర్తమునకు, దక్షిణ దేశమునకును మధ్యనుండి తరళము వలె విరాజిల్లు చున్నది. ఉభయ సంస్కృతులను తోగొని స్వీయ వ్యక్తిత్వమును ప్రతిష్ఠించుకొని, "సమానానా ముత్తమ శ్లోకోస్తు అన్నట్లు" ఇతర దేశములలో మేటిగా దేజరిల్లు చున్నది. అటులనే మన భాషయు బెంపొందినది. అరవమువలె నియమిత వర్ణములు గలదియే మన తెనుగుభాషయును. "క గ చ జ యుగ ట డ ణ త ద న వ బ మ య ర ల వ స హా శం తుహల్వర్గః." అని పరిమిత హల్ స్వరూపమయ్యును ఆర్యభాషయగు సంస్కృతము యొక్క ప్రాబల్యమునకు వశమై దాని మాధుర్యమును ప్రాభవమును పరికించి యా పదములను గ్రహించి తన ముద్ర వైచి స్వకీయములుగ పచరించినది.

అరవము వలె సంస్కృత పదముల నరికట్టలేదు. అరవము తన వర్ణమాలకు లోబడినవియే గ్రహించినది. తనలో లేని వర్గ యుక్కులను స్వానుగుణముగ మలచుకొన్నది.

"అండక్కులత్తుక్కు అదిపతియాగి అశురరిగాక్కదరై
ఇండక్కులత్తై యెడుత్తుక్కళైంద ఇరుడీకేశందనక్కు
తొండక్కుల త్తిరుళ్ళీర్ వందడి తొజుదు ఆయిరనామం శొల్లి
పండక్కులత్తై త్తవిర్ందు పల్లాండు పల్లాయిరత్తాండు ఎన్మినే"

బ్రహాండ్ర కులమునకు అధిపతియై అసురుల రాక్షసుల నీచుల సమూహముల నాశన మొనరించిన హృషీకేశుని దాసుల గుంపులోని మీరు వచ్చి, (భగవంతుని) పాదములు గడిగి సహస్రనామము లుచ్చరించి ప్రాత దుర్బుద్ధుల వీడి- భగవత్-మంగళాశాసన మొనర్పుడు.

ఇందు "అధిపతి" ఇత్యాది అద్రావిడవర్ణ పదములు దొలగింప వైకృతపదములు గ్రహింపబడినవి.

ఆంధ్రము ట్లుగాక వానినే గ్రహించి తెనుగు ముద్రవైచి తత్సమాంధ్రముగ బ్రకటించి తన యౌదార్యమును వెల్లడించినది.

"ఉద్ధతరిపు విద్ధ తపన పద్ధతి కరిభవనదవనిపట దంబుధి సం
పద్ధరణ సముద్ధరణ సముద్ధరణ రజో వ్రజోద్యది భమద
నృతికిన్."

ఈ విధమున సంస్కృత విలక్షణనామధాతు నిష్పన్న రూప

ములను స్వప్రాభవమునకు భంగములేని విధమున గ్రంచియు,

"అలుపాలఁ బొనుపడునట్టి చిచ్చేయిది—"

ఇత్యాదులందు సంస్కృత పదములను స్వానురూపముగ చికిలి చేసి స్వాధికారమును ప్రవర్తించినది.

"అప్పిచ్చువాడు ఘనుడా? అప్పుడొసగి మరల జెందు నాతడు రాజా?

చెప్పఁగవలె సాహిణి మారప్పను దానమున ఘనుడు రాజు నటంచున్." అనుచో,

"ధరయేయపాంశుల తలసూవ రాకుండఁ దన కూర్మి
రేని నప్పుననె ముంచె."

అను చోటను సంస్కృత దేశ్య సాధారణ శ్రుతి గల "యప్పు" పదమును భిన్నార్థముల శ్లేషించి చమత్కరించి నది.

ఇతర భాషలయందు సంస్కృతమును సంస్కృత ముగనే గ్రహించి ఆ భాషా పదములతో గలిపి, వాక్యముల రచించు సాంప్రదాయమున్నది. దానిని మణి ప్రవాళ మందురు.

(భారతి ఆగస్టు 1959 సంచికయందు పుట్టపర్తి నారా యణా చార్యులు ప్రకటించిన వ్యాసము నందలి చంద్రోత్సవ కావ్యగత పద్య మిది.)

"కలయుపతి పతాకే! వారయోషేవ నమ్మే
క్కమని విగతశంకం నీచ తిచ్చోరుమూలం
అవనియు లోప నూత్రాండేతు పోయ్ వారయోషా
నుభవ మనుభవిచ్చేడాకు మచ్చాప వేగాత్."

వారకాంతవలె మమ్ము మోసగించిన నీవు నా శాపవేగమున భూమిపై బుట్టి నూరేండ్లు వారవనితానుభవ మనుభవింపుము.

ఈ సంస్కృత పద మిశ్రణము తెనుగున నిట్లు లేదు. ఈ విధానము తెనుగున కలవడలేదు కాదన్న.

తిండకై తె బహుమంది వసంతి తండులానితు గృహేషు
వసంతి
కుండలన్ని భవనేషుఖరంతి రండలా కొడుకు లెల్ల
హసంతి.

అను చాటు వొక్కటి వినిపించుచున్నది. గ్రంథముల నీ విధానము జొరఁబడలేదు. కాని, పాల్కురికి సోమనాథుడు వృషాధిప శతకమున గ్రంథాంతమునందు నిట్టి రచనా జుష్ట ములగు పద్యముల రచించినాడు. ఆతడు సంస్కృతాంధ్ర ములకే గాక కర్ణాటాంధ్రములకును పొత్తు కూర్చినాడు.

బసవ పురాణము, పండితారాధ్య చరిత్రము మొదలగు ప్రౌఢ గ్రంథములచే నాంధ్రభాషను అలంకరించిన మహాకవి యతడు. ఆతని యా మణి ప్రవాళ శైలి తెనుగున స్థిరపడ లేదు. ఆతడును మచ్చున కొక్కటి రెండు చూపెనే గాని యా శైలితో గ్రంథ రచన సాగించలేదు. అంతకుపూర్వము నన్నయ్య నిబంధించిన తెనుగు ముద్ర పడసిన శైలికే ప్రచారము ప్రతిష్ఠ లభించినది. 'నవదాన్స వ్యయ సుప్తిఙ్ క్త్వాతుమునాం." అని సంస్కృత సుబంత తిఙంతములు తెనుగున వ్యక్తిత్వమును బొందలేదు. సంస్కృత గ్రంథము లందు లేని వ్యాదీర్ఘ సమాసములైనను అంతమున తెనుగు ముద్రను బడసినగాని ప్రయోగ యోగ్యతను బడయలేదు.

"వ్రాసిన వ్రాయిరా కవివరా! మృగనాభి సుగంధి లాప్సరో
భాసుర హేమకుంభ నిభ బంధుర పీనకుచో పగూహనో
ద్భాసిత గాంగతీర ప్రమదావన క్రముకకంటక ప్రసూ
నాసవ మత్త బంభర రవానుగ వాగ్ధరితోడఁగావ్యముల్"

అని యెంతేని సమాస దైర్ఘ్యము సాగించవచ్చునుగాని కొనఁ దెనుగు విభక్తి లేకున్న నది గ్రాహ్యముగాదు. శివ కవులు ప్రయోగించిన వైరిసమాసములగు పుడమీశుడు ముల్లోకవంద్యుడు ఇత్యాదులును సమ్మతిఁ బొందలేదు. కాని అనుకరణమను ముసుగువైచికొని జంకు కొంకులతోడనే సంస్కృత పదములు తెనుగునఁజొచ్చినవి.

"అనుకృతేస్తివాక్యంతు." అని అనుశాసనము.

"ఆనిష్ఠానిధి గేహ సీమనడురే యాలించనన్
మ్రోయునెం
తేనాగేంద్ర శయాను పుణ్య కథలున్, దివ్య ప్రబం
ధాను సం
ధాన ధ్యానము, "నాస్తి శాక బహుతా, నాస్త్యుష్ణతా,
నాస్త్యపూ
పో, నాస్త్యోదన సౌష్ఠవంచ, కృపయాభోక్తవ్య మన్
బల్కులున్."

ఇత్యాదులందు తెనుగు నలవోక చూపు విశదమగుచున్నది.

"అంటితి నమశ్శివాయ పాపాత్మురాలి "

జయ గోవింద ముకుంద చక్రధర కంసద్వేషి సాత్రాజితీ
ప్రియ రామానుజ కౌస్తుభాభరణ కుంభి త్రాణ పారీణ కా
ళియ దర్పఘ్న పతంగవాహ వనమాలీ కృష్ణ వైకుంఠ శౌ
రి యశోదాత్మజ భక్తవత్సల మురారీ గోపికావల్లభా.

ఇట్టివో నొక్కటి యర సంస్కృత పదములు లక్ష్యా లక్ష్యములు.

ఇది భాషా విషయమునఁదెనుగు ప్రత్యేకత.

పరభాషలను తన యొడిలో నిముడ్చుకొను నుదారత నాటికిని నేటికిని నీ భాషకు గలదు. సంస్కృత ప్రాభవము గల కాలమున సంస్కృత పదజాలమును లోఁగొనినట్లే పాశ్చాత్యభాష అధికారము చెలాయించు కాలము నా పద ములకును దన యొడి పట్టినది

"నయనాంచల చంచల స్పెక్టికల్ ద్వయీ భ్రాజితడౌఁబు"

అని యొక కవి.

"స్టెెటెండ్ సన్సు" రచించు బేరిములనున్ సేద్యంబు
నున్ జూచుచున్"

అనే, సెట్టీ అండ్ సన్సు" అను కంపెనీ నామము శార్దూ లము వాత నలిగి మారినది.

"జిలుగు నెంబ్రాయిడరి చీర సిల్కురైక
మేని బింకము బొంకము మిసిమి సూప
సరసి జానన కప్పు సాసరుల చేని
కరములందాల్చి చేబిలు కడకు వచ్చె."

అని యాధునిక వధూ రత్నము వర్ణితము.

నిత్య వ్యవహారమున తుడిచివేయరాని "కాఫీ ఫర్లాంగు, ఆటంబాంబు" ఇత్యాద్యనాంధ్ర స్వరజుష్టములగు పదము లను గూడ యథాతథముగ గ్రహించుచున్నది. కాని నేటి పండిత ప్రకాండులు మడి గట్టుకొని యున్నందున, పూర్వులు వర్గయుక్కులను కల్పించి కనుబరచిన యుదారతను గ్రహింప లేనందున మన తెనుగు లిపి యసమగ్రమను నప వాదునకు భాజనముగావలసిన దురవస్థఘటిల్లినది. నేటి లిపి సంస్కార సంఘమేని యీ యసమగ్రతను తొలగించునని యాశించుచున్నాము.

ఇక మన ఛందస్సు విషయము పరికింతము

భావముల నావిష్కరించు సాధనము భాష భాషకు నొకవిధ మగు వాహనము ఛందము. అది దేశ భేదమును బట్టి భిన్న భిన్నము.

నీరు త్రావుటకు సాధనముపాత్ర. ప్రధానము నీరమైనను త్రాగు భాజనములలో నొత్తరాహులది యొక విధము. బైరాగి లోటా మరొక్క తీరు శ్రీవైష్ణవుల చెంబులో నొక కుంభకోణత. రాయలసీమ బిందెలకు సర్కారువారి సరవలకు ప్రత్యేక స్వరూపములు. అటులనే భాషావాహక మగు నీ ఛందమునకును ప్రత్యేకత స్థిరపడి యున్నవి.

శార్దూల మత్తేభాది వర్ణగణ బద్ధములగు పద్యములు సాంస్కృతికములు. ఐనను యతిప్రాసలను తెనుగు ముద్ర దగిలించి వానిని సొంతము గావించుకొన్నదీ యాంధ్రిము. ఇందలి రామణీయకతను గమనించి సంస్కృత కవులును నా మర్యాద మేరకు ప్రాసములను పొదిగిన పట్టులు గలవు.

"ప్రాతరంబుజ విడంబిలోచనాం మాతరం త్రిజగతా
ముపాస్మహే
శీత రమ్యకరణావలోకనైర్యాతరంగయతి మంగళా
నినః॥"

ఇది 17వ శతాబ్ద మందలి వేంకటాధ్వరి రచించిన లక్ష్మీ సహస్రిము లోనిది.

చల్లని చూపుల శుభములు కల్లోలములై చెలంగఁ
గాంచెడి ప్రాతః
ఫుల్లార వింద నయనను దల్లిని ముజ్జగములకు సదా
భజియింతున్, అని.

తెనుగున ప్రాసము నియతము. సంస్కృతమున నా నిర్బం ధము లేదు. ప్రయుక్తమేని యలంకారము. ఇది తెనుగు భాషా ప్రాభవ సంజనితము. ఇతర ద్రావిడ భాషలయందును నా నియమము లేక పోలేదు. అస్తు. యతి మాత్రము విలక్షణము.

తెనుగు జాతీయ ఛందము ఉపగణ బద్ధము. మాత్రాగణ ప్రచురము. సీసము, ఆటవెలది, తేటగీత ఇత్యాదులు తెనుగు సొంత మాస్తి. సంస్కృతమున కనుష్టుప్పువలె ద్విపద తెనుగు జీవగఱ్ఱ. రంగనాథ రామాయణమున గౌరన హరిశ్చంద్రోపాఖ్యానమున ద్విపద కేకచ్ఛత్రాధి పత్యము.

మార్గ కవితను ప్రతిష్ఠించిన నన్నయ సంస్కృత పద ములకు నొక రూపకల్పన మొనర్చి సంస్కృతవృత్తములలో కృతి సాగించెను ఏకచ్ఛందోబద్ధములు వైరస్యాపాదకము లని గాబోలు పలు వృత్తముల గ్రహించెను. ఇదియు తెనుగున ప్రత్యేకతయే. సంస్కృతమున ఒకే వృత్తముతో సర్గమంతయు రచించుట పరిపాటి. చంపూ కావ్యముల పద్ధతిలోని వైలక్షణ్యమును అనుసరించెను గాబోలు. అంతము ద్విపదతోనున్న కావ్యములకు పండిత లోకమున వాసి కృశించినది, "ద్విపద కావ్యంబు ముదిలంజ దిడ్డి

కంత" అని ద్విపద కావ్యముల యెడ నేవగింపు కనిపించు చున్నది. అందువలననే ద్విపద కవిత్వమంతగ పెంపొంద లేదు. అయినను శైవ కవితల్లజుడు పాల్కురికి సోమ నాథుడు పండితారాధ్య చరితమున ననర్గళ వాగ్ఝరిని పారించి నాడు.

అక్కరలు రగడలు యక్షగానములును తెనుగు జాతీయ ములు నేటికవులు నీమార్గము ననుసరించి రచనల సాగించు చున్నారు.

1

భారతీయులకు
శీతోష్ణాలకు
గిట్టని సూటూ
కోటూ బూటూ
నెక్టై వేషం
తిష్టన్మాత్రీం
భాషా దాస్యం
భావపు నైచ్యం
నేడే తప్పక మారవలెన్
మారే దాక దూరవలెన్.

2

ఓదకు సాదకు నొంటికి నిండా
కట్టను గుడ్డా; కడుపుకు నిండా
తినుటకు తిండీ; వానా యెండా
నానుపకుండా మాడుచకుండా
ఉండే దానికి ఇల్లూ.
వాకిలి, చదువను బళ్లూ
రోగాలొచ్చిన మందూ
మాకూ; స్వరాజ్యమందూ
ఇచ్చే నాథులు పుట్టవలెన్
"మినిమం" కోర్కెలు తీరవలెన్.

ఇట్టివి మాత్రాగణబద్ధములు. వర్ణ గణముల కంటెను నీ మాత్రాగణముల యందు సౌలభ్యము గలదు. వీనిలో ప్రాసకు ప్రాధాన్యము. అంత్య ప్రాసము రమ్యతరము.

నాలుగు మాత్రలు నాటిన గణములు

నాలుగు రెంటికి నలిపిరమణములు — అని లక్షణము. ఇది "మధురగతి" "ఓదకు సాదకు ఒంటికి నిండా" అనుచో యతి లేకున్నను నాలుగు మాత్రల నాల్గు గణము లున్నవి. ఇటులనే ద్విరదగతి.

'కరమొప్ప పంచ లఘు గణ చతుష్టయముచే
విరమంబు రెంటిపై ద్విరదగతి పేరిచే'' అని ఐదు మాత్రల గణములు నాల్గున్న ద్విరదగతి యనిరి.

"నారదుండొకనాడు నాకంబు నందుండి
గోకర్ణమందున్న శ్రీకంఠు సేవింప
వేంచేయుచుండగా వీణాగ్రమందున్న
సురలోక విటపి ప్రసూన మాలిక, దాని
సౌగంధ్యమునకు వాసలుగొన్న యదివోలె
జవముతో వినువీధి పవమాన మెగ మీటె.

* * *

అలలు దీరిన తుమ్మెదలను బోలిన పూల
వలపు లొల్కెడి నీదు నలకలను గదలించి
ఆసలించుకనాకు మోసులెత్తించు నీ
మరలి రాకను గూర్చి మారుతాం కూరమ్మ.

* * *

ఏ శాప ఫలితమో యే యచ్చరయొ నిట్టు
లవనిలో జన్మించి యజరాజు వరియించి
కొన్నాళ్ళ దనియించి కొనకుఁ బూమాలచే
శాపాంతమును బడసి చన్నయది గాబోలు.

ఈరీతి నడచుచుండును. ఇందు ''యతిర్వా ప్రాసోవా'' అది ఏదో యొక్కటుండును.

''శ్రీ రఘురాముల దివ్య చారిత్రామృత రసము
సారయశో దాయకము గౌరవ సంధాయకము"

ఇది ఆరుమాత్రల గణములు గలది. ''పాదాంత స్థల వికల్పేన'' అనునట్లు హ్రస్వము వికల్పముగ గురువుగా భావితము.

ఈ విధముగ నాంధ్రము ఛందో విషయమున, దన ప్రత్యేకతను నిల్పుకొన్నది. ఇతర ఛందో మార్గములకు చోటిచ్చి యుదాత్త ప్రదర్శించినది. అన్య రీతులు లోగొన్నను వానిపై దన ముద్ర వైచి స్వప్రాభవము ప్రతిష్ఠించు కొన్నది. కావుననే. ''యాంధ్రత్వ మాంధ్రీ భాషాచ బహు జన్మ తపః ఫలం" అన్నారు.

ఇటి యాంధ్రమును, ఆధునిక యంత్రముల కనుగుణ మగు లిపి లేకుండుటచే వెనుకబడుచున్నది. ఇది ప్రజా ప్రభుత్వపు దినములు. ప్రజా భాషలో ప్రభుత సాగవలసి యున్నది. తలపై నచ్చుల నతికిన యీ లిపి ఆధునిక యంత్రములకు లొంగక మన శీఘ్రగతికి నడ్డువగుచున్నది.

మన లిపి గుండ్రపుదనముచే కనువిందగుచు ముద్దుం మూట గట్టుచుంట కాదనము. ఐనను కార్య విఘాతకమైన యందము బరువు చేటు. అదిగాక యందమున కొక రూపు లేదు. అది మానసిక ధర్మము. తొలుత వికారముగఁ దోచినను పరిచితి బలిమి కొలది చిత్తమునకు హత్తుకొనును.

కాన లిపి సంస్కార సంఘము ఆలసింపక యంత్రానుగుణ లిపిని సమకూర్చి మనభాషను సర్వసమర్థ మొనర్చును గాత.

ఎరువు సొమ్ము బరువు చేటు, తియ్యా పెట్టా తీపుల చేటు, అది పోతే అప్పుల చేటు.

* * *

వచ్చిన నాడు వరహా చుట్టం, మర్నాడు మాడ చుట్టం, మూడోనాడు మురికి చుట్టం.

* * *

అల్లుడికి నెయ్యీ లేదు, అల్లుడితో వచ్చిన వాడికి నూనే లేదు.

* * *

ఋణ శేషం, వ్రణ శేషం, అగ్ని శేషం వుంచకూడదు.

— తెనుగు సామెతలు.

మా ప్రాంతం-ఉగాది

— యస్. సరస్వతి

ఉగాది పర్వములో
మా ప్రాంతం ప్రశాంతం
ప్రకృతి రమ్యాకృతి
సౌందర్యపు దర్పణం
మా హృదయాలకు హర్షం
ధవళవర్ణ కాంతులతో
సింగారపు పరువంతో
నింగి నున్న మబ్బులతో
తలలూపుచు సంతసాన
సంగతులు ప్రసంగించే
మల్లెపూల, మొల్లపూల
దొంతరల విన్యాసాలు.
పూత పటినట్టి పూల
కమ్మని సువాసనలతో
తుమ్మెదల నాహ్వానించే
నిమ్మని కుంజాలు
నారంగ వృక్షాలు.
మహాకవి కాళిదాసు
బహు ప్రీతిగ వర్ణించిన
చూత మంజరి మనోజ్ఞతలు
కర్ణి కారపు వర్ణాధిక్యము
ప్రతి పొలాన కనుల పండుగ
ప్రతి గట్టున ప్రత్యక్షము.

గుబురు గుబురు గుత్తులతో
ముసిరి ముసిరి భ్రమించు చున్న
తుమ్మెద గములకు నిలయమైన
పూప శాఖల వేప పూత.
సైగల సయ్యాటలతో
హరితవర్ణ పర్ణాలను
నెమ్మదిగ చలింప జేయు
రంభాతరుల వితతులు
జొన్న చేల వరుసలు
కరకు దనపు గర్వంతో
రెపరెపమను సవ్వడులతో
ఎరుపు రంగు పరువంతో
పాపల పెద్దల నాకర్షించు
ఇక్షువనపు లక్ష్మి శోభ
ఉదయ భాను కిరణాలకు
ఉలిక్కి పడి సంభ్రమాన
ముసిముసి నవ్వులు నవ్వుచు
పసిమి రంగు హొయలుతో
చూపరుల నోరూర జేయు
తమాల వనపువ రుసలు,
హిమ కణాలు ముత్యాలుగా
భ్రమియింపగ భావనలో
పచ్చని గరికకు పూసిన

విచ్చిన చిని గ్రుడ్డిపూలు
అలంకార ప్రక్రియగా
భూమిని పరచిన రత్నపు
కంబళీ చందముగా
కనబడు చున్నట్టి
పచ్చని పచ్చిక బయళ్లు,
ఉదిత సూర్య కిరణాలకు
స్నిగ్ధధవళ ముఖములతో
కళ్ళనులుము కొంటున్న
పద్మ భామ సంచయాలు.

అరుణ వర్ణ అధరాలతో
చిరునవ్వులు ఒలకబోయు
మెట్ట తామర పూవులు.
రంగు రంగుల చీరెను
పొందికగ సింగారించుకొన్న
ప్రకృతి దేవి స్వరూపము
మా ప్రదేశాన ప్రత్యక్షము
హృదయాలకు ప్రహర్షము
ఉగాదికి ఉపాహారము.

——:0:——

ఆంధ్ర మాత

— చల్లా బ్రహ్మానందమ్,

ఫుల్ల స్వచ్ఛ గుళుచ్ఛనిస్స్రుతర సాంభోరాశి మాధుర్యసం
పల్లొల్యాగత మత్తతాస్ఫురదళిద్వంద్వోత్థ సంగీత ధు
న్యుల్లోల ప్రతి ఘాభ వద్దినదిన ప్రోద్యత్ప్ర కరస్ఫుర
ద్వల్లీ తల్ల జమేయనం బెరుగుమంటా ? యాంధ్ర సంజీవినీ!

ఆంధ్ర ప్రదేశ్

ఆంధ్రుల దౌత్యము

ప్రో. సు. శాస్త్రి

వాసిష్ఠీ పుత్ర శ్రీ పులోమావి ప్రాచీన శాతవాహన చక్రవర్తులలో ముఖ్యుడు. రుద్రదామనుడనే క్షాత్రపరాజును రెండుసార్లు ఇతడోడించినాడని జునాఘడ్ శాసనంలో "దక్షిణాపథపతేః సాతకర్ణేః ద్విరపి నిర్వ్యాజ మవజిత్యా వజిత్య సంబంధా విదూరత యానుత్సాదనాత్ప్రాప్త యశసా" అని కనిపిస్తుంది. కణ్హేరీ శాసనంలో మహా క్షత్రపరుద్రదామనుని కుమార్తె నొక శాతకర్ణి పెండ్లి చేసుకొనెనని ఉన్నది ఇతడే వాసిష్ఠీ పుత్రుడు. ఇతని కొలువుకు చెందిన ఆనందుని పేరు సాంచీ స్తూపపు దక్షిణ ద్వారము మీద కన్పిస్తుంది. క్రీస్తుపూర్వము 44 వ సంవత్సరము నుంచి 36 యేళ్ళు ఇతడు పాలించెనని కొందరు చరిత్రకారులు.

ఈ పులోమావి కాలంలో రోమను సామ్రాజ్యానికి ప్రభువుగా వచ్చిన వాడు అగస్టస్. క్రీ. పూ. 21 లో శామోస్‌లో ఉన్న అగస్టస్ సీజర్ వద్దకు భారతదేశము నుంచి ఒక రాయబార వర్గము వెళ్ళినది. రోమన్ చక్రవర్తికి సన్నిహిత మిత్రుడైన నికోలాస్ డమస్కెనోస్. అప్పుడు చక్రవర్తి దగ్గరనే ఉన్నాడు. అతడు చెప్పినాడని స్ట్రాబో ఈ విషయాన్ని ప్రస్తుతించినాడు.

అంతియోక నగరానికి చేరేసరికి ఈ ప్రతినిధి వర్గంలో ముగ్గురే మిగిలిపోయినారు. దూర ప్రయాణం కావటంచేత దారిలో మిగిలిన వారు మరణించారు. ఈ ప్రతినిధివర్గం భారతదేశపు రాజు వద్ద నుంచి గ్రీకు భాషలో వ్రాసిన ఉత్తరాన్ని తీసుకొని వెళ్ళినారు. ఈ ఉత్తరాన్ని వ్రాసిన పోరోస్ అనే వాడు తాను 600 రాజులపై అధికారం చెలాయించే సార్వభౌముడనని, అగస్టస్ సీజరుకు స్నేహితుడననిపించుకొనటమే ఈ అధికారం కన్నా తనకు ఇష్టతమమని వ్రాసినాడు. ఎప్పుడైనా తన రాజ్యము గుండా ప్రయాణం చేయదలచితే సంతోషిస్తానని ఏ శుభ కార్యంలోనైనా అతనితో సహకరించటానికి ఉత్సుకతతో నున్నానని పోరొస్ వ్రాసినాడు. సుగంధ లేపాలతోనున్న కానుకలను ఎనిమిదిమంది భృత్యులు సీజరుకు నివేదించారు. మోచేతులు లేని హెర్మిస్ ప్రతిమ, పది మూరల పొడవున్న పాము. నదీ కూర్మము గద్దకన్న పెద్దదైన పావురము ఈ కానుకలలో ఉన్నవి. ఈ ప్రతినిధివర్గము వెంట వచ్చిన సన్యాసి ఏథెన్సు నగరములో అగ్ని ప్రవేశము చేసినాడు. అతడు దహింపబడిన స్థలములో భారు కచ్ఛ దేశపు శ్రమణకుడిట అగ్ని ప్రవేశము చేసెనని చెక్కబడిన రాతిని ఉంచినారట.

ఇంకొక చరిత్రకారుని ప్రకారమా భారతదేశపు రాజు పేరు పండియోన్. పులోమావి. పడుమాన్ అను పేర్లుగల వాసిష్ఠీ పుత్రుడే పోరొస్ అని, పండియూన్ అని ఇక్కడ పేర్కొనబడినాడు. ఇతడే క్రీ. పూ. 31—28 ల మధ్య కాలంలో మగధను జయించినాడు. ఇదే సమయంలో ఏంటొనీని జయించి అగస్టస్ ప్రభుత్వానికి వచ్చినాడు. ఈ ప్రతినిధి వర్గము క్రీ.పూ. 25లో ఇటలీ, గ్రీసుదేశాలను చేరింది.

అసిక, అసక, ములక, సురఠ, కుకుర, అవరంత, అనుప, విదభ, అకరవతి, రాజస, విఝ, ఛీవత, పరిచత సహ్య, కణ్హగిరి, మఛ, సిరితన, మలయ, మహింద, సెతగిరి, చకోర పర్వతములకు అధిపతిగా వాసిష్ఠీ పుత్రుడొక శాసనములో పేర్కొనబడినాడు. ఈ లెఖ్ఖ ప్రకారము మనకు ఆ లేఖలో చెప్పిన 600 రాజులు తేలికగా రాగలరు. ములక, అసక దేశాలు తెలంగాణములోనివి. ములకనాటికి ముఖ్యపట్టణము శ్రీగిరి. సురఠము సౌరాష్ట్రము, విదభయే విదర్భ, ఛీవతమే ఋక్షవతము, పరిఛతము పారియాత్రము, సిరితనమే శ్రీస్థానమైన నేటి శ్రీశైలము మహిందము కళింగదేశము.

ధాన్య కటకములోని భిక్షువులకు వాసిష్ఠీ పుత్రుడిచ్చిన దానమును నాసికలో ఒక శాసనము ప్రస్తుతిస్తున్నది.

ఆ కాలపు ఆంధ్ర రాజులకు గ్రీకు, రోమన్ దేశాలతో సంబంధాలు పూర్తిగా ఉన్నవి. నాగార్జునకొండ వద్ద ఉన్న ఒక ఆయల్ స్తంభము మీద రోమన్ మకుటమును పెట్టుకొన్న ఒక సైనికుడు కనబడతాడు. గడ్డంతో వున్న ఇతనికి పొడుగు చేతుల చొక్కా వలె కన్పించే వస్త్రము, పాంటు ఉన్నవి. ఇంకొక ఆయల్ స్తంభముమీద నగ్నంగా కేవలమొక ఉత్తరీయంతో ఉన్న వ్యక్తిని చెక్కినారు. ఇతని ఎడమ చేతిలో కొమ్ముతో చేసినట్లు భాసించే పానపాత్ర ఉంది. ప్రక్కనే మధు కలశమున్నది. ఇతడే డయోనిసస్ అని గ్రీకు దేశ గాథలలోను శిల్పాలలోను కన్పిస్తాడు. ఈ ఆధారాలనుబట్టి ఆనాడు ఆంధ్రదేశం నుండి గ్రీకు భాషలో లేఖ ఇటలీకి చేరటంలో ఆశ్చర్యం లేదు.

ఆ కాలంలో గల పరిస్థితులకు నేటి పరిస్థితులకు చాలా తేడా ఉన్నది. అనేక సౌకర్యాలున్నా నేటి ఆంధ్రులలో గ్రీస్, ఇటలీల భాషలను తెలిసికొన్న వారెంత మంది ఉంటారు? భారతీయులలోనే వీరి సంఖ్య స్వల్పము. భారత దేశంతో ఉన్న రాజులతోనే రాయబారాలను నడపటం గాక ఎక్కడో దూరాన వున్న రాజ్యాలకు రాయబారాలను, సాంస్కృతిక ప్రతినిధి వర్గాలను పంపటంలో ప్రాచీన ఆంధ్రులే అద్వితీయులు. వారిని స్మరించుకొంటే వారు ఆదర్శ పురుషులై మనలను ఉత్తేజింప చేయగలరు.

—:0:—

ఉత్పల మాలలు - చంపక మాలలు

దిగుమర్తి సీతారామ స్వామి.

కం॥ తెలుఁగులకు చంపకములున్
గలువలు కడుగూర్చు పువులు గావుననే ఉ
త్పల చంపక మాలికలన్
వెలయించెన్ నన్నభట్ట భిజ్ఞుఁడు మిగులన్ ॥

కం॥ జల పుష్పములందొకడున్
స్థల పుష్పములందొకడుగ సౌరభసుభ గో
త్పల చంపకములఁ గైకొని
సలిపెన్ నన్నయ్య ఆంధ్ర శారద పూజల్ ॥

కం॥ లలితోత్పల నయనలు ని
స్తుల చంపక నాసహేమ శోభిత తనువుల్
తెలుఁగు జవరాండ్రు [illegible] జగి
యొలుకన్గవి కూర్చెఁ జంపకోత్పల మాలల్॥

ద్విధా

— విశ్వనాథ సత్యనారాయణ

మిన్నున నెచ్చట నోయొక
సన్నని తెలినీటి బిందు సమితి పడియఁగా
గొన్నట్టి చోటెయచ్చర
యన్నట్లుగఁ దోఁచి పాటయ్యై వినిపించెన్.

ఏకాంత గుహాంతలో నవా
చీఁకటి కోణములఁ జూపునిటిలు వికృతదై
త్యాకార మటులఁగనఁబడి
శోకరవంబొకఁడు గుండె చొచ్చె విడ్రుచుచున్

అచ్చరయైన వెలుంగది
పచ్చని చిఱువాకవోలెఁ బ్రవహించుచు పై
యచ్చర గానధునీసం
పచ్చఁక్రమణంబుగాఁగఁ బంచెమునంబున్

దైత్యాకృతి కన్నయిరులు
నిత్యమ్మగు బురద నల్లనీటి మడుంగై
మత్యధిక ప్రజ్ఞను మో
హాత్యక్తను జేయు దుఃఖ మందింపించున్.

—:0:—

తోలు బొమ్మలాట

— నాయని సుబ్బారావు

ఆంధ్ర దేశమ్ములో బొమ్మలాట పల్లె !
అచట నొక మానవ బ్రహ్మ యవతరించి,
జింకతోల్ కత్తిరించి సృష్టించి సురల,
మేకతోల్ కత్తిరించి నిర్మించి నరుల.

పదను పెట్టి మైకారేకు వలే, నిగార
మైన రంగుల నిరుపైపులందు పులిమి,
సంఘటించిన చిన్ని బెజ్జమ్ములవియు
నేడు వారాల సొమ్ములై యెసక మెసగి,

దానవుల పక్షిగమి జంతు తతిని కూర్చి,
ఉల్లిపొర వంటి తెరమీద యుగయుగాల
నీడలుగ తోలు బొమ్మల నాడి నపుడె.
ఆంధ్ర మా సీమ మొక బొమ్మలాట పల్లె!

ఆ జీవమ్ములు పట్టివెంట గొనిపోనా తోలుబొమ్మల్, సుమ
త్రాజావా మలయాది దేశముల. సర్వ శ్రీదముల్ భారతో
ర్వీజాతామల సంస్కృతి ప్రభలు నింపెన్; తజ్జనానీక హృ
ద్రా జీవమ్ములు రామ భారత కథా రాగమ్ములై విచ్చుకోన్।

కృత్త పక్షజటాయు వేగు పుణ్య జగమ్ము
  లరయురామ స్వామి యభయ ముద్ర,
దైత్యాపహృత వీతధైర్య సీతా శోక
  మూర్తి దేవునికెత్తు మోడ్పుకేలు.
తక్షణ భయజాత దశదిశా రోమాంచ
  కము దశానను శిరః కంపనమ్ము.

లంకా దహన సముల్లా సాంజనేయాతి
   వేల లాంగూల సంచాలనమ్ము.

పట్టి, చేతులు జోడించి, భయవభంగి
తలలు విదలించి, భూన భోంతరము సుడియ
వాల మల్లార్చి. తెరవెన్క వన్నెలాడి
పాటలో భాసమై బొమ్మలాట చెలగు।

పరసతీ వాంఛా విపత్పయోనిధి మున్గి
   నశియించు కీచకోన్మాదు లగుచు,
దాయాదులకు భాగదాన మీని యధర్మ
   సక్త దుర్యోధన స్వాములగుచు.
కులకాంత సభకీడ్చి వలువ లొల్పించు పా
   పాను వర్తులు దుస్ససేను లగుచు,
విలయ వేళా కృశానుల లీల శాత్రవ
   సేన నేర్చెడు పాండు సూను లగుచు,

ఎల్లెడల తానయై విజృంభించు విజయ
రథము నడిపించు పార్థ సారథులు నగుచు,
మర్మ మెరిగిన తెరవెన్క మాయకాని
యూపులో త్రోపులై బొమ్మలూగియాడు।

వారు ప్రశస్త ధర్మ పథవర్తను, లెందు పరోపకారమే
కోరి చరింత్రు; స్వార్థమును గోరి పరాహిత కార్యకర్మతుల్,
వారు నిరస్త ధర్ము;లని వారితమీ తెర బొమ్మలాటలో
వారునువారు పండితులు; వారుసుమంత్రులు, వారు సౌబలుల్।

జాలుగా మురిపాల చాలుగా జాతిహా
   స్యములోని నిద్దా పసందు లొలయ,
టెక్కు పల్కుల వేగుజుక్క బంగారక్క
   తకధిమ్మటంచు తైతక్కలాడ;
నీటుగా పలెవాటు గోటుగా వలపుల
   పేటగా చతురిమల్ వెల్లి విరియ,
వనగూటి కేతిగాడెసగి బంగారక్క
   తైతక్కలకు త్రొక్కు తందనాలు;

అత్త! గారెలు వండవే, యత్త! వలదు
వండవే బూరెలంచును, వారి మధ్య,
వికట హాస్యమ్ము మెరయు, పానకములోని
    ఏలెచేరు, నా జుట్టు పోలిగాడు!

ఆడునవి తోలు బొమ్మలు!
పాడును తోల్బొమ్మ! గడలు పట్టాడించే
వాడును తోల్బొమ్మె! దం
డాడు, తెనుగు తోలుబొమ్మలాట ధరిత్రిన్!

ఇంటి పేరు కస్తూరి వారు. యింట్లో గబ్బిలాల కంపు.

* * *

అమ్మకెత్తరా కోళ్ళ గంప.

* * *

ఉపాయం లేనివాళ్ళని ఊళ్ళోంచి వెళ్ళగొట్టాలి.

— తెలుగు సామెతలు.

ఆంధ్ర ప్రదేశ్

నాటి ఆంధ్రుల సంస్కృతి

— పోతుకూచి శ్రీరామావధాని

సకల కళాపూర్ణులగు రాజులు ఆంధ్రదేశ చరిత్రలో ఎందరో కనుపిస్తారు. శాతవాహన కాలంలో అప్రతిమాన సంపదతో వర్ధిల్లినది ఆంధ్ర దేశం. కీర్తి పతాకల నెగురవేసినారు ఇక్ష్వాకు వంశజులు. జయభేరులు మ్రోగించినారు ఆంధ్ర పల్లవులు. సాహిత్య సరసులు, కళాప్రియులునగు ఆనంద గోత్రజులు, శాలంకాయనులు సాహిత్య బీజములు నాటినారు. విష్ణుకుండినుల కాలంలో చిగురించినది ఆంధ్ర సాహితి. వేంగి ప్రభువులు, ఆంధ్ర దేశాధీశులునగు తూర్పు చాళుక్యుల కాలంలో ఆంధ్ర కవితావాహిని స్వేచ్ఛగా ప్రవహించింది. విజయనగర వీధులలో లలిత కళా సరస్వతి నాట్యమాడింది.

అట్టిది ఆంధ్రావని. "ఆంధ్ర" శబ్దము జాతి పరముగా ఐతరేయ బ్రాహ్మణములో మొట్టమొదటగా కనుపిస్తుంది. శాంఖ్యాయన శ్రౌత సూత్రములలో "ఆంధ్రు" లనబడు జాతివారు పేర్కొనబడినారు. క్రీస్తుపూర్వము మూడవ శతాబ్దమున ఆంధ్రులనబడువారొక సామ్రాజ్యమును స్థాపించినారని, మగధ రాజ్యము తర్వాత భారతదేశమున అత్యున్నత దశ ననుభవించినది ఆంధ్ర రాజ్యమని చంద్రగుప్తుని ఆస్థానమందున్న మెగస్తనీసు వ్రాసినట్లు ప్లినీ తెలుపుచున్నాడు.

ఆంధ్రులు వింధ్య ప్రాంతమునకుచెందిన ఒక తెగవారని, పశ్చిమము నుండి తూర్పునకు మరలి వచ్చి కృష్ణ, గోదావరి నదుల మధ్యనున్న ప్రదేశమున నివాస మేర్పరచుకొనిరని యూహించినాడు శ్రీ శ్రీనివాస అయ్యంగార్. ఆంధ్రుల రాజధాని "తెలవాహ" నదీ ప్రాంతమున కలదని "సెరివాని జాతకము" తెలుపుచున్నది, "తెలవాహ" నదిని "తెల్" లేక "తెలింగిరి" తో పోల్చినాడు శ్రీ భండార్కర్. "జాతకము" లో పేర్కొనబడిన ఆంధ్రపురము **బెజవాడయని** నిర్ణయించినాడు ప్రొఫెసర్ రాయచౌదరి.

శ్రీముఖుడను రాజు కాణ్వుల నంతమొనరించి ఆంధ్ర రాజ్యమును స్థాపించెను. ఆంధ్రరాజులు మొట్టమొదట అశోకుని మరణానంతరము మౌర్యవంశ ప్రతిభ తగ్గజొచ్చి అచిరకాలములోనే అంతరించెను.

దీనిమూలముగ సామంతులుగనుండిన ఆంధ్ర రాజులు కడపటి మౌర్యులను ఇసుమంతయు లెక్కచేయక వారిని ధిక్కరించి స్వతంత్రులైరి. ఈ స్వతంత్ర రాజులనే ఆంధ్ర వంశమని, శాతవాహన వంశమని పురాణములు పేర్కొనినవి. పురాణములు రచింపబడక పూర్వమే ఆంధ్రదేశమును శాతవాహను లాక్రమించిరని చెప్పుటకు నిదర్శనములు కలవు.

శాతవాహన సామ్రాజ్య కాలమున ఆంధ్రదేశము అప్రతిమాన సంపదతో వర్ధిల్లి, భావిభారతదేశ నాగరక సంస్థకు పునాదులు వేసినది. ఒక్కొక్క నగరము నిగమములుగా విభజింపబడి నేటి తాలూకాల వంటి విభాగములకు దారి తీసినది. ఈ నిగమములకు పురపాలక విధులు, శాంతి రక్షణలు ఇవ్వబడుటచే ఇది కొంత స్వతంత్ర సంస్థగా పోషింపబడినది. వాణిజ్యమునకై వడ్డీ వ్యాపారమును, పూంజీ విధానమును (Capitalisum) లేవదీసిన వారు ఈ నిగమములలోని ఆంధ్రులే. వాణిజ్యరంగమున నేటి ఇండొనీషియా, సయాం, ఇండో-చైనా, చీనాల వరకును పశ్చిమమున గ్రీసు, ఇటలీ దేశముల వరకును వీరి నౌకలు స్వేచ్ఛగా నడచినవి.

క్రీస్తుపూర్వము 28వ సంవత్సరమున ఆంధ్ర సామ్రాట్టు ఇటలీ రాజగు ఆక్టేవియస్ సీజర్ వద్దకు రాయబార

లేఖను గ్రీకు భాషలో వ్రాసి పంపినట్లు పాశ్చాత్య చరిత్రకారులే చెప్పినారు. ఆ నాడు ఈ సామ్రాట్టుక్రింద అరువందల మహా నగరములుండెడివని, యీయనతో సమానమైన రాజు ఆక్టేవియస్ సీజరేనని పేర్కొనబడినది. ఇదే సమయమున గ్రీకుదేశపు ఆకారములతోను, దుస్తులతోను వున్న శిల్పములు నాగార్జునకొండవద్ద లభించినవి. ఇట్టి ప్రయత్నములకై మోటుపల్లి, బందరువద్ద గూడురు గొప్ప రేవులుగా పెంచబడినవి. నౌకా చిహ్నములుగల నాణెములు యజ్ఞశ్రీ వేసినాడు. ఆంధ్ర శిల్పులు నిర్మించిన సాంచీలోని మహాద్వారముతో భారతీయ శిల్ప కళకు శంకుస్థాపన మహోత్సవము జరిగినది. ఈ శిల్పకళ ఆసియా ఖండ మంతటను వ్యాపించినది. ఇదేకాలమున ఆంధ్ర దేశములో మహాయాన బౌద్ధమతము బయలుదేరి భారతదేశము నంతటను వ్యాపించినది. ఆనాటి ఆంధ్రుల కృషి జరుగకపోతే ప్రపంచములో మహాయాన బౌద్ధమతము కన్పించేది కాదు. ఆచార్య నాగార్జునుడు, ఆర్యదేవుడు, బుద్ధపాలితుడు, భావ వివేకుడు, చంద్రకీర్తి, ధర్మకీర్తి మొదలుగాగల బౌద్ధమతాచార్యులను ప్రపంచమున కర్పించినది ఆనాటి ఆంధ్రదేశము. ఈ కాలముననే శకులపై తమకు లభించిన గొప్ప విజయమును చిరస్మరణీయము చేయుటకై శాలివాహనశకమునొకదానిని స్థాపించిన వారానాటి శాతవాహనులు. ఈ శకముతో భారతదేశమునకు పంచాంగ మొకటి అర్పింపబడినది.

క్రీస్తు తర్వాత 249లో కొందరు యీ లాంధ్రుల నోడించిరి దక్షిణమున కాదంబులు, పల్లవులు, వేంగి రాజులు ముట్టుముట్టి శాతవాహన సామ్రాజ్య పతనమునకు కారకులైనారు. శాతవాహన సామ్రాజ్యము విచ్ఛిన్నమైన తరువాత పల్నాడులో బయలుదేరినారు పల్లవులు. వీరి తర్వాత ఆనంద రాజులు, శాలంకాయనులు, విష్ణుకుండినులు వరుసగా ఆంధ్ర దేశాన్ని పాలించారు. బాదామి చాళుక్య రాజగు రెండవ పులకేశి విష్ణుకుండినులతో యుద్ధము చేసి వేంగి రాజ్యము నాక్రమించి తన తమ్ముడైన కుబ్జ విష్ణువర్ధనుని చాళుక్య రాజ్య ప్రతినిధిగా నియమించినాడు.

ప్రాచీన కాలమున ఆంధ్రులు, మహారాష్ట్రులు ఒకేతెగకు చెందియున్నట్లు ఆకాలమున ఆంధ్రులు, కన్నడులు కలసి పోయిరి. పదునాల్గవ శతాబ్దమున కూడ శ్రీనాథుడు తనది కర్ణాట దేశమని, తనభాష కర్ణాట భాషయని చెప్పుకొనినాడు. నేడు తెలంగాణాయని వ్యవహరింపబడే దేశము, గుంటూరు నెల్లూరు జిల్లాల పశ్చిమ భాగము, రాయలసీమ, మైసూరులోని ఉత్తర భాగము కలసి కర్ణాట దేశముగా వ్యవహరింపబడినది. ఈ కర్ణాట దేశమున జైనులు విచ్చలవిడిగా వ్యవహరించుచు వైదిక సంస్కృతిని నాశనము గావించసాగిరి. పంప, రన్న, పొన్న అను వారు జైన సంప్రదాయ పరముగా మహాభారతమును కన్నడములో వ్రాసినారు. అక్షరాభ్యాసములో సయితము ''ఓం నమః శిద్ధం నమః'' అని జైన సిద్ధులకు నమస్కారము చేయించినారు ఇప్పటికికూడ మన గ్రామములలో ఈ దురవస్థ కనిపించుచున్నది కొందరు తెలివైన వారు ''ఓం నమః శివాయ సిద్ధం నమః'' అని కొంత దిద్దినారు,

అప్పటికి ఆంధ్ర కన్నడములకు లిపి ఒక్కటే. భాషలో ఎక్కువ భేదము లేదు, వ్యాకరణములోకూడ మార్పు కనుపించదు. దైవవశాత్తు కొంతకాలానికి ఆంధ్ర దేశంలో జైన ప్రాబల్యం కొంత క్షీణించసాగింది. రాజులు వైదిక మతాభిమానులైనారు. ఈ తరుణం కనిపెట్టి కన్నడులు అనేకులు మనదేశమునకు వలస వచ్చినారు. వారిలో నారాయణభట్టు ఒకడు. ఆయన నన్నయ సతీర్థుడు, ఇద్దరు కలసి తెలుగు భాషను సంస్కరించి, లిపిని సంస్కరించినారు. ఈ నూతన లిపి నన్నయ చెప్పిన నందంపూడి తామ్ర శాసనములో కన్పిస్తుంది. తెలుగు భాషలో కావ్యము చెప్పిన ఆదికవి నన్నయ. ఆదిమ కవి నన్నయ. ఆదిమ కృతిపతి రాజరాజనరేంద్రుడు మన సాహిత్యమునకు జనకులని చెప్పవలెను. పండ్రెండవ శతాబ్దమున కుమారసంభవ మను మహా కావ్యమును రచించి ఆంధ్ర భాషకు గొప్ప మేలు కావించినాడు ఆంధ్ర రాజగు నన్నెచోడుడు.

తూర్పు చాళుక్యుల తర్వాత ఆంధ్ర దేశమును పరిపాలించిన రాజులు గణపతి వంశజులు. వీరినే కాకతీయులందురు. వీరి రాజధాని ఓరుగల్లు. హనుమకొండలో ఈ రాజులచే నిర్మితములైన వేయి స్తంభముల గుడి ప్రకృతి రమణీయములు. ఓరుగంటి రాష్ట్రములోకూడ జైన మతము ప్రబలియుండెను. హనుమకొండ యందలి పద్మాక్షి దేవాలయమున్న కొండమీద ఇప్పటికిని జైన శాసనములు, జైన ప్రతిమలు కానవచ్చును. గణపతి రాజు సమకాలీనుడు కవిబ్రహ్మ తిక్కన సోమయాజి.

ఈ రాజులలో సంస్కృత విద్యాభివృద్ధికి తోడ్పడిన వాడు ప్రతాపరుద్రుడు. విశ్వనాధ కవియను నాతడు ప్రతాప రుద్రీయమను సాహిత్య గ్రంథమును రచించి యాతనికంకిత మొనర్చినాడు. కాకతీయుల కాలములో ఆంధ్రుల ఉత్తమ శిల్పకళ వైభవోపేతముగా విరాజిల్లినది. కవితా వతంసులు, కావ్యతీర్థులనగు తిక్కన, మారన, కేతన, మంచెన, గోనబుద్ధుడు, పాల్కురికి సోమనాథుడు, భద్ర భూపాలుడు, రావిపాటి తిప్పన్న, నాచనసోముడు, భాస్కరుడు, మల్లికార్జున పండితారాధ్యులు మొదలగువారు వీరి కాలములోని వారే.

కాకతీయ రాజ్య మంతరించగనే ఆ రాజ్యమందుండిన సామంతులు, సేనానులు స్వతంత్ర రాజ్యములను స్థాపించినారు. అట్టి వారిలో రెడ్డి, వెలమరాజులు పేర్కొనదగిన వారు. రెడ్డి రాజుల పతనముతో ఓఢ్ర రాజులు తూర్పు తీర ప్రదేశమును, గుంటూరు సీమను ఆక్రమించినారు.

అదే కాలమున రెడ్డి వెలమ రాజ్యములతోబాటు మరియొక దిక్కున విజయనగర సామ్రాజ్యము స్థాపింపబడినది. విజయనగర రాజులు, రెడ్డిరాజులు ఆంధ్ర సరస్వతికి అనూన సపర్యలు గావించినారు. కళింగముపై దండెత్తిపోయిన సమయమున

''తెలుఁగ దేలయన్న దేశంబు తెలుఁగేను
తెలుఁగు వల్లభుండఁ దెలుఁగొకండ
యెల్ల నృపులు గొలువ నెఱుఁగవే బాసాడి
దేశ భాషలందుఁ దెలుగులెస్స''

అని ఎలుగెత్తి చాటినాడాంధ్ర విష్ణువు శ్రీకృష్ణ దేవ రాయలు.

విజయ నగర సామ్రాజ్యముతో ఆంధ్ర వైభవము మరల తల యెత్తినది. భారతీయ సంస్కృతి సుప్రతిష్ఠితమై ఎదురీత కొట్టసాగినది. వైదిక సంస్కృతిని విచ్ఛిన్నము చేయ జూచిన తురుష్క రాజులను ప్రతిఘటించినది ఆ రోజులలో విజయనగర సామ్రాజ్యమే. ఈ కాలము మన ప్రబంధ యుగము. ధర్మ శాస్త్ర పరిష్కారము ఈ సమయమున జరిగినది. వేద భాష్యములు పూర్తిగా రచింపబడినవి. సప్త స్వరములను ఆలపింప జేయగల రాతితో స్తంభములు కట్ట బడిన హంపీశిథిలములు నేటికిని అపూహోన్నత దశను మరపు రానీయవు. విజయ నగరాధీశుని ప్రాసాదమున ఆశీనులైనవారికి విరూపాక్షుని దివ్యమంగళ విగ్రహము కన్పించునట్లు భవనములు నిర్మింప బడినవి.

ఇట్టి ఆంధ్ర దేశము శివాజీ మొదలగు వారికి మార్గదర్శకమై భారతీయ వైభవమును, స్వాతంత్ర్య వాంఛను ప్రజ్వలింప జేసినది. ఈ సంస్కృతిని ఆంధ్రులు, మహారాష్ట్రులు కలసి తంజావూరు, మధుర, పుదుకోట మొదలగు దేశములకు కొనిపోయినారు. అక్కడ వీరు కావించిన వైజ్ఞానిక కృషి సరస్వతీ మహల్ భండాగారమున నేటికిని లిఖిత గ్రంధ రూపమున కన్పించు చున్నది. ఆ భండాగారము మనకు దక్కుతుందా అనే విషయముతో నేటి ఆంధ్రుల నడత సందేహానికి తావిస్తున్నది.

క్షేత్ర మెరిగి విత్తనము, పాత్ర మెరిగి దానము.

* * *

ఇంట్లో ఈగల మోత, బయట పల్లకీల మోత.

— తెనుగు సామెతలు.

కనకాభిషేకము

— శిసగసి నరసింహస్వామి.

తుంగభద్రా నదీ తోయబిందుచ్ఛటా
ముక్తాఫల ప్రభామూర్తు లేమి?
చంద్ర శాలాస్థ యోషా నేత్రనీలాబ్జ
రధ్యా మనోజ్ఞతోరణములేమి?
దేవాలయోత్థ ఘంటావాదనిర్గళ
త్సంగీత సోదరస్వనము లేమి?
బహుదేశ జనపరస్పరభాషణక్రియా
శ్రుతిపేయభవదు పశ్రుతులవేమి?

నలుమొగమ్ముల శిష్యగణమ్ము గొలువ
పరమమునిరాజి సేవించు బ్రహ్మవోలె
విపుల విద్యాపురీ రాజవీథియందు
నడచు కవిమోముపైన చిర్నగవు లేమి?

ఎవడా లోకవిలోకనోత్సవుడు, బ్రాహ్మీసుందరీ నూపురా
రవపాణింధమ సాహితీపరుడు, గీర్వాణాంధ్రభాషాసుధా
ర్ణవ గంభీర రహస్యపారగుడు, సర్వప్రాకృతగ్రంథవై
భవపాతంజల భాష్యభోజన మహాభాగుండు? శ్రీనాథుడా!!!

3.

"జయ! జయ! భారతీ చరణ సారస నమ్రమణీ కిరీట, దు
ర్జయ జయ! శత్రురాణ్మకుట రాజితపూజిత పాదపీఠ! వి
స్మయ జయశాసనాక్షర విరాజిత సంస్తవపాఠ! బుద్ధి సం
జయ! జయ! ప్రౌఢరాయ! మృగశాబక శాసనపుష్పసాయకా.

4

బ్రాహ్మీదత్త వరప్రసాదుడ, నురుపర్జిజ్ఞా విశేషోదయా
జిహ్మస్వాంతుడ, నీశ్వరార్చన కళాశీలుండ. నభ్యర్హిత
బ్రహ్మాండాది మహాపురాణ చయతాత్పర్యార్థ నిర్ధారిత
బ్రహ్మజ్ఞాన కళానిధానుడనునే ప్రౌఢావనీ వల్లభా।

5

ఈక్షోణిన్ ననుబోలు సత్కవులు లేరీనాడు; వంపా విరూ
పాక్షస్వామి జటానికుంజల తికాప్రాగ్భార కోటీనట
ద్దక్షద్బ్రసవామృతాక్షయ మధుద్వైరాజ్యభారమ్మున
ధ్యక్షించున్ సుమిప్రౌఢభూపతి।మదీయప్రౌఢ సాహిత్యముల్

6

శ్రీనాథుండను నేను, దివ్య కవితాశ్రీనాథుడన్, సద్యశ
శ్శ్రీనాథుండను, పాండితీజిత విపశ్చిన్నాథుడన్; యుష్మదా
స్థానీ పండితనాథునోర్చిజయమున్ చాటించి తద్డిండిమ
ధ్వానమ్ముల్ సమయింతు శాశ్వతముగా; ప్రౌఢావనీశాసనా।''.

7

అని శ్రీనాథుడు సవిధా
సనము సధిష్ఠించె. గుసగుసల్ కొల్వున హె
చ్చెను, భూపతి డిండిమునా
ననముంగని సవ్వుకొనెను నవ్వెసతండున్.

8

చంద్రభూషక్రియాశక్తి సాంబమూర్తి,
యభినవోభయభారతి; యతని మధ్య
వర్తిగా తేడు వరియింప, వాదమునకు
మించి నాథు లిద్దఱుపక్రమించినారు—

9

వేదాంతవనిజొచ్చి వెడలెను శ్రీనాథు
డరుణనాథుడు దిక్కుమరచి తిరిగె;
తర్కశాస్త్రాంభోధి తరియించె శ్రీనాథు
డరుణనాథుడు మధ్యయందె మునిగె;
పాతంజలముగ్రుక్కపట్టెను శ్రీనాథు

డరుణనాథుడు మిన్నులబ్టై చూచె;
కావ్యనాటకవీథి కడముట్టై శ్రీనాథు
డరుణనాథుడు వెనుకంజవైచె;

నరుణ గిరినాథు పదనమ్ము నాక్రమించు
నీలిమ నరేంద్రునకు గుండెగాల మయ్యె;
చంద్రభూషక్రియాశక్తి సన్నహాన
మఱిగి శ్రీనాథునకు కంఠహారమయ్యె.

10

పండితు లెల్ల డిండిమ విపక్షకులక్షయ శిక్షణైకవా
గ్దండ పరంపరాజయ పతాకల క్రింద సుఖోపవిష్టులై
యుండిరి గాని; కుండిన పురోచ్ఛలపద్మవనీ కుమారమా
ర్తండుడు చండరూపమున తాపము గూర్చుబెఱుంగరజ్ఞులై.

11

సర్వజ్ఞుకు డిండిముడని
గర్వింతురు పూర్వవిజయకారణ మహిమన్;
సర్వజ్ఞ వేముని సభా
శర్వాని విద్యాధికారి సభ్యులెఱుగరున్.

"ఒకడు హిమాలయమ్ము. మఱియొక్కడు మేరు వాకొక్కడింద్రదే
శిపస్మృతి కెత్తు పండితుకు; చేసిన వాదములో జయధ్వజ
మ్మొక కవిరాజు దంచు సమయోచిత మేఘగభీర వాక్కులం
బ్రకటనజేసి శక్తి, సమవర్తి మహీపతి జూచియిట్లనున్.

13

"పలికిన యట్టులీ యరుణ పండితమౌళి స్వకీయవీరద
మ్ములు త్యజియించి డిండిమము భగ్నముగా నొనరింపగానను
జ్ఞలు దయసేయ గావలయు సత్వరమే; మఱిజేతకున్ సభా
స్థలి కని సార్వభౌమ బిరుదమ్ము నొసంగవలెన్ మహాప్రభూ!

14

మన శ్రీనాథుడు పండితాగ్రణి, కవీట్ మాన్యుండు. బ్రహ్మాణి భూ
మిని పుంరూపము నెత్తివచ్చెనిటు; మీమీ ప్రౌఢసాహిత్య పో
షణ చంద్రార్క మహీధర స్థిరయశస్సౌభాగ్య సాక్ష్యమ్ముగా
కనక స్నాతుని జేయుదేని యొకసత్కారమ్మటో వీనికిన్.''

15

అదివిని గౌడభట్టు వినతాస్యుడుగా సడిదక్కి పార్శ్వమం
దొద్దిగిన కంచుఢక్కగని యూర్చెను. స్వప్నములట్లుగా పురా
భ్యుదయములన్ గణించి కొనిపోయి సభాసదనాంతరమ్ములో
వదలెను దానినిన్; వినదవార్నిధి తీవ్రకుఠారధారకున్.

16

చిరకాలమ్ము కవీభకేసరికరస్థేయమ్ముగా పాండితీ
వరసామ్రాజ్యమునేలు ఢక్క. జయరంభాసుందరాంకమ్ము; ని
ష్ఠుర దైవ ప్రతికూల శాత పరశుక్షుద్రాహతి ధ్వస్తమై.
విరిగెన్ ముక్కలుముక్కలై; నృపతిహృద్వీథీవ్యథాపాదియై.

17

గాథామయ ఢక్కను శ్రీ
నాథుడు పగిలింప; నరుణనాథుడు విద్వత్
పాథేయము క్షీణించిన
యాథార్థ్యము దోపవెల్లనయ్యెను సభలో.

18

ఎన్నడనుకోని యోటమి నెదురుకొన్న
పండితోద్భటు డిండిమభట్టు జూచి,
బ్రహ్మవర్చస మాకృతి పాదుకొన్న
ప్రౌఢ కవిరాజు శ్రీనాథ భట్టుజూచి—

19

తలపులు నింగి ముట్టి వసుధాపతి రాయలు లేచి సభ్యులన్
గలయగ జూచి, నేడు సుదినమ్ము తమోంధమనోగృహమ్ములో
వెలుగులు చూరలిచ్చిన రవింగవిదేవుని గాంచినారమి
య్యలఘుని సత్కరింపవలదా యని కన్నుల సన్నచేయగా

20

వారమృగేంద్ర మధ్యమ లవార్యముగా మణి మౌక్తికాదిదీ
నార సువర్ణటంకములనంతముగా పలుపళ్లెరమ్ములం
గూరిచి తెచ్చుచుం గొలువుకూటములో సవరించుచుండ; భూ
దారుడు వీక్షణోర్మ్యలు కదల్చెను డిండిమనాథజేతకై.

21

మంగళతూర్యనాదములు మంద్రముగా ధ్వనియించుచుండగా;
ఖంగున వేదమంత్రముల ఖండముగా ద్విజులుచ్చరింపగా;
సంగత పండితోత్తములు స్వస్తివచస్సులు పల్కుచుండగా;
చెంగున లేచి వారసరసీజ వినేత్రలు నాట్యమాడగా.

22

కాంచీ కంకణ నిక్వణమ్ములు చెలంగన్ చెల్వలందింపగా
ప్రాంచత్కాంచనటంక మౌక్తికమణీ వారమ్ము చేనించి, రో
మాంచాంకూర భరమ్ము మోయు కవిసమ్రాట్ స్వామినిన్ తీర్థమా
డించెన్; ప్రౌఢ మహీధవుండు సభయచ్చే నిర్నిమేషమ్ముగాన్,

23

చంద్ర భూష క్రియాశక్తి రాయలు మెచ్చి
మనసులో మేలి దీవనలు పలుక;
ప్రౌఢరాయలు కృపాపార నేత్రాపాంగ
తరుణరోచుల సుధాధారగురియ;
సపణ నాథుడు గర్వభరదూరుడై వచ్చి
యనురాగ పరిరంభ మాచరింప;
శిష్య పర్యులు భక్తిసీమా మనోజ్ఞులై
సంతోష జలధిలో స్నాన మాడ;

వార హరిణేక్షణా శ్రపః స్వర్ణ రత్న
రమ్య తాటంక రుచులు హారతులు త్రిప్ప;
మౌక్తిక మణీక దీనార మధుర వృష్టి
నోలలాడె కవీట్టు ముత్యాల శాల.

24

నన్నయభట్టు, తిక్కన మనస్వియు, నెఱ్ఱన, పాలకుర్కి సో
మన్నయు, భీమనార్యుడును నంబర మార్గము నందు నిల్చి మా
రన్న తనూజు మౌళిపయి రాల్చిన మల్లియ లక్షయమ్ములై
కన్నుల నించు ముత్తెములుగా రహియించెను మంటపమ్ములో.

25

అపుడు కవిప్రభుండు వినయాధిక బంధుర వాక్కుదోప భూ
మిపతి సదస్యులంగనుచు, మీరిది డిండిమ భట్టు మీదనా
కుపగతమైన గెల్పనుట యుక్తము గాదు; వివాద భూమిలో
నపజయమైన గాని జయమైన నెటున్ వ్యవహార సత్యమే.

26

మతినిది గెల్పటంచు నభిమానము పూనను నేను, శారదా
ప్రతినిధి కెచ్చు తగ్గులను భావము లేమి? సభాప్రవృత్త స
త్కృతి యిది మీ మనస్వితకు దిగ్జయ దివ్యపతాక, కాశ్య పీ
పతి యెదలోని భారతికి బాహ్య సమర్చన మంచు బల్కగా-

27

జయజయ సాధువాదములు సంకుల మయ్యెను కొల్వులో, ధరా
దయితుని మోము దమ్మిపయి తమ్ములు పూచెను, గౌడ డిండిమా
భయు హృదయమ్ము వెన్నెలలు పారణజేసెను, భావనా మహో
దయమును నాగలేడు కవిదైవము దీవెన లాడు తేనియై.

28

పంపా విరూపాక్ష బహు జటాజూటికా
రగ్వధ ప్రసవ సౌరభ్య లహరి,
తుంగభద్రా సముత్తుంగ వీచీఘటా
గంభీర ఘుమ ఘుమా రంభ శక్తి,
కళసాపురప్రాంత కదళీ వనాంతర
ద్రాక్షాలతా ఫల స్తబక పంక్తి,
కర్ణాట కామినీ కర్ణహాటకరత్న
తాటంక యుగధాళ ధళ్యరేఖ,

కుచయుగ క్షీరవారాశిఁ గురిసి శార
దాంబికాదేవి నీదు ముత్యాల శాల
భువన విజయమ్ము గావింప బూనుగాత!
ప్రౌఢ దేవేంద్ర రాయ! భూపాలవర్య!

29

కవి మహేశ్వర సాళీః ప్రకార మొకటి
ప్రౌఢ భూపతి సాదర ఫణితి యొకటి
పండితానంద సంస్తవపార మొకటి
బలిసి; ముత్యాలశాల క్రొంబులకరించె.

30

శ్రీ విరూపాక్ష జూటికా శిఖర విహర
మాణ మందాకినీ నిమ్నగా నిభృతమ
హోర్మికా మాలికలు పొంగి యుఱికి, శంభు
పాదపావన శతపత్త్ర పాళి తడిపె.

31

"విద్యా సరోజాత సృదజాతుడు తండ్రి
మారయ్య, సుకుమార మధుర తనువు;
పతి దేవతాచార పర్యాప్త మతి తల్లి
భీమాంబ, శీలలక్ష్మి మహిమము;
సాహిత్య సామ్రాజ్య సార్వభౌముడు తాత
కమలనాభా మాత్య, విమల వాక్కు;
సురకోటి కోటీర శుభ్రపాదుడు వేల్పు
పార్వతీ వల్లభు, ప్రాభవమ్ము;

నాలుగంశమ్ము లేకమై యోలగించి,
సర్వ మోహన కారణ జన్మమెత్తి;
ప్రౌఢరాయ క్షితీంద్రుని పండిత సభ
ఫలము పండించుకొన్న తపస్వి యితడు"

32

అనుచు వామన భట్టు హృదంతరాంత
రముల బల్కించు కొన్న భారతి సమీర
వీచికాడోలికల తూగి విజయనగర
వీధులం జుట్టి; మఱి కొండవీడు జేరె.

రెడ్డి రాజులు - ఆంధ్ర భాషా పోషణ

— కె. విశ్వేశ్వరరావు

భాషాభివృద్ధికి రాజు నాదరణ అత్యంతావశ్యకము. తరుమైత్రి లేని లత అభివృద్ధి చెందుట ఎంత కష్టమో ప్రభుత్వాదరణ లేని సాహిత్యము అభివృద్ధి గాంచుట అంత దుష్కరము. కవిరాజులు, సారస్వతాభివృద్ధికి తోడ్పడిన ప్రభువుల చరితము లెంత విన్నను తనివి తీరదు. పదమూడవ శతాబ్ది మధ్యము నుండి పదునైదవ శతాబ్దపు నడుమ వఱకును తెనుఁగు దేశమును పరిపాలించిన రెడ్డి ప్రభువులు కవులును, కవిపోషకులునై యున్నారు. ఈ రెడ్డి వీరులును, వెలమ పద్మనాయక వీరులును ఆంధ్ర సామ్రాజ్యమును క్రీ॥ శ॥ పంన్రెండు, పదుమూడవ శతాబ్దములలో పరిపాలించిన కాకతీయ చక్రవర్తులయొద్ద మొదట సేనానులుగను, సేనానాయకులుగను ఉండెడివారు తరువాత ఈ సేనాధిపతులే కొన్నికొన్ని ప్రాంతములకు ఏలికలైరి. అయ్యును, పదుమూడవ శతాబ్దమునందలి తుది భాగము వఱకును ఈ దండనాయకులు కాకతీయ రాజాధిరాజులకు సామంతులుగనే ఉండిరి.

ఇట్లు కాకతీయ సైన్యమున తొల్దొల్త సేనానులుగను సేనాపతులుగను ఉండి, పిదప సామంతులై, అటు పిమ్మట స్వతంత్ర ప్రభువులైన వారిలో గుంటూరు మండలము నందలి కొండవీడును ముఖ్యపట్టణముగా ఒనరించుకొని పరిపాలించిన రెడ్డిఱేండ్లు చాల ప్రసిద్ధులు. ఈ రెడ్డి వంశమునకు (దేసటి) ప్రోలయ వేమారెడ్డి (క్రీ శ. 1320-1349) మూలపురుషుడు. ఈతఁడు గోదావరి, కృష్ణ, పినాకినీ నదీత్రయముచే ఆవృతమైన మధ్యాంధ్రదేశమును పరిపాలించెను. ఈతని ముఖ్యపట్టణము గుంటూరు మండలము నందలి 'అద్దంకి.' కవిత్రయము నందలి చదలువాడ ఎఱ్ఱాప్రగడ యీతని యాస్థాన కవి. ఈ ప్రబంధపరమేశ్వరుడు తారచించిన రామాయణ మహా ప్రబంధమును ప్రోలయ వేమారెడ్డి కంకితమిచ్చెను. ఈ మహా ప్రబంధమింకను లభింపలేదు. వేమారెడ్డి యీ రామాయణమును అత్యాదరముతో అవధరించెడివాడట. ప్రోలయ వేమారెడ్డి సాహిత్య ప్రియుఁడేకాక, సంగీతమునఁగూడ చాల రసికుఁడని శంభుదాసుని హరివంశ మిట్లు చెప్పుచున్నది.

క. కేళాదిరాయ వితరణ
కేళీ నిరపాయ నృత్యగీతకథా లీ
లా లలితోత్సవ నిరతి శ
యా లంకృత భాగ్య సుస్థిరాయుర్భాగ్యా!

ఎఱ్ఱాప్రెగ్గడ తారచియించిన హరివంశమును కూడ వేమారెడ్డికే యంకిత మొనరించెను. వేమారెడ్డిని ఎఱ్ఱాప్రెగ్గడ హరివంశములో ఇట్లని స్తుతించెను.

సీ. అగ్రహారములు వి। ద్యాతపోవృద్ధ వి
ప్రులకిచ్చి యజ్ఞక। ర్తలు గమనిచెఁ;
గొమరారఁ జెఱువులు। గుళ్ళు ప్రతిష్ఠించి
లోక సంభావ్యము। లుగ నొనర్చె;
నిధులు, నల్లిండ్లును। నిలిపెఁ; దోటలు, సత్ర
ములు, చల్వపందిరు। ల్వెలయఁజేసె;
హేమాద్రి పరికీర్తి। తామితవ్రతదాన
నివహంబు లన్నియు। నిర్వహించెఁ;

తే.గీ. జేసెఁ; జేయుచునున్నాఁడు; । సేయనున్న
వాఁడు పునరుక్తకృతి శుభా। వలుల నెల్లఁ;
ననఁగ, శ్రీ వేమవిభునక। య్యలరు పేర్మి
వశమె వర్ణింపఁ దద్భాగ్య। వైభవంబు.

సీ. కేయూర కంకణా । కృతిఁ బరాక్రమితతో
రణములు బాహుభూ । షణత నొంద,
ననుకూల గృహిణి చాడ్పున నృపశ్రీ యొద్ద,
గదలక సకల సౌఖ్యముల నొసగ
నమృత సేవనము చందమునను సద్ధర్మ
తాత్పర్య మధిక మోదంబుఁ బెనుపఁ
గరతలామలక వి । ఖ్యాతి నాతత నీతి
గరిమంబు నిజ వివే । కమున వెలయ

తే. జాహ్నవీ ప్రవాహము భంగిఁ జరిత మఖిల
భువన పావన పరిపూర్తిఁ । బొలుపు మిగుల
బరగు వేమ క్షమానాథు । పాటి నృపులు
గలరె యెవ్వారు ధారుణీ । తలము నందు?

వేమ విభుని కాలమున అనఁగా పదునాల్గవ శతాబ్ది ప్రథమ భాగములో ప్రాక్సముద్ర తీరమున 'మోటుపల్లి' యను రేవు పట్టణము అభివృద్ధి చెందియుండెను. అచటి సముద్రపు టవలియొడ్డున ఉన్న తవాయి (Tavai) తరుణాసిరి (Tenneserim) మున్నగు ద్వీపాంతరముల నుండి ఓడ వ్యాపారములు చాల జరుగుచుండెడివి. ప్రోలయ వేమారెడ్డి యొక్క సోదరుడగు మల్లారెడ్డి యీ మోటుపల్లిని వశ వఱచుకొనెను. ఈ విషయమును అతడు సముద్రుని ప్రీతి గావించిన విధమును, ఎఱ్ఱాప్రగడ యిట్లు వ్రాసియున్నాడు.

శా. బాహాదర్పమునం బ్రతీప ధరణీపాలావళిం ద్రోలియు
త్సాహోదగ్రుఁడు మోటుపల్లిగొని సప్త ద్వీప సద్వస్తు సం
దోహంబున్ దనకిచ్చు నెచ్చెలి సము । ద్రుం బ్రీతిఁ గావించుచు
న్మాహాత్మ్యంబు వహించె మల్లరథినీ । నాథుండుగాఁ దోర్ధతిన్

ఇట్లు మల్లారెడ్డి మోటుపల్లిని జయించి తన యన్నయగు వేమారెడ్డిని ఆతత శ్రీ సముపేతునిజేసి ఎఱ్ఱాప్రెగ్గడను సంతోష పరచినప్పుడే అతడు చేతో మోదమెలర్ప రామ కథను వ్రాసి ఇంకను తనియక వేమారెడ్డి కంకితముగ హరి వంశ పురాణము నితడు రచించినట్లు ఈ పద్యమువలన విశదమగుచున్నది.

శా. నా తమ్ముండు ఘనుండు మల్లరథినీ । నాథుండు నిన్నాతత
శ్రీతోడన్ సముపేతుఁ జేసి యెలమిం । జేపట్టి మా కిచ్చుటన్
జేతోమోద మెలర్ప రామకథముం జెప్పించి యత్యుత్తమ
ఖ్యాతి జెందితి నింక నుందనియనేఁ । గావ్యామృత స్వాదనన్

ప్రోలయ వేమారెడ్డి ఎన్పదినాలుగుచోట్ల దుర్గములను నిర్మించి తన బంధువుల నా దుర్గాధిపతులుగ నియమించెను. ముప్పదియాఱు అగ్రహారములు దానమొసంగెను. శ్రీశైలము అహోబిలములందలి దేవాలయములకు మెట్లు కట్టించెను.

ఈతని యాస్థానమున లొల్ల మహాదేవ కవియను నొక మహా పండితుడుండెను. ఈ కవి వంశజులెల్లరు మహా విద్వాంసులు. వీరు మొదట రెడ్డిరాజుల యాస్థానమునను, పిమ్మట గజపతుల ఆస్థానమునను, అటుపిమ్మట శ్రీకృష్ణ దేవరాయల సన్నిధిని విద్వాంసులుగా నుండిరి. వీరిలో పేర్కొనఁదగిన వారు మహాధరాచార్యుడు, లక్ష్మీధరాచార్యుఁడు, విరించి మిశ్రుఁడు, పురుషోత్తమ మహోపాధ్యాయుఁడు, లక్ష్మణార్యుఁడు, విశ్వనాథభట్టు. వీరు సంగీత సాహిత్య పూర్వోత్తర మీమాంసాది శాస్త్రముల యందు గొప్ప గ్రంథములను వ్రాసిరి. అవి, భట్ట లొల్లట గ్రంథ వివరణము, సాహిత్య పారిజాతము, స్మృతి కల్పతరువు, భరతార్ణవపోతము, సాహిత్యమీమాంస, మీమాంసా జీతువు, ప్రాభాకరామృతవాహిని, ప్రభావళీ ఖండనము మరియు నయవివేక దీపిక.

అన్న పోతారెడ్డి (క్రీ. శ. 1350–1361)

ఎఱ్ఱన హరివంశము రచించునాఁటికి అన పోతారెడ్డి 'అద్దంకి'లో యువరాజుగా నుండెను. ఈఁతడు తన తండ్రి కాలమున రాజధానిగా ఉన్న అద్దంకిని వీడి స్వయముగ కొండవీటిని నిర్మించి అద్దానిని రాజధానిగ ఒనరించుకొని మిగుల పెంపొందించెను. ఆ ముఖ్య పట్టణము నుండి బంగరు కొండల దానము చేయుచు చాలాకాలము పరిపాలించెను.

"బలితంపు రెడ్డి బి । డ్డల సాము గరిడీల-
రాటు తేలినదీ కొండవీటి సీమ" యే.

"ముగురు రాజులకును — మోహంబు పుట్టించు
గురుతైన యురిత్రాడీ కొండవీటి సీమ" యే.
మఱియు—

సీ. రాజాధి రాజది। రాజిత సత్పురి
పాటియైనది కొండ। వీటి సీమ
సకల వర్ణాశ్రమా । చార సత్కార బా
హాట మైనది కొండ । వీటి సీమ
సంగీత సాహిత్య । సరస విద్యల రా
ఘాట మైనది కొండ । వీటి సీమ
అతులితానర్ఘ్య వ । జ్రాకర వితతిచేఁ
బాటిల్లినది కొండ । వీటి సీమ
గీ. ప్రకటితైశ్వర్య సౌఖ్య సంపదలఁ బొదల
నఖిల జనముల కానంద । మతిశయిల్లు
జగతి నేఁబదియారు దే । శములలోన
నీటుగా నెన్నదగు కొండ । వీటి సీమ.

ఈతని ఆస్థానమున బాలసరస్వతియను కవీశ్వరుఁడు విద్యాధికారిగా నుండెను. శాసన కృతులందా కవి "అన్న పోత నరేంద్రస్య విద్వాన్ బాలసరస్వతిః" అని వ్రాయించెను. 'వెన్నెల కంటి' యింటి పేరుఁగా గల కవీశ్వరులీ యన్నపోత నరేంద్రుని పేరఁ గొన్ని గ్రంథములు రచించిరట. అవి నేఁటికిని లభింపలేదు. "వేమయ యన్న పోత భూజానికి సత్ప్రబంధము లొసంగిన వెన్నలకంటి వారిలోన్" అని విష్ణు పురాణ కర్త వెన్నెల కంటి సూర్య కవియును, "వెన్నెల కంటి సూర్యుఁడు, వివేక గుణాఢ్యుఁడు, వేద శాస్త్ర సంపన్నుఁడు, రెడ్డి పేమ నరపాలకు చేత మహాగ్రహారముల్ గొన్న కవీంద్ర కుంజరుఁడు" అని జక్కన యుఁబ్రశంసించిరి. ఈ రెడ్డి తేఁడు పెక్కు యుద్ధములు చేసి విజయలక్ష్మి సమాలింగితుఁడై రెడ్డి రాజ్యమునుఁజాల పెంపొందించెను.

అనవేమారెడి—(క్రీ.శ. 1362—1380)

అన్నపోతారెడ్డి యనంతరము అనవేమారెడ్డి రాజ్యమునకు వచ్చెను. ఈతఁడు దాతృత్వమునకు శిబిచక్రవర్తి వంటి వాడు. శివభక్తుఁడు. షట్కాల శివపూజాధురంధరుఁడని యీ క్రింది శ్లోకము తెలుపుచున్నది.

శ్లో. అరుణోదయ తపనోదయ
సంగవ మధ్యాహ్న సాయ మర్ధనిశాః
శివపూజా సమయాష్షట్
ప్రతిదిన మన వేమ పార్థి వేంద్రస్య

బాల సరస్వతియే యీతని యాస్థానమునఁ గొన్ని నాళ్ళు విద్యాధికారిగా నుండెను. తరువాత త్రిలోచనా చార్యుఁడను ఉద్దండకవి విద్యాధికారిగా నుండెను. త్రిలోచనార్యుఁడు గొప్ప కవియే గాక శైవాగమ విశారదుఁడు గూడనని యీ క్రింది శ్లోకము వలన తెలియుచున్నది.

"మహానట జెటాచ్ఛటా నటదమంద మందాకినీ
కలక్వణి కంకణ వ్రజ విజృంభి వాగ్గుంభనః
కవిః కవికులోద్భవో భువన భవ్య దివ్యోదయ
శ్శివాగమ విశారదో జయతిశారదా వల్లభః."

ఈతని యాస్థానమున "ప్రకాశ భారత యోగి" యను కవీశ్వరుడు కూడ నుండెను. ఈ కవి ద్రాక్షారామ భీమేశ్వరాలయమున అన వేమ భూపాలుఁడు కట్టించిన గొప్ప కట్టడముల గురించి మంచి సీసపద్యములతో నొక శాసన కావ్యమును రచించెను. అనవేమ భూపాలుఁడు కైలాసవాసిగాగ నొక విద్వాంసుఁడీ రీతిగ విలపించెను.

"భువిసత్యన వేమ భూపతీంద్రేవి దుషాంజీవనమేవ జీవనమ్
దివి సత్యన వేమ భూపతీం దేవి దుషాం జీవనమేవ జీవనమ్

అనవేమ మహీపాలుని భట్టాజులు పద్యములచే మెప్పించి వేలకొలది పసిడిటంకముల బహూకరణ మొందిరని "అన నవేమ మహీపాలా" యను పద్యము వలన తెలియుచున్నది.

అనవేమారెడ్డి మహాదాత. ఈతనికి జగనొబ్బగండ, రాయవే కోలుగండ, అర్థి ప్రత్యర్థి, హేమాద్రిన నిరత, ప్రజా పరిపాలనా భరత, అమరా భరణ రూపా నారాయణ, వీర నారాయణ, భుజబల భీమ, కోదండరామ మొదలగు బిరుదులున్నట్లు దండకవిలె వలన దెలియుచున్నది. బ్రాహ్మణులకితఁడనేకాగ్రహారములు దాన మొసంగెను. ఈతని దానములఁదెల్పు రాగి శాసనము కొండపల్లిలో శివాలయము నందు కలదు. పెక్కు దేవాలయముల నితఁడు నిర్మించెను. ఈతని దాన శాసనములు కూడ చాల గలవు. ఇతనికి పర

మత సహనము కలదు. ఈతని వర్ణించుచు నొక పండితు డిట్లు వ్రాసెను.

"అనవేమ మహీపాల స్వస్త్యస్తు తవ బాహవే
బాహవేరిపు దోర్దండ చంద్రమండల బాహవే."

ఈతని బిరుదులన్నియు నీతని వంశజులకు పారంపర్యముగ వచ్చెను. మంచెళ్ళ వాసుదేవకవి రచించిన గంధవహమునందలి యీ క్రింది పద్యము అనవేమారెడ్డి ప్రతిభను దెల్పుచున్నది.

మ. ఘన కీర్తుల్ జగనొబ్బ గండ బిరుదుల్, గంభీర భాండారశ్రీ
మనగాద్భేదక భేరులిచ్చియనవేమారెడ్డియున్ వాసిగా
గనియెన్ గావున వాసిరెడ్డియన వ్యాఖ్యం జెందె నీ ధార్మికా
వని నావాగణి వంశ నాధుఁడతనిన్-వర్ణింపగాశక్యమే?

అనవేమాధిపురాజ్య భార భరణ వ్యాపార దక్షులమని అతని మంత్రులు సగర్వులై పలుపొగడ్తలనందు చుండెడివారు. ఈ అమాత్యులు ప్రభువుల కంటె నధికముగ బిరుదులు, దర్పములు, కత్తులు, కలముల నుపయోగించు నేర్పులు కలిగి మన్ననల నందు చుండెడివారు.

కొమరగిరిరెడ్డి (క్రీ.శ. 1380–1400)

అనవేమారెడ్డి రాజ్యమేలిన తరువాత అతని యన్నయన్న కుమారుడు (అనపోతారెడ్డి యొక్క కొమరుడు) రాజయ్యెను. ఈతడు క్రీ.శ. 1380-1400 నడుమ రాజ్యమేలినట్లు శాసనాదుల వలనఁ దెలియుచున్నది. ఈతని బావ (సోదరి భర్త) యగు కాటయ వేమారెడ్డి యీతని మంత్రి. ఈ కాటయ వేముఁడుమనుతుల్యుండని సంస్తుతికెక్కెను. ఈ మంత్రి కొమరగిరిరెడ్డిని నామ మాత్రావశిష్టునిఁజేసి సర్వ కార్యములనుఁ దానే చక్కబెట్టుచుండెడివాడు. కాటయ వేముఁడు సర్వమును సమకూర్పగా కొమరగిరిరెడ్డి భోగపరాయణుఁడై వసంతోత్సవములు జరుపుచుండెడివాఁడు. వారాంగనా నృత్యప్రదర్శనములతోఁగాలము గడుపుచుండెడి వాఁడు. ఈతఁడు వసంత రాజీయమను నాట్యగ్రంధమును రచియించెను. ఈతని ప్రియురాలి పేరు 'లకుమాదేవి.' ఈమె వేశ్యయై యుండనోపును. ఈమె కొమరగిరిరెడ్డి సభలో నవనవాభినయములతో నృత్యప్రదర్శనము చేయుచుండెడిది. వేశ్యయయినను ఆమె గుణవతి. అర్థులకు సమృద్ధిగా ధనమొసంగి యాదరించు చుండెడిది. ఈమె కుమారగిరిరెడ్డి యొక్క ధర్మపత్ని యనియే ఎల్లరు తలచుచుండెడివారు.

''జయతి మహిమా లోకాతీతః కుమారగిరి ప్రభో
స్సదసి "లకుమాదేవి" యస్య ప్రియాన దృశిస్రియా
నవమభినయా నాట్యోర్థా నాంతనోతి సహస్రధా
వితరతి బహూనర్థా నర్థి ప్రజాయ సహస్రః''

కుమారగిరిరెడ్డి వసంతోత్సవములందు మిక్కిలి మక్కువ జూపుటచేఁ గాబోలు అతనికి ''వసంత భూపాలుఁడను బిరుదు వచ్చెను. కాటయవేముఁడు మహాకవి కాళిదాసు రచించిన శాకుంతలము, విక్రమోర్వశీయము, మాళవికాగ్నిమిత్రము అను నాటకములకు వాఖ్యానములు వ్రాసెను.

కాటయవేమారెడ్డి (క్రీ.శ. 1385–1423)

ఈతఁడు కుమారగిరిరెడ్డి సోదరి భర్త. అనపోతారెడ్డి పుత్రిక మల్లాంబ ఈతని భార్య. కాటయ వేమారెడ్డి తొలుత కుమార గిరిరెడ్డి యొద్ద మంత్రిగా నుండెను. ఇతఁడు మంత్రిగా నున్నప్పుడే మహాకవి కాళిదాసు రచించిన శాకుంతలము, విక్రమోర్వశీయము మాళవి కాగ్ని మిత్రము అను నాటకములకు వ్యాఖ్యానములు వ్రాసెను. తన ప్రభు భక్తికిని, ప్రేమకును నిదర్శనముగా ఆ వ్యాఖ్యలకు వసంత రాజీయములని పేరు పెట్టెను. ఇవి మల్లినాథ సూరి వ్యాఖ్యల కంటె కొంచెము ప్రాచీనములు. ఇవి చాల ప్రసిద్ధములైనవి. వీనికి ''కుమార గిరీయము''లను పేరు కూడా గలదు. కాటయ వేముఁడు సంస్కృతమున గొప్ప పండితుఁడగుటచే మనుతుల్యుఁడని ప్రసిద్ధి వడసెను.

ఇతఁడు రాజమహేంద్రవరమున క్రీ.శ. 1385 నుండి 1423 వరకు పరిపాలించెను. ఈతని యొద్ద రాయని భాస్కరుఁడు మంత్రిగా నుండెను. రాయని బావదు మిక్కిలి సమర్థుఁడు, నెఱదాత. ఈ క్రింది పద్యము లీతని ప్రతిభను చాటుచున్నవి.

చ. కలయపసిండి ఘంటమునఁ గాటయవేము సమక్షమందు న
త్పలముగరా యని ప్రభుని బావఁడ వ్రాసిన వ్రాలమోతలన్

గలుగలు ఘల్లు ఘల్లురన। గంటక మంత్రుల గుండె లన్నియున్
జలుజలు ఝల్లు ఝల్లురను। సత్కవిదర్యులు మేలు మేలనన్

సీ. ఉత్తుంగ భుజనూన। దత్తనం దాపురీ
పుణ్యాగ్ర హారాంశ। భోక్తయితఁడె
ఆ జన్మ సంసిద్ధ। భూజాన ప్రఖ్యాత
దాస సింహాసనా। ధ్యాసి యితఁడె
కొండపల్లీ రాజ్య। మండలాఖిల మహా
గణక సందోహాగ్ర। గణ్యుఁడితఁడె
వైకుంఠ తీర్థని। ర్వాణ సంయమికృపా
సంవర్ధి తాఖిలై। శ్వర్యుడితఁడె
గీ. కొండవీడు, ధ్గిరి, పెనుఁ, గొండ, గుత్తి
పానుగల్విజయనగర। పట్టణముల
సద్గులకు నిచ్చునితడెయి। షార్థ మనుచు
జగము రాయన భాస్కరు। బ్రెగడ బొగడ

రాయని భాస్కరుని దాతృత్వమును తెలుపు పద్యము లింకను పెక్కులు గలవు. కాటయ వేముని శాసనములు గూడ అనేకములున్నవి.

పెదకోమటి వేమారెడ్డి (క్రీ.శ. 1400–1420)

కొమరగిరిరెడ్డి చివరికాలముననే కొండవీటిరెడ్డి రాజ్యము నుండి రాజమహేంద్రపుర రెడ్డి రాజ్యము విభజింపబడెను. అట్లు విభజింపబడిన కొండవీటి రాజ్యమునకు పెదకోమటి వేమారెడ్డి రాజయ్యెను. కావున నితఁడు కొండవీటి రాజ్యమునకు తుది యేలిక. ఇతడు రాచవేమన పుత్రుఁడు మాచనకు మనుమఁడు కుమార రెడ్డికి జ్ఞాతి కుమారగిరి రెడ్డి నిస్సంతుడగుటచే వంశకర్తయైన వేమారెడ్డి యొక్క అన్నయగు మాచారెడ్డి మనుమఁడైన పెదకోమటి వేమారెడ్డి రాజ్యమునకు వచ్చెను.

ఇతడు రాజకవి. మహా విద్వాంసుడు. ఇతనికి జగనొబ్బ గండడు, వీరనారాయణుఁడు, సర్వజ్ఞ చక్రవర్తి మొదలగు బిరుదులు కలవు.

"చూడామణి స్ప్రహాఖాండదుర్మద పరిపంథి శిఖరిదంభోళిః సర్వజ్ఞ చక్రవర్తీ పెదకోమటి వేమభూపతిర్జయతి"

ఇతఁడు సాహిత్య చింతామణి, సంగీత చింతామణి, శృంగార దీపిక (సప్తశతీసారటీక.) భావదీపిక, వీర నారాయణ చరిత్ర అను గ్రంథములను, కొన్ని నాటకములను రచించెను. కవి సార్వభౌముఁడగు శ్రీనాథుఁడితని యాస్థాన కవి విద్యాధికారి యితని మంత్రియగు మామిడి సింగనకు (పెద్దన కుమారుడు) శ్రీనాథుఁడు శృంగార నైషధ కావ్యమును గృతి యిచ్చెను. మామిడి సింగన సోమ సిద్ధాంతమను జ్యోతిష గ్రంథమునకు వ్యాఖ్యానము వ్రాసెను.

పెదకోమటి వేమారెడ్డి అనేకమంది జ్యోతిశ్శాస్త్ర విద్వాంసులకు, వైద్యవేత్తలకు, (ఆయుర్వేద నిపుణులకు) యజ్ఞము లొనరించిన శ్రౌతలకు, శైవాచార్యులకు నిగమాగమ విశారదులకు చాల అగ్రహార దానము లొనరించెను. ఆ దానములన్నిటికిని శాసన కార్యకర్త శ్రీనాథకవివరేణ్యుఁడు. వారి పాండితీగరిమను శ్రీనాథుడే పరీక్షించుచుండెడివాఁడు. ఈ మహాదాత కీర్తిలత శ్రీశైలమునుండి సింహాచలము వరకు వ్యాపించెను. ఈ క్రింది పద్యమీతని కీర్తిని వెల్లడించుచున్నది.

సీ. కపట కంఠీరవా-కార నారాయణ
హేళా నినాదంబు - గేలిసేయు
కల్పాంత దుర్దాంతకాల భైరవభేరి
ఢమర కోన్మాదంబడంగజేయు
ప్రళయ కాలా భీల - పటుఘోర నిర్ఘాంత
పటపటారావంబు - జటులపరచు
కుహనా మహాకాల - కోలాహలోత్తాల
పాతాళ నినదంబు - భంగపరచు
గీ. గండు మెఱసినరిపుకోటి - గుండెలవియ
జెండ గతిమ్రోయు నీరణోద్దండభేరి
జయరమాసంగరాయ వే - శ్యా భుజంగ
అతుల బలధామ పెదకోమటన్న వేమః
(శృంగార శ్రీనాథము)

ఈ సాహితీ బాంధవుని గ్రంథములు సాహిత్య దృష్టితో నించుక బరిశీలించుటుచితము,

1. శృంగార దీపిక (అమరవ్యాఖ్య)

ఇది యమరుక కావ్యమునకు వ్యాఖ్యానము. అమరుశతక వ్యాఖ్యానము లన్నిటికన్న నిదియే మిన్న. ఈ వ్యాఖ్యానము రసభావాలంకార నాయికా నాయక లక్షణాది విషయ విచారముతోఁ జాల విపులముగా నున్నది.

2. భావదీపిక (సప్తశతీ సారటీక)

ఇది శాలివాహనుని గాథా సప్తశతిలోని నూటనాలుగు కథలకు వ్యాఖ్య. హాలుఁడను శాలివాహన చక్రవర్తి క్రీ.శ, 20–24) రెండు వేల యేండ్లకుఁ బూర్వము కథా సంవిధాన నైపుణ్య మెలర్ప గాథా సప్తశతిని కూర్చెను. అందు 700 ప్రాకృత గాథలున్నవి. వానిలో సారతీరమైన నూటనాలుగు గాథలకు పెదకోమటి వేమారెడ్డి వ్యాఖ్య వ్రాసెను.

3. సాహిత్య చింతామణి

ఇది అలంకార శాస్త్ర గ్రంథము. శాస్త్ర గ్రంథములలో జాలయుత్కృష్టమైనది. ఇది మహిమభట్టు వ్యక్తిగత వివేకమును ఖండించును. ధ్వనికారుని మతమును బోషించును. అనేక గ్రంథములలోని శ్లోకములిందుదాహరింపబడినవి. "యథామమైవ భాణే" యనియు, "యథా మమైవ కావ్యే వీర నారాయణ చరితే" యనియును.

4. సంగీత చింతామణి

ఇది సంగీత గ్రంథము. ఈ గ్రంథము తిరువనంత పురమున నున్నది. కవులీ సర్వజ్ఞ చక్రవర్తిని "జ్ఞాతా దాతా చాభూః పెదకోమటి వేమ భూపతే" యని సంస్తుతించిరి.

శ్రీనాథుఁడు శృంగార నైషధము మామిడి సింగన కంకిత మిచ్చినప్పుడాతని నిట్లు ప్రస్తుతించెను.

మ. అరుదారన్ వివిధాగ్రహారములతో । నాందోళికా ఛత్ర చా
మర కళ్యాణ కళాచికాదిబహుస । మ్మానార్హ చిహ్నంబు లా
దర మొప్పారగ వేమ భూపరుని చే । తన్గాంచె సామ్రాజ్య సం
భరణ ప్రౌఢుఁడమాత్య సింగఁడు నయ । ప్రాగల్భ్య గర్వోన్నతిన్

క. శ్రీ మహిత పెద్ద కోమటి
వేమక్షితి పాలరాజ్య విభవకళార
క్షామణికి సింగ సచివ
గ్రామణికిన్ బాంధ్య రాజ్య గజ కేసరికిన్

మ. ....వేమభూపతి మహాసామ్రాజ్య రక్షామణీ
యవనాధీశ సభానిరంకుశవచో వ్యాపారపారంగతా!

శ్లో. "జ్ఞాతాయదిన హితాదాతాచేత్కోఽపి భువినచజ్ఞాతా
జ్ఞాతా దాతా చాభూః పెదకోమటి వేమ భూపతేచిత్రమ్"
"అర్థిజన చింతితార్థా దధికం చేత సతతోఽపి తే వాణీ
అస్యా అపిదిశితికరః పెదకోమటి వేమభూపతేచిత్రమ్
శ్రితపోషణ రిపుశోషణ బుధతోషణ సత్యభాషణా దిగుణాన్
ధత్తే దశరథ రామః ప్రాగద్య కతాతు కోమటి విభుః వేమః

సీ. వినిపించినాడవు । వేమ భూపాలున
కఖిల పురాణ విద్యా గమములు
భాషించినాడవు । బహుదేశ బుధులతో
విద్యాప రీక్షణ । వేళలందు
వెదజల్లినాడవు । విశద కీర్తి స్ఫూర్తి
కర్పూర దిశాం । గణములందుఁ
గల్పించినాఁడవు । గాఢ పాకంబైన
హర్షనైషధ కావ్య । మాంధ్రభాష"

ఇవి యన్నియుఁ బెదకోమటి వేమారెడ్డి గారి యాస్థానములో శ్రీనాథుఁడు విద్యాధికారిగా నొనరించిన కృత్యములే. శాసన కృతులందాతఁడు "విద్యాధికారీ శ్రీనాథో వీర శ్రీ వేమభూపతేః" అని వ్రాయించెను. పెదకోమటి వేమారెడ్డి చరితమును 'వేమ భూపాల చరిత' యను పేర సంస్కృతమున గద్యకావ్యముగ వామనభట్టు బాణుఁడను కవీశ్వరుఁడు రచించెను.

పెద కోమటి వేమారెడ్డి పై ఎఱ్ఱాప్రగడ యీ క్రింది పద్యమును రచియించెను.

ఉ. వీపున మోసె గచ్ఛపము । వెండి భుజంగము రాజ మస్తక
స్థాపితఁజేసె, నీవు వసు । ధారమణిన్ పెద కోమటీంద్ర । బా
హాపరిరంభ గుంభ నము । దంచితఁ జేసితి వింత యొప్పునే
మోపరులే మెఱుంగుదురు । ముగ్ధలతోడి విహార సౌఖ్యముల్

కోమటి వేమారెడ్డియొద్ద తురగా రామన్నకూడ మంత్రిగా నుండెనని యీ క్రింది పద్యము వలనఁ దెలియుచున్నది.

క. కోమటి వేమన త్యాగము
భూమి ప్రసిద్ధంబు కల । భూజము చెంతన్
పాము న్న పగిదిఁ దురగా
రాముండున్నాఁడు చేర రాదెవ్వరికిన్.

ఈ విషయమునే యోగి వేమన్న "కల్పతరువు క్రింద గచ్చ మొక్కున్నట్లు" ని సుళువుగా చెప్పినాఁడు,

కొండవీటి రాజ్యమున 'కోమటి' అను జైన దేవుడు (గోమటేశ్వరుఁడు) ఉండెను. అందువలన ఈ కొండవీటి రెడ్డి రాజుల పేరుల మొదట 'కోమటి' అని యుండెడిది.

(సశేషము)

వాఘీర

— బొడ్డు బాపిరాజు

అటుకొండా ఇటుకొండా — మధ్య చక్కని లోయ — లోయలో తీయని పాటలు పాడుకొంటూ సాగిపోయే అందాల సెలయేరు — దాని పేరు వాఘీర —

అరిమురి జాల్వా రెడినీ,
యరవిరి కెరటాల నిగ్గు టద్దములోనన్
చెరగిన పూర్వపు టందము
లరసి యజంతా తపించునటె వాఘీరా ?

పచ్చని కొండలోయబడి వచ్చిన వెన్నెల వెల్లువేమొ, నీ
యచ్చపు సోయగమ్ము హృదయమ్ముల కుంగిలిగింత వెట్టగా
గ్రుచ్చి కవుంగలించెదవొకో మముబోటికళా ప్రవాసులన్
ముచ్చట దేల్చు క్రొత్తరగముత్తెపు పయ్యెదపూలగాలులన్ ?

అమృతపు జల్లు లీయలల యున్నవ కిన్నెర లాలపించుగా
నములవి మా చరిత్రలకు నందని కాలపు కంచుకోట ద్వా
రములను ద్రేల్ శతాబ్దపు తెరల్ తొలగించుచు ఏ మహాద్భుతా
ర్థములు కథానిధానములు దారతమాకయి వెల్లడించునో !

ఇది తథ్యంబటె ? ఇట్టి కారడవిలో నీ కొండకే భాగ్యమో
పదినూరేడులు శాతవాహన నృపుల్ ప్రారంభకుల్గా కళా
విములిందెందరో జీవితమ్ములు సమర్పింపన్ జగత్కీర్తికిం
గుహ్యరై వెల్గినదంట, ఎవ్వరికసాక్షుల్ నీవుగాకున్నచో ?

అనుపమ బుద్ధగాధలు గుహాంతర భిత్తికలందు చిత్రలే
ఖనములు తీర్చు శిల్పులు నిగారపు కుంచెల రంగు లీలతో
ర్వ్వని విదలించి యుండెదరుటే ! అటుగాక విచిత్ర వర్ణ క
ల్పన హృదయంగమమ్ము లెటులయ్యెడి నిచ్చటి గడ్డి పువ్వులున్

ఈ తీరమ్ముల ధ్యానముద్రగొనిరో ఏభిక్షువుల్ నిర్మల
ప్రాతస్సంధ్యల; ఏకళావ్రతులు సంభావించిరో ఈ ధరా
జాతచ్ఛాయల గోష్ఠి; లేకులపతుల్ శ్రద్ధాళులౌ శిష్య సం
వ్రాతంబున్ జదివించిరో సుగత ధర్మం బీశిలాపాళి; సం
పూతం బిందు వెలుంగు ప్రత్యణువు చెప్పున్ పూర్వ భోగ స్మృతుల్

స్వాంతములేలు దివ్యరస భావ సమన్విత నూత్న శైలి వె
స్సంతర భూవర ప్రముఖ జాతక గాథలు తీర్చు తద్గుహా
భ్యంతర శిల్పిలోకము శ్రమాపనయ ప్రియవృత్తి వై సమ
ర్పింతువె శీతలానిల పరీమళ చామర చాలనమ్ములన్?

వెలుగుల్ దూరని యాగుహాంతరములన్ విన్నాణముల్ దేల మేల్
జిలుగుం గ్రొన్నగిషీ పనుల్ సలిపినా, రేధాతు సంపాదితం
బులొ తద్వర్ణ సముచ్చయంబులు? శతాబుల్ దాటినన్ నేటికిన్
తళుకుల్ మాయవు నీ వెరుంగుదువుగాదా తల్లి! తత్ప్రక్రియల్?

కలగు నెడంద, చెమ్మగిలు కన్నులు చెన్నరియున్న యీ గుహా
వళుల సపూర్వ చిత్ర విభవమ్ములు, నక్షయ శిల్ప సంపదల్
పులకలు దేర కన్గొనుచు-పొంగిన నేటి విషాద భావనల్
నిలుపగ దర్శకావళికి నిల్తువొ నీవొక సాంత్వనమ్ముగా!

శరదిందుద్యుతులందు స్నిగ్ధసికతా శయ్యా సుఖాసీనులై
గురువుల్ శిష్యుల కద్భుత ప్రభుకదా గూఢార్థముల్ దెల్పుచో
నురువీచీకలనాద మంజులముగానూ కొట్టుటల్ లేవు, నే
డర మోదంబుంగనుదమ్ములన్ వినెడు భాగ్యంబుల్ నదీ సుందరీ!

అలనాడీగిరి రాడ్గృహాంగణములందాచార్యులున్ ఛాత్రులుం
బలుకన్ ముక్తగళమ్ములన్ త్రిశరణధ్యానంబు లాశాంచలం
బుల మార్మోగిసిన వార్తలెల్ల కలలై పోవన్ నిరాశా సమా
ధుల నిద్రించెడి యద్రి రాజుగని నీ దుఃఖమ్ము నూహించెదన్

కరుణామూర్తి తథాగతుండరయడో గర్భాలయంబందు సు
స్థిర పద్మాసన యోగ ముద్రగొని సందేహింతురో మేలుకొ
ల్పరాపో స్వామిని పద్మపాణి ముఖులా ద్వారస్థితుల్ నీవదే
గురిగా గొంతుపెకల్చి దుర్విధికి నాక్రోశింతువారేబవల్ ?

చెలువుల్ నించెను సార్వభౌమ తరుణీ సీమంత సింధూర రే
ఖల ముక్తాఫల మోహనంబులయి నీ కల్లోల లీలా మరు
చ్చల దానంద తుషార బిందువులు; తత్ సౌభాగ్య చంద్రాతపం
బులు క్రమ్మింగెన్ దురదృష్ట ఘోరతిమి రవ్యూహంబు స్రోతస్వినీ !

అలిగిన శిల్పి తిట్టు లిడెనా ? నరపాలుర భావ శుద్ధియే
తొలగెన ? ధూర్త భిక్షువుల దోషమె కొట్టెన? ధర్మ దేవతా
నిలయములివ్వి పాడువడె నేటికి ? శాపవిమోచనమ్ము నుం
గలుగదె ? సర్వముందెలియగా వినిపింపు మజాంత వృత్తమున్

అచ్చట కృష్ణవేణి మధురాకృతి విచ్చట నీవు లోకముల్
మెచ్చగ శిల్ప లక్ష్మికిని, మిద్దెలు మేడలు కట్టుకొంటి, రా
ముచ్చట లెన్నడో కనులు మూసె చరిత్రలలోన, కాని మీ
యచ్చపు గుండెలం జదివినట్టి కళాప్రియులీ తెనుంగు వా
రిచ్చ కృతజ్ఞతాంజలి ఘటింపక మిమ్ముల విస్మరింతురే !

బ్రదికి చెడినట్టి సౌగతాశ్రమ పదమ్మ
లివి యజంతాద్రు, లిచటి సౌహిత్యమునను
విడిచి చనలేవు చిరతపస్వినివి నీవు
దేవి వాఘీర ! మా స్మృతి దీప శిఖవు !

నిర్బంధించి చేయించు పనియందెప్పుడును శ్రద్ధానురాగములుండవు. విరామములేక సదా యొక్క పనినే చేయుచుండుట విసుగును బుట్టించును.

— కందుకూరి వీరేశలింగము.

మట్టంపల్లిలో

మహిళా గ్రామ పంచాయతీ

నల్గొండ జిల్లా హుజూర్‌నగరం పంచాయతీ సమితి బ్లాకు లోని మట్టంపల్లి గ్రామంలో పంచాయతీ కమిటీ స్థానా లన్నిటికి స్త్రీలు ఎన్నికయినారు. స్త్రీలుకూడా పురుషుల వలెనే గ్రామ పరిపాలనా బాధ్యతను వహించగలరని యిందు వల్ల ఋజువవుతున్నది. తెలంగాణాలో పంచాయతీ కమిటీ సభ్యులుగా అంతా స్త్రీలే ఏకగ్రీవంగా ఎన్నుకొనబడటం యిదే ప్రప్రథమం.

హైదరాబాదుకి 120 మైళ్ళ దూరంలోగల మట్టంపల్లి జనాభా 3000. నల్గొండ జిల్లా పరిషత్తు అధ్యక్షుడు శ్రీ జి. ఎస్. రెడ్డి ఈ గ్రామానికి చెందిన వారు.

పంచాయతీ కమిటీకి స్త్రీలను యెన్నుకోవాలనే ప్రతి పాదనకు మొదట ప్రాతికూల్యం ఉన్నా, అందువల్ల పురు షుల మామూలు అధికారాలు సన్నగిలవని నచ్చ చెప్పిన మీదట యీ ప్రతిపాదన యేకగ్రీవంగా చేయబడింది. దిగువ స్త్రీలు ఎన్నుకొనబడ్డారు.

1. శ్రీమతి గోపు ఫెరోజమ్మ — అధ్యక్షురాలు
2. ,, మాపం చూడమ్మ — ఉపాధ్యక్షురాలు
3. ,, డి. శేషమ్మ — సభ్యురాలు
4. శ్రీమతి గుడిపాడి మరియమ్మ — హరిజనసభ్యురాలు
5. ,, ఆదూరి షోరమ్మ — ,,
6. ,, ఎ. భద్రమ్మ — ,,
7. ,, టి. షెద్రమ్మ — ,,
8. ,, వెంకమ్మ — ,,

ఈ పంచాయతీ కమిటీని యిదివరకటి రాష్ట్ర ముఖ్య మంత్రి శ్రీ ఎన్. సంజీవరెడ్డి ప్రారంభించారు. ఇప్పటి ముఖ్యమంత్రి శ్రీ డి. సంజీవయ్య కూడా యీ గ్రామాన్ని దర్శించి పంచాయతీ సభ్యులుగా స్త్రీలను యెన్నుకొన్నందుకు గ్రామస్థులను మెచ్చుకున్నారు.

ఈ పంచాయతీ కమిటీ స్వల్ప కాలంలోనే అభివృద్ధి అన్ని రంగాలలోను తగినంత అభివృద్ధిని సాధించింది. ఈ కమిటీ సాధించిన పనులలో కొన్ని యివి: రెండు హరిజన మంచినీటి నూతుల త్రవ్వకం. ఒక యువకుల క్లబ్బు, గ్రంథాలయం, పిల్లల పార్కుల ఏర్పాటు, సామాజిక రేడియోసెట్టు స్థాపన. వివిధ అభివృద్ధి కేంద్రాలను దర్శించి అక్కడి గ్రామాభివృద్ధి కార్యకలాపాలను గురించి తెలుసు కొందుకై విజ్ఞానయాత్రను జరపాలని యీ మహిళా పంచా యతీ కమిటీ ఉద్దేశిస్తున్నది.

దూరపు కొండలు నునుపు.

* * *

కోటి విద్యలు కూటి కొరకే.

— తెలుగు సామెతలు.



'పద్మభూషణ' శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావు గారు, ఆంధ్ర ప్రదేశ్ శాసన సభాధ్యక్షులు: రిపబ్లిక్ దిన సందర్భంలో రాష్ట్రపతి వీరికి 'పద్మభూషణ' బిరుదు ప్రదానం చేశారు,

ఉపాధ్యాయులకు బహుమతులు

సెకండరీ, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల్లో ప్రముఖ సమాజసేవ చేసిన 71 మందికి గత జనవరి 25 న రాష్ట్రపతి జాతీయ బహుమతులను ఇచ్చారు. ఇందులో ఆయిదుగురు ఆంధ్ర ప్రదేశ్‌కి చెందినవారు. ఒక్కొక్కరికి రూ. 500 రొక్కం, ఒక యోగ్యతా పత్రం యివ్వబడతాయి. ఈ చిత్రాలలో ఉన్నవారు:




శ్రీ ఎమ్. రుద్రయ్య,
కర్నూలు జిల్లా నందికొట్కూరు
బోర్డు ప్రాథమికపాఠశాల (సంతగాడే)
ఉపాధ్యాయుడు.



శ్రీ ఎమ్. మల్లికార్జునయ్య
నెల్లూరు జిల్లా చిన్నచెరుకూరు బోర్డు
సీనియర్ బేసిక్ స్కూలు
ప్రధానోపాధ్యాయుడు




శ్రీ కె.వి. సుబ్రహ్మణ్యం,
మునిసిపల్ హైయర్ ప్రాథమిక పాఠ
శాల (ఆర్.ఎస్. మడ వీధి. తిరుపతి)
ప్రధానోపాధ్యాయుడు




శ్రీ డి.ఎ. జనార్దనరావు, జూలుమూరు
(వయా నరసంపేట. శ్రీకాకుళం
జిల్లా) బోర్డు ప్రాథమిక పాఠశాల
ప్రధానోపాధ్యాయుడు



శ్రీ సి. ఎ. చారి,
హైదరాబాదు వివేక వర్ధని
ఉన్నత పాఠశాల
సహాయ ప్రధానోపాధ్యాయుడు




13-2-60 న గాంధీభవన్ (హైదరాబాదు) లో జాతీయ పొదుపు పథకం సహాయార్థం మిస్ రోషన్ వజీఫ్‌దార్ నృత్యప్రదర్శన ఇచ్చారు.



నల్గొండ జిల్లా హుజూర్‌నగరం పంచాయతీ సమితి బ్లాకు మట్టంపల్లి గ్రామ పంచాయతీ కమిటీ సభ్యురాండ్రు.

(నిల్చున్న వారు పంచాయతీ కార్యాలయం సిబ్బంది.)

(పుట 40 చూడుడు.)



శ్రీ ఎస్. వి. నరసింహారావు (పుట: 65 చూడుడు)



జాతీయ పొదుపు కృషి: హైదరాబాదులో ఇటీవల జరిగిన అఖిల భారత పారిశ్రామిక వస్తు ప్రదర్శనలో ఒక జాతీయ పొదుపు స్టాలు తెరవబడింది. అక్కడికక్కడ నేషనల్ ప్లాన్ సేవింగ్సు సర్టిఫికెట్లను ఇవ్వటానికి వీలుగా అక్కడ ఒక కౌంటర్ కూడా ఏర్పాటు చేయబడింది. రెవిన్యూ బోర్డు సాంస్కృతిక సమితి అధ్వర్యాన దాదాపు 40 మంది వాలంటీర్లు నేషనల్ ప్లాన్ సేవింగ్సు సర్టిఫికెట్లను కొనమని ప్రదర్శన తిలకించవచ్చిన ప్రజలకు చెప్పారు. ప్రదర్శన కాలంలో డిపోజిట్ల రూపంలో ఈ స్టాలు 5 లక్షల రూపాయలను సేకరించింది. అఖిల భారత పారిశ్రామిక వస్తు ప్రదర్శన అధికారులు ఈ స్టాలుకు ఒక షీల్డ్‌ను బహూకరించడమే కాక జాతీయ పొదుపు విషయంలో జరిపిన ప్రచారాదులకు ఏ తరగతి కప్పు నొకదానిని ఇచ్చారు.

రెవిన్యూ బోర్డు సాంఘిక సాంస్కృతిక సమితి అధ్యక్షుడు శ్రీ బి.జె. దొరైరాజ్‌కు ముఖ్యమంత్రి శ్రీ డి. సంజీవయ్య షీల్డ్‌ను ఇస్తున్న దృశ్యాన్ని చిత్రంలో చూడవచ్చును.

మతం

— దేవులపల్లి వేంకట కృష్ణశాస్త్రి

నారాయణ ! నారాయణ !
అల్లా ! అల్లా !
నా పాలిటి తండ్రీ, నీ పిల్లల మేమెల్ల !

మత మన్నది నా కంటికి మసకైతే,
మత మన్నది నీ మనసుకు మబ్బైతే,
మతం వద్దు, గితం వద్దు
మాయా మర్మం వద్దు- నారాయణ ! నారాయణ!

ద్వేషాలూ రోషాలూ తెచ్చేదే మతమైతే,
కలహాలూ కక్షలు కలిగించేదే గతమైతే,
మతం వద్దు, గతం వద్దు
మారణ హోమం వద్దు- నారాయణ—నారాయణ!

మత మన్నది గాంధీ జీవితమైతే,
మత మన్నది లోకానికి హితమైతే.
హిందువులం ముస్లిములం
హిందువులం క్రైస్తవులం
అందరమూ సోదరులం
అందరమూ మానవులం- నారాయణ! నారాయణ!

—:0:—

నాటిక

బ్రతుకు భయం

— నెల్లూరి కేశవస్వామి

(వీధి గడియారం పది గంటలు కొడుతుంది....గబగబా నడిచే జోళ్ల చప్పుడు....చప్పున ఆగి తలుపు కొట్టిన చప్పుడు....)

శేషగిరి:- (ఆదుర్దాగా) డాక్టర్! డాక్టర్! .... (తలుపు తట్టుతూ) డాక్టర్! డాక్టర్! ....

డాక్టర్:- ఎవరూ?....

శేష:- డాక్టర్ శేఖర్....?

డాక్ట:- యస్, నేనే .... ఏం?

శేష:- (ఆదుర్దాగా) మీతో అర్జంటుగా పనుంది డాక్టర్! కన్సల్టేషన్ కోసం వచ్చాను.

డాక్ట:- ఇప్పుడా? ఇంతరాత్రి .... పది దాటింది.....

శేష:- అవును డాక్టర్! నాకు తెలుసు. ఇవి మీ కన్సల్టేషన్ అవర్స్ కావని తెలుసు. కాని నాకు వ్యవధి లేదు, దయచేసి ఇదొక స్పెషల్ కేసుగా భావించండి డాక్టర్!

డా:- బహుశా మీరు పొరపడుతున్నారేమో. నేను మందుల డాక్టర్ని....

శేష:- కారని కూడా తెలుసు డాక్టర్! మీరు సైకాలజిస్ట్. మనస్తత్వ పరిశీలన చేస్తారు, ఇదిగో ఈ బోర్డు పైన స్పష్టంగా రాసివుంది. దీన్ని యింతవరకు నేను వందసార్లయినా చదివి వుంటాను .... పొరపాటేమీ జరగలేదు డాక్టర్! బాగా తెలిసివుండే వచ్చాను....

డా:- అయితే తొందరేం? రేపొక టైం నిర్ణయం చేసికొని సావకాశంగా రావచ్చుగా?

శేష:- లేదు డాక్టర్, లేదు. బొత్తిగా వ్యవధిలేదు. ఇవ్వాళే, ఇప్పుడు తప్పితే ఇంక మళ్లీ మిమ్మల్ని కలుసుకునే అవకాశం దొరకదేమో....?

డా:- ఏం? ప్రయాణమా?

శేష:- ఆం? ఏమన్నారూ? ప్రయాణమా? .... ఆఁ, అవునవును ప్రయాణమే....తిరుగులేని ప్రయాణం....

డా:- ఏవిఁటీ? తిరుగులేని ప్రయాణమా? వింతగా మాట్లాడుతున్నారే?

శేష:- అవును. వింతగానే వుంటుంది డాక్టర్! దయచేసి నన్ను లోపలికి రానివ్వండి. చెబుతాను. అంతా చెబుతాను. అప్పుడు బహుశా మీకు వింతగా వుండదు. రానివ్వండి. డాక్టర్. ప్లీజ్....

డా:- (ఒక్క క్షణం ఆగి) సరే రండి.

(లోపలికి వెళ్తారు)

డా:- అలా సోఫాపైన కూర్చోండి.

శేష:- థాంక్స్.

డా:- (ఒక్కసారి గాబరాగా) ఆఁ, అదేవిఁటి? ఆచేతిలో?

శేష:- ఓ ఇదా? అరే. ఇది చేతిలోనే వుండిపోయిందా.... ....పిస్తోలు....కాని భయపడకండి డాక్టర్! ఇందులో గుళ్లులేవు. ఇదుగో చూడండి. (పిస్తోలు విరిచిన చప్పుడు) ఇందులో ఒకేఒక్క గుండు వుండింది. అది కాల్చేశాను,

డా:- కాల్చారా! మీరేనా?

శేష:- అవును .... కాని మీరెందుకు భయపడుతున్నారు డాక్టర్? ఇందులో ఇంక గుళ్లు లేవు....చూసుకోండి మీ ముందరే టేబిల్పైన పడేస్తున్నాను.... ఎంత ఆశ్చర్యం! నా జీవితంలో ఇదే మొదటి అనుభవం. ప్రపంచంలో నన్ను చూసి భయపడే వాళ్లు కూడా

వున్నారని నాకీవేళ తెలిసింది. ఇందాక వాళ్ళు, ఇప్పుడు మీరూ.....

డా :- వాళ్ళా, వాళ్ళెవరూ?....

శేష:- అదే, ఆ గుండు కాల్చానన్నానే....

డా :- అయితే మనుషుల్నే కాల్చి చంపారా?....

శేష:- కాల్చాను, అంతే, చచ్చారో లేదో తెలీదు. బహుశా చచ్చే వుంటారు. గుండు తగుల్తే చావరూ?

డా :- ఎవరు? ఎంత మంది?

శేష:- ఇద్దరు.... కాని ఒకరే చచ్చివుంటారు. ఒకే గుండు కాల్చానుగా....

డా :- చచ్చిందీ, లేందీ తెలీదా?

శేష:- ఏదీ అవకాశమే లేకపోయింది. కాల్చిన వెంటనే పరుగెత్తు కొచ్చాను.

డా :- నేరుగా ఇక్కడికే వచ్చారా?....

శేష:- అహఁ, ఇక్కడికని కాదు. పోలీసుస్టేషనుకు పరుగెత్తు కెళ్తున్నాను. దారిలో మీ బోర్డు కనిపించింది. ఇదివరకు ఎన్నోసార్లు, ఈ దారిని పోయినప్పుడల్లా మీ బోర్డు చూసి ఆగాను. లోపలికి రావాలనీ, నా జీవితాన్ని పీడించే ఒక ముఖ్య విషయంలో మీ సలహా తీసుకోవాలనీ, మనసులో ఎంత తీవ్రంగా వున్నా ఎప్పుడూ ధైర్యమాగక రాలేదు. ఇవాళ్ళ మీ బోర్డు కనిపించగానే, ఇంక మళ్లీ నాకీ అవకాశం చిక్కదనే తలంపు రాగానే, ధైర్యంగా ఎచ్చేశాను.

డా :- కాని ఆ ఇద్దరెవరో చెప్పరేఁ?

శేష:- చెబుతాను. అంతా చెబుతాను. మనసులో ఏదీ దాచకుండా అంతా చెబుదామనే వచ్చాను .... తొందర పడకండి. సావకాశంగా చెప్పనీండి.

డా :- (కొంత స్థిమితంగా) సరే, చెప్పండి.

శేష:- కాసిన్ని మంచినీళ్ళిప్పిస్తారా?....ఓ. సురాయి ఇక్కడే వుంది. తాగనా?

డా :- తాగండి.... వుండండి, కాఫీ చేయించి తెస్తాను.

శేష:- వొద్దొద్దు, మీరు లోపలికెళ్ళొద్దు. నాకు తెలుసు, పోలీసు స్టేషన్‌కి ఫోన్ చెయ్యాలని వెళ్తున్నారు.

డా :- అదిగో ఫోను ఈ గదిలోనే ఉంది.

శేష:- అయినా, దొడ్డిదారిని ఎవరినేనా పంపించ వచ్చుగా?

డా :- సరే, ఇక్కడినించే తెప్పిస్తాను....వెంకాయ్....

శేష:- వొద్దు వొద్దు, ఎవర్నీ పిలవవద్దు. నాకు కాఫీ, టీ ఏమీ అక్కర్లేదు. మంచినీళ్లు చాలు.....

(మంచినీళ్లు త్రాగిన శబ్దం)

డా :- సరే, ఇక నిమ్మళంగా కూచుని ప్రారంభించండి.

(ఒక్క క్షణం నిశ్శబ్దం)

శేష:- నా పేరు శేషగిరిరావు. కాని పిలచే వాళ్ళ అంతస్థూ, చదువునుబట్టి శేషూ, శేషయ్యా, శేషన్నా; శేషాయి, శేషగిరీ, గిరీ అంటూ అనేక రకాలుగా మారుతు వుంటుంది. అప్పుడప్పుడు, బహుశ నేననుకునే కంటే ఎక్కువ సార్లే, అంతస్థుల విచక్షణ లేకుండా తారుమారుగా పిలవటం కూడా జరుగుతూంటుంది. నా మనస్సు చివుక్కుమంటుంది. గట్టిగా మందలించాలని గొంతు దాకా వస్తుంది. కాని తీరా అనేస్తే ఏఁ ప్రమాదమో అన్న భయం నాకు తెలియకుండానే పీక నొక్కేస్తుంది. ఆ పొరపాట్ని గమనించనట్లు గానే నటిస్తాను. కాని ఒక్కొకసారి వెంటవున్న కొందరు శ్రేయోభిలాషులు ఆ పొరపాట్లని నొక్కిపట్టుకుని, "ఎలా భరిస్తావ్?'' అంటూ నిలేసి అడుగుతారు. అప్పటి నా అవస్థ చెప్పతరం కాదు. అవును, ఎందుకు, ఎలా భరిస్తానో నాకే అర్థంకాదు. వాళ్ళకేఁ చెప్పను? ఏదో ఒకటి బొంకి వూర్కుంటాను. ఏమీ తోచకపోతే, తలదించేసుకుంటాను. బహుశా అప్పుడు నా మొహం వెలవెలబోతుంటుంది.... నేనో బీద కుటుంబంలో పుట్టి పెరిగాను. చదువులూ, ఉద్యోగాలు తప్ప మరో ఆస్తి లేదు. ఆ ఉద్యోగాలు గూడా చావకుండా బ్రతక్కుండా నిలిపే గుమాస్తాగిరీలే. కాని పైకి ఒక్కరూ పోలేదు. నాకు బుద్ధి తెలియక పూర్వం నించే నాకూ పుస్తకాలకూ ఓ అవినాభావ సంబంధం ఏర్పడిపోయింది. మనుషులకు దగ్గిరగా నేనెన్నడూ రాలేకపోయాను. పుస్తకాలూ. పుస్తకాల్లోని పాత్రలే నాకు బంధుమిత్రులై పోయారు. నా కాలేజీ జీవితం కూడా యొంటరిగానే గడిచిపోయింది. రకరకాల విద్యార్థులుండే వాళ్ళు, చదువే పరమావధిగా భావించి వారాలుచేసుకొని చదివే బీద విద్యార్థులూ, చదువు నెపంపైన రొమాన్సులూ, ఆటలూ పాటలకోసం డబ్బుపిల్లిగవ్వల్లాగా విరజిమ్మే ధనవంతుల కుఱ్ఱాళ్ళూ, అటు చదువులోనూ, ఇటు

షోకుల్లోనూ తీసిపోని విద్యార్థినులు. వీరందరిలోకీ మెరుగు మాలతి. కాలేజీ జీవితం అణువు అణువునా విద్యుచ్ఛక్తిలా పాకిపోయింది మాలతి. అందంలో మాలతి, ఆటపాటల్లో మాలతి, డిబేట్సుల్లో మాలతి, మాలతి, మాలతి. ప్రతి విద్యార్థి నోటా మాలతి. నాలుగేళ్లు ఏకఛత్రంగా ఏలిందిమాలతి...మాలతి గురించి నేనుకూడా కలలు కన్నరోజులు లేకపోలేదు. కాని. అందరితోనూ చనువుగా వున్నట్టు ఉండే మాలతి నాతో ఒక్కసారైనా మాటాడిన పాపాన పోలేదు. కల్పించుకుని మాటాడే ధైర్యం నాకసలే లేదు..మధు అంటే అందరికీ ఈర్ష్య. నాకు భయం కూడాను. అందగాడు. ధనవంతుడు. మంచి స్పోర్ట్సుమన్. విద్యార్థినులకు హీరో, మాలతి అందరికంటే అతనితో ఎక్కువ చనువుగా వుండేది. ఇద్దరి గురించి అనేక పుకార్లు. పెళ్లి కూడా చేసుకుంటారనే భావం ఏర్పడిపోయింది. అయినా ఈర్ష్య తగ్గలేదు..ఒక రోజు మధ్యాహ్నం ఖాళీ పీరియడ్‌లో కాలేజీ తోటలో కూచుని పుస్తకం చదువుకుంటున్నాను...

మాలతి:- నమస్కారాలండీ! శేషగిరరావుగారూ!...

శేషగిరి:- తృళ్లిపడి. గాబరాగా- ఆఁ ఎవరూ. మీరా...? నమస్కారాలు...నమస్కారాలు...

మాల:- కూర్చోండి, కూర్చోండి...నాపేరు మాలతి. మీకు తెలుసనుకుంటాను.

శేష:- ఆఁ. తెలుసు తెలుసు...

మాల:- నేనూ కూచో వచ్చా?

శేష:- మీరా?...ఇక్కడా?...

మాల:- ఏఁ? కూచో కూడదా...మీకు అభ్యంతరం లేకపోతే...

శేష:- నాకా?... అబ్బెబ్బే...

మాల:- థాంక్స్; కూచుంటాను...ఏదో తీవ్రంగా చదువుతున్నట్లున్నారే?

శేష:- ఓ ఇదా?... అబ్బే, ఏఁ లేదండీ...

మాల:- అంటే కేవలం హస్తభూషణమే నంటారా...?

శేష:- (పెకిలి నవ్వు) ..,

మాల:- వచ్చే నెల్లో మన కాలేజీ వార్షికోత్సవాలు... మీరు వినే వుంటారు...?

శేష:- ఆఁ. ఆఁ, అవునవును. విన్నాను.

మాల:- ఆ సందర్భంలో ఒక నాటకం... అన్నట్లు మన కాలేజీ డ్రెమెటిస్ అసోసియేషన్‌కు నేను సెక్రటరీని, మీకు తెల్సునో. లేదో...

శేష:- ఓ అల్లాగా, తెలీదండీ,... కంగ్రాచ్యులేషన్స్.

మాల:- ఆఁ ఇప్పుడేఁ లెండి, చాన్నాళ్ళయింది ఎలక్టయి... సరే, కాని మీ సహాయం కావాలండీ...

శేష:- నా సహాయమా?...నేను... నేనేఁచేయగలనండీ..,?

మాల:- ఆ మధ్య ఓ పత్రికలో - అదేదో పత్రిక పేరు మరిచి పోయాను. మీ నాటిక "మాతృ ఛాయ" పచ్చింది చూడండి...

శేష:- ఓ హో...అదా...?

మాల:- ఆ నాటికని స్టేజ్ చేస్తే బావుంటుందని అనుకున్నాం...

శేష:- ఆ నాటకం వేస్తారా?

మాల:- అవును, వచ్చే వార్షికోత్సవాల్లో వెయ్యాలని నిశ్చయించుకున్నాం. .ఏమంటారు?

శేష:- నేనా?...నేనేమంటాను.,,?

మాల:- మీరంగీకరిస్తారా?

శేష:- నేనా?... నేనంగీకరించేదేమిటి?

మాల:- అయ్యో, మీ అనుమతి లేకుండా మీ నాటకం ఎట్లా వేస్తామండి?

శేష:- అబ్బే! ఇంత మాత్రానికి నా అనుమతి దేనికండీ?

మాల:- అయితే, మీకు అభ్యంతరం లేదన్న మాట. థాంక్స్....మరొక్క సహాయం చేసి పెట్టాలి.

శేష:- ఏమిటి? ఏఁ చెయ్యాలి?...

మాల:- మీరు కూడా వేషాలు వేస్తారా?

శేష:- అబ్బెబ్బే, లేదండీ, లేదు...

మాల:- పోన్లెండి. కనీసం మా రిహార్సల్స్ కేనా రండి.

శేష:- రిహార్సల్ కా?... ఎందుకూ?

మాల: మాకు కొంత డైరెక్షన్‌లో తోడ్పడాలి,

శేష:- అబ్బెబ్బే; నాకేఁ తెలీదండీ. నిజంగా తెలీదు.

మాల:- నా అభిప్రాయమేమంటే, వీలైనప్పుడల్లా ప్రొడక్షన్‌లో రచయిత కూడా పాల్గొనటం ఎంతైనా మంచిదని, రచయిత మనసులో కొన్ని భావాలు పెట్టుకుని రాస్తాడు. అవన్నీ సరిగ్గా డెపిక్ట్ అవు

తున్నయ్యా, లేవా అని చూసుకోవటం మంచిది కాదూ?

శేష:- ఆఁ ఏవుందండీ. మీకు తెలియంది ఏఁవుంటుందీ?..

మాల:- అహఁ అలాకాదు. మీరు తప్పకుండా రావాలి. వచ్చే శనివారం సాయంత్రమే ఫస్టు రిహార్సలు. తప్పకుండా రావాలి. వస్తారు కదూ?...

శేష:— ...ఆ. వస్తాను..,

(మ్యూజిక్. నేపథ్యంలో రిహార్సల్స్ హడావిడి)

మాల:- ఏఁవండీ శేషగిరిరావుగారూ? ఏఁ చెప్పరేఁ? ఎలా వుంది?

శేష:— ఓ, దానికేఁ? బావుంది. బావుంది.

మాల:- అబ్బే, మీరు మొహమాట పడిపోతున్నారు. సిన్సియర్‌గా చెప్పెయ్యాలి నా ఉద్దేశం నాకేఁ బాగు లేదు. ముఖ్యంగా సరస్వతి ఉచ్చారణా...

శేష:— సరస్వతా?...

మాల:- ఆఁ, అదే ఆ కూతురు పాత్ర వేస్తోందే ఆ అమ్మాయి...ఒక్కులు పలకటంరాదు. మరింకెవ్వరూ లేరు. ఏఁ చెయ్యాలో తోచటం లేదు, బాగా రిహార్సల్సు చేయిస్తే బహుశా...

శేష:— అవునవును, చేయించాలి.

మాల:- మధు ఆక్టింగ్ ఎలా వుందంటారు?

శేష:— మధూ,..?

మాల:- మధుసూధనరావు తెలీదూ? కొడుకు వేస్తున్నాడే...

శేష:— ఆవునవును తెలుసు.

మాల:- అతని ఆక్టింగ్...

శేష:— ఆఁ, ఏఁ?

మాల:- ఏఁవీ బావుండలేదు. అంత ముఖ్యమైన పాత్రఎంత రంజింప చెయ్యాలి, ఏఁవిటీ.

శేష:— నిజమే, నిజమే. బావుండలేదు.

మాల:- మీ అభిప్రాయమూ అంతేనన్న మాట. మార్చి మరొకరికిస్తే బావుండేది. కాని మధులేకుండా నాటకం.......

మధు:— (దూరాన్నుంచి) ఏఁవిటి, నా గురించేనా మాట్లాడుతోందీ?

మాల:- అవునవును. ఇలారా ఇదిగో శేషగిరిరావుగారు. ఎరుగుదువుగా....?

మధు:- ఓ శేషయ్యా?.... ఈయన్నెరక్కపోవటమేవిఁటీ? శేషయ్యా డి అండ్ డి అంటే కాలేజీ అంతా తెలుసు.

మాల:- అదేవిఁటదీ? డి అండ్ డి....?

మధు:- తెలీదూ? చెప్పనా?

(గుసగుసాగా కాని బాగా వినిపించేట్లు)

డెఫ్ అండ్ డంబ్.

మాల:- ఛీ! ఛీ! ఇవేఁ పోకిరి మాటలూ....మన నాటకానికి రచయిత, తెలుసా?

మధు:- ఓ ఈ శేషయ్యేనా రాసింది? అలాచెప్పు. అందుకే అంత చప్పగా వుంది. ఎంత ప్రాణం పోసినా బ్రతకటం లేదు.

మాల:- అవును, ఎలా బ్రతుకుతుందీ, . సరస్వతీ మధు లాంటి పాత్రధారులు దొరుకుతే?

మధు:- ఏఁ? ఏమయింది మాకూ?

మాల:- మీకేఁ కాలేదు. నాటకానికే వచ్చింది. ఇందాక మేమిదే అనుకుంటున్నాం. సరస్వతికి ఉచ్చారణ రాదూ?.......

మధు:- సరస్వతి ఉచ్చారణ కేమయిందీ? ఆ వెధవ నాటకం రాతే అంతగానీ; మరో మరో నాటకం అయితే ఎంత బాగా పలికేదీ...?

మాల:- అని నువ్వనుకుంటావు?

మధు:— సరే కాని, నా మాటో?

మాల:- నీకు ఆక్టింగ్ రాదు.

మధు:- ఏవిఁటీ? నాకు ఆక్టింగ్ రాదా? నాకు? హుఁ, రేపు నేనే గనక సినిమాల్లోకి దిగితే ఎవడేనా ఆగ్గలడా నా ముందు? ఎవడా అన్నది నాకు ఆక్టింగ్ రాదని?

మాల:- మా ఇద్దరి అభిప్రాయమూ అంతే?

మధు:- ఏవిఁటీ? ఈ శేషయ్య కూడా అన్నాడా? ఏఁవిటోయ్, నీకు ఆక్టింగ్ అంటే ఏవిఁటో తెలుసా? ఇందాక నేను చేసిన ఆక్టింగ్ బావుండలేదూ? ఏఁ చెప్పవేఁ? బావుండ లేదూ?...

శేష:- ఆఁ, ఆఁ, బావుందండీ, బావుంది...

మధు:- విన్నావా మాలతీ!

మాల:- ఏఁవండీ! ఇందాక నాతో ఏకీభవించానన్నారే, ఇప్పుడు మళ్ళీ....

శేష:- ఆఁ, అదేనండీ, అదే....వస్తానుమరి. కాస్తపనుంది, వెళ్ళాలి. శెలవ్......

(వెళ్తాడు, వెనకాల మధు నవ్వు)

శేష:- ఆ తర్వాత మళ్ళీ నన్ను రిహార్సల్సుకు పిలవలేదు. నేనూ వెళ్ళలేదు. నాటకం రోజు కూడా వెళ్ళలేదు. మాలతి మళ్ళీ నన్ను పలకరించనే లేదు.. పరీక్షలు దగ్గర కొచ్చాయి. శలవులిచ్చారు. చదువు తప్ప అంతా మరిచి పోయాను. పరీక్షకింకా నాలుగు రోజులున్నాయనగా, దినమల్లా చదివి సాయంత్రం అలా షికారుకు బయలు దేరాను......

(కారు హార్న్ మోత...దగ్గరగా వచ్చి కారు ఆగిన శబ్దం)

మాల:- హలో! మిస్టర్ గిరీ!

శేష:- ఓ, హలో!....మాలతి గారా?....

మాల:- రండి, రండి, కారెక్కండి. మీ కోసం ఎంత వెతకానండీ....

శేష:- ఆఁ, నాకోసమా? ఏఁ?...

మాల:- చెబుతాను. ముందు కారెక్కండి.

శేష:- ఎక్కడికీ?

మాల:- చెబుతాగా, రండి....గెటిన్...ప్లీజ్....

(కారు తలుపు తెరిచి మూసిన శబ్దం. స్టార్ట్ అయి నడుస్తోన్న శబ్దం)

మాల:- అబ్బ, మీరిలా దారిలో కనిపించటం మంచిదై పోయింది. మీ యిల్లు అసలే చిక్కేది కాదు.

శేష:- ఇంతకూ ఎక్కడికో...

మాల:- అబ్బే ఎంతో దూరం కాదండీ. ఇక్కడే సినిమాకి.

శేష:- సినిమాకా?

మాల:- ఏఁ? మంచి పిక్చరట. ''ది హెల్'' పేరు విన్నారో లేదో, అద్భుతంగా వుంటుందట.

శేష:- ఇవ్వాళా?

మాల:- అవును ఇవ్వాళ్ళే? ఏఁ?

శేష:- ఏఁ లేదు, పరీక్షలూ.......

మాల:- మీకేమండీ, ఎప్పుడూ చదువుతూనే వుంటారుగా, ఇవ్వాళ ఒక్క రోజు చదవక పోయినా మీకు ఫస్ట్ క్లాస్ తప్పదు లెండి...టిక్కెట్లు కూడా కొనేశాను.

శేష:- కొనేశారా? ఎవరికీ?

మాల:- మీకూ, నాకూనూ......

శేష:- నిజంగానే....?

మాల:- ఏఁ, నమ్మకం లేదా? చూపించనా?....

శేష:- అహఁ అది కాదు.

మాల:- మిమ్మల్ని అడక్కుండా కొనేశాననా?

శేష:- అబ్బెబ్బే, అది కాదు.

మాల:- నాతో రావటం ఇష్టం లేదా?

శేష:- ఛా ఛా, అది కాదు,

మాల:- మరింకేది?....ఇదుగో వచ్చేశాం....

(కారు ఆగి తలుపు తెరిచి మూసిన శబ్దం)

మధు:- హలో మాలతీ-

మాల:- హలో....

మధు:- ఇదేవిఁటి, ఈ పిల్లిని చంకనెట్టుకొచ్చావేఁ?

మాల:- మాటలు తిన్నగా రానీ. నీ వెంట పిల్ల లేదూ?

మధు:- పిల్లా? ఏ పిల్ల?

మాల:- ఇంకే పిల్ల. సరస్వతి.

మధు:- వస్తానందా? ఇక్కడికి?

మాల:- నన్ను ఫూల్ చెయ్యకు మధూ,

మధు:- ఏవిఁటి మాలతీ. నాకర్థం కావటం లేదు. నీ మాటలు.

మాల:- ప్రొద్దున నువు రామారావుతో అన్న మాటలు జ్ఞాపకం వుంటే, అంతా అర్థం అవుతుంది.

మధు:- ఏమన్నానూ?

మాల:- నేనూ, సరస్వతీ ఇవ్వాళ సినిమాకెళ్తామని అన్లేదూ?

మధు:- అబద్ధం. నేనూ, మాలతీ వెళ్తాం అని అన్నాను.

మాల:- కాదు, కాదు సరస్వతనే అన్నావు.

మధు:- అన్నానా? అయితే పొరపాటే జరిగింది. మాలతి బదులు సరస్వతి పేరు నోరు జారి వుంటుంది.

మాల:- అన్నీ అబద్ధాలు. రానని వుంటుంది.

మధు:- నేను రమ్మంటే రాననే అమ్మాయిని నేనింకా కలుసుకోలేదు.

మాల:- అబ్బ, ఏఁ గర్వం?

మధు:- గర్వం కాదు, నిజం.... పాపం. సరస్వతి ఎక్కడుందో ఏమిఁటో, శలవు లైనప్పటి నుంచీ చూణ్ణయినా లేదు.

మాల:- నిజం?

మధు:- మువ్మాటికీ నిజం.... అబ్బ, ఏం జెలసీ, ఇంత మాత్రానికే ఇంత నాటక మాడాలా....?

మాల:- ఇది నాటకం కాదు సినిమా.... చాలా మంచి చిత్ర మంటే వచ్చారు శేషగిరిరావుగారు.

మధు:- ఎవరా అన్నది మంచి చిత్రమని.

మాల:- నువ్వే అన్నావు, ఇవ్వాళ ప్రొద్దున.

మధు:- లేదు, అన్లేదు-

మాల:- అన్నావు.

మధు:- అయితే, అది రెండో పొరబాటు. మరెవ్వరి మాటలో అనేసి వుంటాను..... ఇంతకంటే చచ్చు చిత్రం వుండదని తర్వాత తెలిసింది. అందుకనే మరో మంచి ప్రోగ్రాం వేశాను. నిన్ను పికప్ చేసుకుందామని, మీ ఇంటికివెడితే, నువ్విక్కడికి వచ్చావని తెలిసి, చక్కా వచ్చాను,.... ఊఁ, వెంటనే కదలాలి. అట్టే టైం లేదు,

మాల:- ఊఁ, నేను రాను. టిక్కెట్లు కూడా కొనేశాను.

మధు:- మరీ మంచిది. సమస్య తేలిపోయింది. ఏవీ టిక్కెట్లిలాతే.... ఇదిగో శేషయ్యా, ఈ టిక్కెట్లు తీసికొని వెళ్ళి సినిమా చూడు. వెంట ఎవరైనా వస్తే తీసికెళ్ళు, లేదా అమ్మేసి డబ్బు చేసికో, వెళ్లు.., (మెల్లిగా) ఈ రొమాన్సులకి నువ్వు తగవు బ్రదర్! తప్పుకో........

మాల:- ఏవిటా గుసగుసలు.

మధు:- గురోపదేశం. ఎప్పటికేనా పనికొస్తుందేమో నని ఇస్తున్నాను.... ఇంక నీవు రా, ఆలస్యం చెయ్యకు.

శేష:- నేను నిశ్చేష్టుడనై అలాగే నిలుచుండి పోయాను. ఇద్దరూ వెళ్ళి పోయారు. మాలతి తిరిగేనా చూడ లేదు. అంతా సినిమాలానే కళ్ళెదటే జరిగి పోయింది. నేను కేవలం ప్రేక్షకుడిగా వుండి పోయాను. కోపం, దుఃఖం ఒక్కసారి పొంగు కొచ్చాయి. కళ్ళ నీళ్ళు నిండాయి, చేతిలో రెండు టిక్కెట్లు వుండిపోయినాయి. వాటిని చించి పారేసి ఇంటికి బయలుదేరాను. ఇంక మాలతి మాటే తల వొద్దనీ, కలిసినా మాట్లాడొద్దనీ కృత నిశ్చయం చేసుకున్నాను.... పరీక్షలయిపోయినాయి. ఫలితాల కోసం ఎదురుచూస్తున్నాను. పత్రికల్లో ఉద్యోగాల ప్రకటనలు వెతుక్కుంటూ. పుస్తకాలు చదువుతూ కాలక్షేపం చేస్తున్నాను...... ఒక రోజు రాత్రి భోంచేసి వచ్చి, గదిలో దీపం వెలిగించా. లైబ్రరీ నుంచి తెచ్చిన మంఘమ్ సరి కొత్త నవల చదువు కుంటూ పడుకున్నాను...............

(మెల్లిగా తలుపు తట్టిన శబ్దం)

శేష:- ఎవరు?—ఎవరు?

(తలుపు తెరిచిన శబ్దం)

శేష:- ఆఁ? ఎవరూ? మీరా? మాలతిగారా?

మాల:- అవును, నేనే........లోపలికి రావచ్చా?......

శేష:- రండి... కాని, ఇంత రాత్రి...

మాల:- మరేఁ ఫరవాలేదు. ఇంకా తొమ్మిది కూడా దాట లేదు.... అవ్వేటే మీరేఁ శ్రమపడకండి. నేనిక్కడే చాప మీద కూచుంటాను. కాస్త దీపం హెచ్చిం చండి...చాలు... అలానిలుచున్నారేఁ? కూచోండి.. ఏఁ చదువుతున్నారు. ఓ, ఇదా? నేను చదివాను. మీరు చదివాక మీ అభిప్రాయం చెప్పాలి. మంఘమ్ నవల లంటే నాకు చాలా ఇష్టం........ అలా బెదిరి చూస్తారేఁ? నేనేం మిమ్మల్ని మింగివేయను లెండి. అట్టేసేపు కూడా విసిగించను. వెళ్ళిపోతాను, కాని వున్నంతసేపూ కాస్త కులాసాగా మాట్లాడండి.

శేష:- ఏఁ మాట్లాడను?

మాల:- మాట్లాడదలచుకుంటే ఎన్నేనా వుంటై... పరీక్ష లెలా చేశారు?

శేష:- బాగానే చేశాను.

మాల:- అయినా మిమ్మల్ని అడగాల్సిన ప్రశ్న కాదది, మీరు మరోలా ఎల్లా చెయ్యగలరు?

శేష:- మీరెలా చేశారు?

మాల:- ఫలితాలు వస్తాయిగా, అవే చెబుతాయి జవాబు, మీ ముందు ప్రోగ్రాం ఏవిటి?

శేష:- అంటే?

మాల:- ఫలితాల తర్వాత?

శేష:- ఏవుందీ, ఉద్యోగం వెతుక్కోటం?

మాల:- అదెంతసేపు లెండి. ఆ తర్వాత?

శేష:- ఆ తర్వాతా?....నేనింకా అంత దూరం ఆలోచించ లేదే........

మాల:- మరి పెళ్ళి మాటో?

శేష:- పెళ్ళా.........ఎవరి పెళ్ళి?

మాల:- మీ పెళ్ళి, ఇంకెవరి పెళ్ళి.

శేష:- నేనేమీ అనుకోలేదే.

మాల:- మీరనుకోకపోతే, మీవాళ్ళెవరి నేనా నిశ్చయించి వుంటారా?

శేష:- అబ్బెబ్బే! అలాంటిదేమీ లేదు.

మాల:- అయితే ఇంతవరకూ మీ దృష్టిలో ఎవరూ లేరన్న మాట.

శేష:- లేరు.

మాల:- ....పోనీ, నన్ను చేసుకుంటారా?

శేష:- ఆఁ? ఏమన్నారూ?

మాల:- ఏఁ లేదు. నన్ను పెళ్ళి చేసుకుంటారా అని అడిగాను.

శేష:- నేనా? మిమ్మల్నా?

మాల:- ఏఁ? నేను మీకు తగనా?

శేష:- ఆఁ?........

మాల:- నేనూ మీ అంత చదువుకున్న దాన్నే. కురూపిని కాననుకుంటాను........ కావాలంటే ఉద్యోగం కూడా చెయ్యగల్ను... మరి నన్ను పెళ్ళిచేసుకోవటానికి మీకేం అభ్యంతరం ఉంటుంది?

శేష:- ....

మాల:- ఏఁ? మాట్లాడరేఁ?

శేష:- ఏమనాలో తోచటం లేదు. అంతా అయోమయంగా వుంది.

మాల:- ఇందులో అయోమయం ఏఁవీ లేదు. మీరు పరీక్ష ఏచ్చారు. తప్పకుండా ప్యాసవుతారు. తప్పకుండా ఉద్యోగం అవుతుంది, తప్పకుండా పెళ్ళి కూడా చేసుకుంటారు. ఆ పెళ్ళి నాతో జరగటానికి మీకేమైనా అభ్యంతరం వుంటే చెప్పండి.

శేష:- ఏఁ వుంటుందీ....?

మాల:- ఏఁవీ లేదన్న మాట... ఇంకేఁ? వచ్చే శనివారం రోజున మన పరీక్ష ఫలితాలు. ఆదివారం మన పెళ్ళి.

శేష:- ఆఁ. వచ్చే ఆదివారమా?

మాల:-అవును. వచ్చే ఆదివారమే. డబ్బు విషయం మీరేమీ ఆలోచించకండి. చాలా సింపిల్ మారేజ్. అన్ని ఏర్పాట్లూ నేను చేస్తాను...మీరు సిద్ధంగా వుండండి. అంతే.

శేష:- కానీ....

మాల:-కానీ గీనీ కట్టిపెట్టి సిద్ధంగా వుండండి....వస్తాను. పొద్దుపోయింది. శలవ్.

శేష:- వెళ్లిపోయింది. నేనా దెబ్బకి తేరుకోక పూర్వమే వెళ్లిపోయింది. ఆఖరికి ఆమె అనుకున్నట్లుగానే, నేననుకోకుండానే ఆ వచ్చే ఆదివారం రోజు మా పెళ్లి జరిగిపోయింది....దాంతో ఆరంభమైనాయి నా కష్టాలు.... .... ఏవీ, కాసిన్ని మంచినీళ్లు.....

—. నీళ్లు తాగిన శబ్దం .—

ఒక సిగరెట్టు ఇప్పిస్తారూ? ... థాంక్స్...

—. సిగరెట్టు కాల్చిన శబ్దం .—

మాలతి అనుకున్నట్లుగానే నాకు ఫస్టుక్లాసు వచ్చింది. కాని ఎంత ప్రయత్నం చేసినా గుమాస్తా ఉద్యోగం తప్ప మరోటి దొరకలేదు. విధిలేక చేరాను....రెండు నెల్లు తిరక్కుండానే, మా గృహజీవితం అడ్డుదారిన పడ్డది.

మాల:-అబ్బబ్బ! ఈ మనిషితో వేగలేను...అల్లా కూచుంటారేఁ? బండరాతిలా...? నోట్లో నాలిక లేదూ? మాట్లాడరేఁ?....నా కర్మకాలి మీ పాలిట పడ్డాను.... అలా చూస్తారేఁ?....నేనే మిమ్మల్ని కోరి చేసుకున్నాననేనా? ... అవునవును. నాదే పొరపాటు. అంతా నాదే పొరపాటు. ఆనాడు నాకు పిచ్చివచ్చి వుంటుంది. పిచ్చాసుపత్రికి పోవటానికి బదులు మీ దగ్గరికి వచ్చాను...పోనీ, నోరుజారి అడిగానే అనుకో, చెప్పొద్దూ? నేను పెళ్లి చేసుకోనని చెప్పేస్యొద్దూ? బెల్లంకొట్టిన రాయిలా చూచోరా... అయ్యో. ఖర్మ. నా ఖర్మ.

(నొసలు బాదుకుంటుంది)

—. మ్యూజిక్...ఫేడవుట్ .—

మాల:-ఇదేవిఁటి? ఈనెల మళ్ళీ పది రూపాయలు తక్కువ తెచ్చారే? ఎవరికిచ్చారు? .... చెప్పరేఁ? ఎవరికిచ్చారు?....

శేష:- ఒక ఫ్యాను అడుగుతే....

మాల:-క్రిందటి వాడేనా?

శేష:- కాదు.

మాల:-వాడిచ్చాడా?....అడిగారా?

శేష:- అడిగాను, కాని........

మాల:-ఇవ్వలేదు. అంతే. మీ దేబె మొహం చూస్తే అందరికీ అలుసే....మళ్ళీ ఈ నెల....

శేష:- చాలా అవసరం వుందంటే....

మాల:-మనకు అవసరాలు లేవా?.... మీ కంత డబ్బు ఎక్కువై పోయిందా? అడిగిన వాడికల్లా ఇవ్వటమేనా?....ఏదీ, రేపు మీ ఆఫీసుకు వస్తాగా, అందర్నీ చీవాట్లు వేస్తాను....

శేష:- ఆదుర్దాగా వొద్దు వొద్దు.

మాల:-వొద్దేవిఁటి తప్పకుండా వస్తాను. మీ ఆఫీసరుతో చెబుతాను. మీ చేతికసలు జీ త మే ఇవ్వొద్దని. ఫస్టుకు నేనే వె ళ్ళి తీసుకొస్తాను....ఛీఛీ! ఏం బ్రతుకు....

(మిగతా వచ్చే సంచికలో)

వాసనలేని పువ్వు, బుధవర్గము లేని పురంబు, నిత్య వి
శ్వాసము లేని భార్య, గుణవంతుడు గాని కుమారుఁడున్, సద
భ్యాసము లేని విద్య, పరిహాసము లేని ప్రసంగ వాక్యమున్,
గ్రాసము లేని కొల్వు, కొఱగానివి పెమ్మయ సింగధీమణీ!

*　　*　　*

తంత్రులు లేని వీణయును, తానము రాగము లేని గీతమున్
మంత్రము లేని సంధ్యయును, మౌనము లేని తపంబు, వేద వి
ద్యాంత్రము లేని యాగము, పదజ్ఞత లేని కవిత్వ తత్త్వమున్
మంత్రులు లేని రాజ్యము సమానము లియ్యవి మల్లికార్జునా!

సౌందర్య లహరి

— కాటూరి వేంకటేశ్వరరావు

తను మధ్యక్వణ కింకిణీరశన, మాద్యత్కుంభి కుంభోపమ
స్తన భారానత దేహవల్లిక, శరద్రాకాశశాంకాస్యయై,
ధనువుం దూపులు పాశ మంకుశము నుద్యత్పాణులం దాల్చి మా
కనువిందై పురదాహకాహమిక యా కల్యాణి మ మ్మేలుతన్॥

హరి తన వేయిశీర్షములయందు ధరింపగ భారమై జగ
ద్విరచనసేయుపొంతె దొలిబిచ్చము పంకజసూతి పాలికై,
హరునకు అంగరాగ మయినట్టి భవచ్చరణాబ్జ ధూళిలో
చిఱుతుకరేణు లేశములు చెందుత మమ్మరో! మా యఘమ్ములన్,

చక్కెరవిల్లు, వింటికిని షట్పదశింజినియంట, తూపులున్
లెక్కకు నైద, టామనియె నెయ్యుడుగా, వలినాలిగాలితే
రెక్క యసంగ దెక్కటి జయించెడినంట జగమ్ము; లే దయా
ద్వక్కరణమ్ము సుంత ప్రసరించెనో నీ కడకంట వానిపై!

——:*:——

తంతి, తపాలా సౌకర్యాల విస్తరణ

ఆంధ్ర తంతి, తపాలా మండలం 1953 సెప్టెంబర్ ఒకటవ తేదీన ఏర్పరుచబడింది. అప్పుడు అందులో 7 పోస్టల్ డివిజన్లు, ఒక ఇంజనీరింగ్ డివిజన్, ఒక ఆర్.ఎమ్.ఎస్. డివిజన్ ఉన్నాయి. అవి పూర్వాంధ్ర రాష్ట్రం 11 జిల్లాలకు ఉపకరించేవి. గడచిన 6 $\frac{1}{2}$ సంవత్సరాలలోనూ యీ మండలం అన్ని శాఖలు విస్తరించాయి. వివరాలు దిగువ యివ్వబడినవి,

	1.9.53 నాటికి	1.2.60 నాటికి
1. తపాల కార్యాలయాలు	3,660	6,412
2. తంతి, తపాల సౌకర్యాలు రెండూ గల కార్యాలయాలు	221	403
3. శాఖా పరమయిన తంతి కార్యాలయాలు	3	8
4. టెలిఫోన్ ఎక్ఛేంజ్‌లు	21	102
5. పబ్లిక్ కాల్ ఆఫీసులు	93	263
6. టెలిఫోన్ కనెక్షన్‌లు	2,654	7,998

ఈ మండలంలో ఇప్పుడు 9 పోస్టల్ డివిజన్లు, 2 ఇంజనీరింగ్ డివిజన్లు, ఒక ఆర్.ఎమ్.ఎస్. డివిజన్, 8 శాఖా పరమయిన తంతి కార్యాలయాలు ఉన్నాయి.

తొలి పంచవర్ష ప్రణాళిక కాలంలో, 2,000, అంతకు పైన జనాభా గల గ్రామాలన్నిటిలోనున్నూ, ఒక దానికొకటి నాలుగు మైళ్ళ లోపు దూరంలో ఉన్న కొన్ని గ్రామాల వర్గాలలోనున్నూ తపాల కార్యాలయాలు తెరువబడినవి. ద్వితీయ ప్రణాళిక సమాప్తమయేలోగా అనగా 1961 మార్చి లోగా ఇంకా యెక్కువ అభివృద్ధి సాధించబడుతుందని భావించబడుతున్నది.

తంతుల సంఖ్య 1954 లో కంటే 55 శాతం హెచ్చింది. వైర్‌లెస్ లైన్ల శాఖ సంఖ్య 1953-54 లో 39,462 ఉన్న దల్లా 1-2-60 నాటికి 79,679 కి హెచ్చింది. టెలిఫోన్‌ల వాడకం విరివిగా హెచ్చింది.

ఆంధ్ర తంతి, తపాలా మండలం ఏర్పడిన పిమ్మట శ్రీకాకుళం, ఒంగోలు, విజయనగరాలలో కొత్తగా మూడు హెడ్ ఆఫీసులు తెరువబడినవి.

టెలిప్రింటరు సర్వీసు

విజయవాడ-హైద్రాబాద్, గుంటూరు,మద్రాసుల మధ్య, విజయవాడ-సికిందరాబాదు, కర్నూలు, మద్రాసుల మధ్య టెలిప్రింటరు పనిచేస్తున్నది. ఇప్పుడీ మండలంలో 23 ముఖ్య కేంద్రాల నుంచి ఫోనోగ్రామ్ పంపటానికి సౌకర్యాలున్నాయి.

విశాఖపట్నం, విజయవాడ, చిత్తూరు, నెల్లూరు, గుంటూరు, కర్నూలు మున్నగు ముఖ్య కేంద్రాలలో పత్రికా సంస్థలకు ప్రత్యేక సౌకర్యాలున్నాయి. అనుకొన్న ప్రకారం ప్రతి తాలూకా ముఖ్య పట్టణంలోనూ, మంత్రాలయం, తిరుపతి, అన్నవరాల వంటి ముఖ్య యాత్రా కేంద్రాలలోను తంతి కార్యాలయాలు తెరువబడినవి. భద్రాచలంలోని తంతి కార్యాలయంలో సంవత్సరానికి దాదాపు 2 నెలలు-గోదావరికి అధికంగా వరద వచ్చినప్పుడు-వైర్‌లెస్ ద్వారా పని జరుపబడుతుంది.

టెలిఫోన్

ఈ మండలంలో టెలిఫోన్ రంగంలో కూడా తగినంత అభివృద్ధి జరిగింది. ద్వితీయ ప్రణాళిక నాలుగవ సంవత్సరమయినా పూర్తి కాకుండానే యీ విస్తరణ 100 శాతాన్ని మించి పోయింది.

త్వరలోనే విజయవాడ, విశాఖపట్నాలలో ఆటో ఎక్ఛేంజ్‌లు ఏర్పడగలవు. గుంటూరు, రాజమండ్రీల లోని మల్టిపుల్ ఎక్ఛేంజ్‌లు కూడా ద్వితీయ ప్రణాళిక ఆఖరు నాటికి విస్తరిల్లగలవు.

కాకినాడ, విజయనగరం, ఏలూరు, నెల్లూరులలో 400/600 లైన్ల మల్టిపుల్ ఎక్ఛేంజ్‌లను నెలకొల్పాలని సంకల్పించబడింది. ఇవి అప్పుడే మంజూరు అయినవి. అలాగే ఆదోని, తెనాలిలలో 300/400 లైన్ల మల్టిపుల్ ఎక్ఛేంజ్‌ల ఏర్పాటు కూడా మంజూరు చేయబడింది. ఈ పని 1960-61 లో చేపట్టబడవచ్చు.

ఈ సంవత్సరం దిగువ కేంద్రాలలో ఎక్ఛేంజ్ పని శక్తి విస్తరించబడింది:- కడప, చిత్తూరు, ఆదోని తెనాలి, నెల్లూరు, విజయనగరం, పాలకొల్లు, ఏలూరు.

విశేషాభివృద్ధి

ట్రంకు టెలిఫోన్ వాడకం బాగా హెచ్చింది. ఈ మండలం ఏర్పడినప్పుడు నెలకు 42,895 గా ఉన్న ట్రంక్ కాల్‌ల సంఖ్య 1960 జనవరి నెలాఖరుకి 1,79,896 కి హెచ్చింది. ఆదాయం నెలకి రూ. 1,11,479 నుంచి రూ. 3,16,164 కి హెచ్చింది. భారతీయ తంతి. తపాలా శాఖ పరిశోధనా విభాగం ట్రంకు టెలిఫోన్ పనిచేసే విధానంలో పెక్కు ఆధునిక పద్ధతులనూ, కారియర్, ట్రంకు ఎక్ఛేంజ్‌ల విషయంలో నూతన విధానాలను రూపొందించింది, అవి యిక్కడ ప్రవేశపెట్టబడుతున్నాయి. ఇందువల్ల ట్రంక్ కాల్‌ల విషయంలో ఆలస్యాలు, రద్దీ తగ్గడమే కాక ఉన్న సాధన సంపత్తిని, సిబ్బందిని యింకా యెక్కువగా వినియోగించుకొనడం ద్వారా తగినంత పొదుపు కూడా జరుగుతుంది.

ఈ మండలం ముఖ్య కార్య స్థానంలో ఒక విజిలెన్సు సంస్థ ఏర్పరచబడినది. అది ఒక సీనియర్ ఆఫీసరు క్రింద ఉన్నది. ఇక్కడ అవినీతి ఫిర్యాదులు వగైరా విషయంలో ప్రత్యేక దర్యాప్తులు జరుపబడుతాయి.

ఈ మండలంలో ఆర్గనైజేషన్, పద్ధతుల డివిజన్ కూడా ఒకటి ఉన్నది. ఇది మామూలు ఆలస్యాలను తగ్గించి తద్వారా సామర్థ్యాన్ని హెచ్చించే విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుంది.

ఫిర్యాదుల సంస్థ

ప్రజల ఫిర్యాదుల తక్షణ పరిష్కారానికై ప్రత్యేకం ఫిర్యాదుల సంస్థ ఒకటున్నది. ఏ ఫిర్యాదూ, ఏ దశలోనూ 48 గంటల కంటే ఎక్కువ కాలం అపరిష్కృతంగా ఉంచబడదు. జరిగేపని విస్తృతమయినది. దీనితో పోల్చినప్పుడు ఫిర్యాదుల సంఖ్య లెక్కలోనికి రాదు.

ప్రస్తుత ఆంధ్ర తంతి, తపాలా మండలం హైదరాబాద్ తంతి, తపాలా మండలం తెలంగాణా భాగాలలో త్వరలోనే విశాల తంతి, తపాలా మండలం ఏర్పడగలదని భావించబడుతున్నది.

గారెలు లేని విందు; సహకారము లేని పనంబు తొల్తనోం
కారము లేని మంత్ర; మధికారము లేని ప్రతిజ్ఞ; వాక్చమ
త్కారము లేని తెల్వి; గుణకారము లేనటువంటి లెక్క; సా
కారముగాని పూజ; కొఱగానివి వెమ్మయ సింగ ధీమణీ!

స్వాగతము

—భట్టారం మల్లికార్జున కవి

కొన్ని నాళ్లగ మము బట్టియున్న యట్టి
దుర్వికారమ్ము నిన్నటితో దొలంగె
నిర్వికారుల మైతిమి నేటి నుండి
శార్వరీ ! రమ్ము! నీ కిదే స్వాగతమ్ము.

2

నేడు స్వాతంత్ర్య చంద్రికల్ నిండుకొన్న
నేల నాల్గంచులన్ కళానిధులె రాజు
లైరి- సన్మార్గులైన మావారి యేలు
బడి సుఖంబిచ్చునమ్మ ! శార్వరికి నీకు.

3

చెడుగు దుందుడుకులకు బాల్పడక, మాదు
కోరికలు దీర్ప జీవముల్ ధారవోసి
నట్టి యొక పొట్టిమొనగాడు పుట్టినట్టి
తెలుగు మాగాణి శార్వరీ ! తెలియు మిదియె !

4

వెల్ల మొగములు గల్గిన వేటకాండ్రు
చెదరి పర్వెత్తునట్లు గర్జించినట్టి
బొబ్బ మెకమును శార్వరీ ! మునుపు వచ్చి
నపుడు చూచితి విచట ! ఆ అంధ్ర మిదియె !

5

చెమట లూడ్చిన మా తెల్గు సేద్యగాండ్ర
మెచ్చి ముచ్చటపడి దేవు డిచ్చినట్టి
మేలి బంగారు పతకాలు—వేల కొలది
పంటకళ్లాలు-చూపింతు వెంట రమ్మ.

6

వేప పూవుల చేదును రూపుమాపి
పొగరు మామిడి పిందెల పులుసు విడిచి
ఆమెతలు పెట్టెదరు నీకు ఆంధ్రు లిపుడు
శార్వరీ ! ఆరగించి విశ్రాంతి గొనుమ.

7

మరల నీ విచ్చటికి వచ్చు తరుణమునకు
పాడిపంటలు చదువులు పద్దెమల్లు
నేరుపులు నూఱుమడుగులై మీఱునట్లు
మమ్మ ఆశీర్వదించి పోవమ్మ నీవు !

—:o:—

ఏకరీతిని స్థిరముగాఁ బాటు పడక సోమరిగా నుండు సూక్ష్మ బుద్ధి కంటె నిరంతరము నేకరీతిని బాటు పడుచు, అనలసుఁడుగా నుండు మంద బుద్ధియే లోకమునకును దనకును నెక్కువ మేలును జేయఁగలవాఁడగును. లోకమునకు మహోప కర్తలయి ప్రసిద్ధి కెక్కిన మహాపురుషులందఱును నిరంతరకర్మశూరు లయిన సామాన్య ధీశాలులుగాని కేవల ప్రతిభామాత్ర మాన్యులయిన వారు గారు. బుద్ధి సూక్ష్మత కుద్యోగ శీలత తోడుపడిన పక్షమున నత్యధిక ప్రయోజనకరము కావచ్చును.

— కందుకూరి వీరేశలింగము.

ప్రాచీనసాహిత్యము-కవిత్రయకవితాప్రాశస్త్యము

— శిష్టా రామకృష్ణశాస్త్రి

సంఖ్యలలో తృతీయ సంఖ్య బహు విశిష్టమైనది. ప్రపంచమంతయుఁ ది సంఖ్యాత్మకముగా నున్నట్లు దోఁచును. జగములోఁ బ్రతి విషయము గూడ మూఁడు భాగములుగా విభజింపఁ బడినదా యనిపించును. తెలుఁగునఁ గూడ ముఖ్యముగా మూఁడందుము. లోకత్రయము, మూర్తి త్రయము, గుణత్రయము, వేదత్రయము, కాలత్రయము, ప్రస్థానత్రయము, మతత్రయము, మునిత్రయము, గురుత్రయము, నాయికాత్రయము, భాగత్రయము (ఆది మధ్యాంతములు) మొదలైనవి. ఇట్లు త్రిసంఖ్యకుఁ గల ప్రాముఖ్యమును, ప్రాధాన్యమును బహు విచిత్రములైనవి. లౌకికముగ సాధారణ విషయములలోఁ గూడ నీ సంఖ్యకే ప్రాభవమున్నది. ముఖ్యముగా మూఁడు సారులే చెప్పుట. ఇట్టి చోనేదేనొక మహాకార్య నిర్వహణము గూడ నీత్రి సంఖ్యాత్మక వ్యక్తుల తోడనే సాగుచుండుట మఱియొక విశేషము. అట్టిదే యాంధ్ర భారత రచనము కవిత్రయముచే సిద్ధించుట. కన్నడమునఁ గూడ రత్నత్రయము గూడ నేతత్సదృశమే.

సాహిత్యము ప్రాచీనము, మధ్యమము, నర్వాచీనము, నవ్యమని విభజించుట యొక మామూలైనను, నిప్పుడు ప్రాచీనమని యెంచబడినది యొకప్పుడు నవ్యమైయుండక తప్పదు గదా. అట్లే యిప్పుడు నవ్యమైనది కొంతకాలము తర్వాత ప్రాచీనముగాక తప్పదు. ఇప్పుడు పెట్టిన యూరగాయ క్రొత్తది. ఇదే వచ్చే సంవత్సరానికి ప్రాత యూరగాయ యగును. అందుకనే కవిత నవనవోన్మేషముగా భాసించవలెనె నెప్పటి కప్పుడని బుద్ధిమంతులు చెప్పుదురు. మానవుఁడికి క్రొత్త యొక వింత, ప్రాఁతయొక రోఁత. కాని ప్రతిభావంతుల కావ్యసృష్టి జరామరణములు లేనిది. ఆ భాష జీవించి యుండునంత కాలము వారి రచనలు చిరంజీవులే. సంస్కృతమున కాళిదాసాదుల కృతులు, నాంగ్లమున షేక్సిపియరు మొదలైన వారి రచనలు, తెలుఁగున కవిత్రయమువారి కావ్యములునట్లే, తర్వాత వానిలో,

''త ఏవ పద విన్యాసా స్త ఏ వార్థ విభూతయః,
తథాపి నవ్యం భవతి కావ్యం గ్రథన కౌశలాత్" ॥

గ్రథన కౌశలమాత్ర విలక్షణమైన నవ్యత తాత్కాలికముగ మనోహరముగ నుండవచ్చును. అప్పటి కప్పుడా కర్షణీయముగ మాత్రము గనఁబడును. కాని సోడాబుడ్డి క్రొట్టిన వెంటనే యుండిన "గ్యాస్'' క్షణ కాలములో నస్తమించునట్లా నవ్యత స్వల్ప కాలములో నదృశ్యమగును. క్రొత్త యూరగాయ బహు రుచిగానుండును. కాని యది జబ్బుచేయును. ఆ జబ్బునకు పథ్యము ప్రాతయూరగాయియే. అది యారోగ్యము గలిగించును. కొందఱు నవ్యకవిత్వమున నావేశ శక్తి యెక్కువ గలదని వాదింతురు. కాని కవిత్వమున కదియొక్కటియే గుణముగాదు. అనేక గుణములు సమపాళ్ళలో నుండఁదగిన దానిలో నొక్క గుణమధికముగా నుండినచో నది శోభస్కరముగా నుండునా? ఏక గుణాధిక్యము వలనఁ గల్గు తాత్కాలికోల్లాసము కల్లు, సారాయి వంటివి త్రాగినప్పుడు గలుగు నుద్రేకము వంటిది. అది మనోహరముగా నుండినను హితముగా మాత్ర ముండదు. "హితం మనోహారిచ దుర్లభం వచః'' కదా. హితమైనది ప్రాచీన సాహిత్యము. అసలు హితముతోఁగూడినది 'హితేన సహితం సాహిత్య'మని యుత్పత్తి చెప్పుదురు. సాహిత్య శబ్దమునకు పూర్వకాలమున గ్రథన కౌశలమే నవ్యత్వ లక్షణమని భావింపఁబడినను, నవ్యదేశ భాషా సంపర్క ప్రభావమున, నవ్యవిజ్ఞాన పరిచయము వలన, నవ్యసాంఘికాచారాభ్యాసముల వలనఁ గల్గిన నూతన వాతావరణమున, నూతన దృక్పథముతో రచింపఁ

బడిన నూతనవస్తుయుత నవ్యసాహిత్యమున నపూర్వత లేకపోలేదు. కాని దానిని చక్కఁగా జీర్ణము చేసికొని మన ప్రకృతి తత్వముతోడను, భాషా సంప్రదాయముతోడను శ్రుతి కలుపుకొని సమన్వయించుకొని, తదుచిత భాషా శక్తితో వెలువరించక పోయినచో 'పప్పుకు పప్పును, పాయసమునకు పాయసమై'. యయ్యవారిని జేయఁబోయిన కోతియైనట్లుండును. అందుచే నట్టి నవ్యత యామోదింపఁ బడదు.

కాన ప్రాచీన సాహిత్యమున నిట్టి యొడుకు లొడుకు లుండవు. క్రీ. శ. పదకొండవ శతాబ్దమున నన్నయ రచించిన యాంధ్రభారత మా కాలమునకు నవ్యమైనదే. తత్పూర్వము లేని యాంధ్రకావ్య రచన నాంధ్ర భాషా సంస్కారముతో, సంస్కృత వృత్తములలో, చంపూ రూపమున సంస్కృత పురాణ కథను సాగింప వలసి నప్పుడు నన్నయ యెంతయేని సాహసమునకుఁబూనికొనిన వాఁడని యూహింప నగును. ఇందుల కతని ప్రతిభయే తనకుఁ దోడ్పడినది. నన్నయ కవితాసతి "స్వాధీనపతిక" వోలె సుప్రసన్నముగా సాగినది. ఆ యుగమందలి యితరాంధ్ర పురాణ కవులాతనిని గ్రథన కౌశలమాత్ర విశేషముతో ననుసరించిరి. తర్వాత నీ పద్ధతి ప్రాఁతపడి పోయినది. మరల నవ్యత ప్రవేశ పెట్టవలసిన యావశ్యకత వచ్చినది. అట్టిది గ్రుడ్డెద్దు చేనఁబడినట్లు పోవువారికి సాధ్యపడునది కాదు. కాన గొప్ప ప్రతిభాశాలి కొరకు దేశ మెదురు చూచినది. కాని యాంధ్ర సాహిత్యమున నవ్యత యప్పటికే పద్ధతిలోఁ గూర్ప వలెనను సంగతి యెవరు చెప్పఁగలరు? ప్రతిభా వంతునకే యది స్ఫురించును. భాషలోఁ బ్రవేశ పెట్టఁబడిన నవ్యత వలన నా భాషకు విప్లవము చేకూరరాదు. అట్టి విప్లవమున కకస్మాత్తుగా నే దేశముగాని, భాషగాని సహింపలేదు. సహింపలేనప్పుడు తిరుగుబాటు వచ్చి యా నూతనత్వ మామోదింప బడదు. అట్టి స్థితి పాల్కురికి సోమనాథుని వలన నాంధ్ర సాహిత్యమున కుప్పతిల్లినది. అతఁడు ప్రతిభా శాలియు, పండితుఁడు ననుటలో నేమాత్రము సందేహములేదు. కాని మతాచారములతో సంఘమున విప్లవము దెచ్చుటతోఁ బాటు, భాషా సాహిత్యములలోఁ గూడ నతఁడు విప్లవకారకుఁడైనాఁడు. అతనికి మత విషయమున సంఘములో జయము గల్గిన గలుగవచ్చు. కాని భాషా సాహిత్య విషయములలో నతనికి జయమొన గూడలేదు. తర్వాతఁ గొందరు మాత్ర మనుయాయులతని కుండవచ్చు. ఇది అతనికి జయమన వీలులేదు. భాషా ప్రామాణికు లెవ్వరు నీతని నామోదింపలేదు. ఏలన, నీతఁడు సాహిత్యమును సాహిత్య దృష్టిలో నుపయోగింపక, మతప్రచార దృష్టిలో సామాన్య జనముకై వినియోగించినాఁడు. అందుచే దృష్టి సాంకర్య మేర్పడి సాహిత్య ప్రాముఖ్యమును బడయఁ జాలక పోయినది. కాని నతనికి మత విషయమున వచ్చిన విశిష్టత్వము సాహిత్యమున రాలేక పోయినది. మరియు నన్నయ, తిక్కన, యెఱ్ఱనల కవితముందు దేశికవిత నిల్వలేకపోయినది. ఈ సందర్భమున నన్నెచోడుఁడు స్మరింపఁదగిన వాఁడు. ఇతఁడు ప్రతిభా శాలియే. ఆంధ్ర సారస్వతమున నవ్యతఁ గూర్చిన మహానుభావుఁడే. కాని యితని కదృష్టము లేక పోవుటచే మూలపడి పోవలసిన వాఁడై పోయినాఁడు.

మార్గ కవితా సంప్రదాయములను బోషించుచునందు నూతనత్వమును గూర్పఁగలిగిన ప్రతిభాశాలి శ్రీనాథుడు. ఈతఁడు శైవమతాభిమానియే కాని, కొందరు పండితమ్మన్యులైన విద్యా రత్నములు దలంచునట్లు వీరశైవుడెంత మాత్రముగాడు. గొప్ప పండితుఁడును కవియునే కాని యితడు మతమునకై తన కవితను త్యాగము సేయఁబూనిన వాఁడు గాడు.మరియు నితఁడు మహా భోగి. రజోగుణుఁడు. కవి సార్వభౌముఁడని పించుకొని కనకాభిషేకము చేయించుకొనిన యుద్దండుఁడు. డిండిమభట్టు కంచు ఢక్కను పగుల గొట్టించిన దిట్ట. ఈతఁడు తన కవితను కవిత్రయమువారి కవితాసతి వలె స్వాధీనపతికగా నేలక, ప్రియుని రాకకై సకలాలంకరణములను గైసేసికొని, వలపించుకొనుటకై పూనిన "వాసక సజ్జిక" గాఁ దీర్చి దిద్దినాడు. తన కవితాలింగి యాకర్షణీయముగ నుండఁదగిన కూర్పులన్నియు భావ చిత్రముతోఁ గావించినాఁడు. రచనా విధానమున ప్రౌఢముగా, బింకముగా, స్నిగ్ధముగ నుండునట్లు దీర్ఘ సంస్కృత సమాసములతో బిగించినాఁడు. కథా వస్తువును కేవలము పురాణముగాఁ జేయక, పురాణాంతర్భాగములను మాత్రమే స్వీకరించి పొంకముగాఁ దీర్చినాఁడు తన వాసక సజ్జికను. ఈ రీతినే పిల్లలమఱ్ఱి పిన్నన,జక్కనాదులు దమ గ్రథన కౌశలమును గనుపఱచిరి. సుమారొక శతాబ్దములో

బహుకవులీ మార్గమునే పట్టుటచే నది కూడ ప్రాతవడి పోయినది. ఇది కేవలము పురాణ పద్ధతియుఁగాదు. పరిణతికి జెందిన ప్రబంధ ధోరణియుఁగాదు. శ్రీనాథుఁడు సూపిన వర్ణనాత్మక పద్ధతిని వృద్ధి చేసి, పురాణ కథన రీతి తగ్గించి, యేకనాయకాశ్రితముగ కథను సాగించి, శృంగార రస ప్రాధాన్యమును వహింపఁజేసి, యెక్కువ యాకర్షణీయముగ నష్టాదశ వర్ణనలను, వివిధాలంకారములను జొప్పించి, తన్ను ప్రేమించు ప్రియుని వెదుకాడఁబోవు "నభిసారిక"గా నల్లసాని పెద్దన తన ప్రబంధ కన్యను వెలయించినాఁడు, ఈ యభిసారిక తిరుగు బాటలలోని ప్రియులందరు చూచి యీమెను మోహింపనివారు లేరు. ఇది పెద్దన ప్రతిభా నైపుణ్యముల ఫలము. ఈ యుగమున కవికుమారులందరు నీ యభిసారిక వెంటఁబడినవారే. ఈ యుగముననే శబ్దార్థ ఖండనములతో శ్లేషకవిత నాదరించి 'ఖండిత నాయిక'గాఁ దీర్చి కొందరు నూతన మార్గమును ద్రొక్కిరి. అనేకార్థముల కవకాశము గల్గి రసలోప మొందుటచే నా ఖండిత నాయిక దిగ్భ్రమ చెంది, యతిక్లేశపడి, తన ప్రియుని హృదయమును గమనింపలేక యుక్కిరి బిక్కిరి యైనది. తాత్కాలికముగ నక్కడక్కడ నర్థవైవిధ్యమునఁ గొందరు సంతసించిరికదా యని మాత్రము గొంత సంతృప్తి. అంతే. మరి కొందరింకొక విధమైన నవ్యతను దమ కావ్యకన్యకుఁ గూర్పఁదలఁచి "ప్రోషితపతిక"గా శుద్ధ దేశీయ పదములతో నచ్చ తెలుఁగు కబ్బములను వెలార్చిరి. అందుచే శ్లేష కావ్యములందు గల తాత్కాలిక చమత్కారము గూడ లేక, రసహీనమై, పిప్పిగా నుండి. వెల వెలఁబోవుచు ప్రోషిత భర్తృకవలె తయారైనది. ఈ నూతనత్వమును గూడ నిద్దరు ముగ్గురు మెచ్చుకొని యనుయాయులైరి. కాని యానందము గాని, హృదయ రంజకత్వము గాని యాప్రోషితపతిక మోమునఁ గాన రాక కళాహీనమైపోయినది. రస భావము నుండి యామె వియోగము నొందినది.

ప్రబంధాభిసారిక ప్రియుల నాకర్షింపఁగల్గినది కదా యని, యుత్తర ప్రబంధ కవిత యామార్గము నంధప్రాయముగా ననుసరించినదే కాని విప్రలబ్ధవలె నా స్థలమునఁ దన ప్రియునిఁ గానక యాశాభంగమొంది విలవిలలాడినది. ప్రతిభా శూన్యులై చేయునదిలేక యనేక కవినామకు లీవీథినిఁ బోయి యనామకులైరి. ఈ కాలము వారికెల్ల నీ బాధ తప్పక పోయినది. తర్వాత నాంగ్ల భాషా పరిచయ ప్రభావము వలన ప్రబంధ లక్షణములతోఁ గలహించి, నవ్య కవిత "కలహాంతరిక" కాక తప్పదయ్యె. కలహాంతరితయయ్యుఁదన వ్యక్తిత్వమును. విశిష్టతను గొంత వరకు నిలుపుకొనినది. ప్రాచీన సంప్రదాయముల నుల్లంఘించి, కలహించి, రచ్చ చేసినదా నవ్య కవిత. ఈ విప్లవకారిణిని వెంటాడి యామెకు హంగు కావించినవారు నధికులుండిరి. అందుచే నామె బలమధికమైనది. కాని వారిలో నామె వ్యామోహ ప్రభావములకు మోహితులై కాఁబోలు పలువురు విరహి (భావ) కవిత్వము నాశ్రయించుటచే నా కవితా కన్య "విరహోత్కంఠిత" గ రూపొందినది. ఆవిరహమున కంతము గాని, యర్థము గాని లేక పోయెను. చివర కామె గతి యయోమయముగా పరిణమించినది, దారి తెన్ను గనఁబడక పోవుటచేత. పాపము! తన స్థితికిఁదానే లజ్జపడినది. తన యష్టవిధ దశల నొక్కమారు పునః పరిశీలనఁ గావించి యామె సమీక్షింప నారంభించినది. అన్నింటిలో నొడుకుఁదొడుకులేని నిరాడంబరమైన తన స్వాధీనపతికత్వమును దానే మెచ్చుకొని తన తొందరపాటునకు పశ్చాత్తాపము నొంది, తన ప్రాచీన రూపమెట్లు చిత్రింపఁబడినదో యిట్లు విచారణ సేయ ప్రారంభించినది. కాన ప్రాచీనార్వాచీన సాహిత్య లక్షణాలని కాలమును బట్టి తాత్కాలికముగ గుర్తింపఁబడినను, నాయా యుగ సాహిత్య లక్షణాల తోడనే యవి విశిష్టతను గణియించుకొనును. కాన నవి పురాణ కవిత, కావ్య కవిత, ప్రబంధ కవిత, భావ కవిత, వచన కవిత యని వ్యవహరింపబడినవి.

కవిత్రయము వారి చేతులలో నాంధ్ర కవితా లతాంగి స్వాధీన పతికవోలె భాసించినదని నా భావము. స్వాధీన పతికలలోఁగూడ వారి వారి వ్యక్తిత్వమునుబట్టి కొంత భేదముండును కదా. అట్టి భేదమే ప్రత్యేకముగా నన్నయ, తిక్కన, యెఱ్ఱనలలో ద్యోతకమగును. నన్నయ చేతిలో వర్ధిల్లిన స్వాధీన పతిక ముగ్ధ, పరమ సాధ్వి, పారిశుద్ధ్యము, పవిత్రత యామె యాపాదమస్తకమందును గోచరించును. గోదావరీనది యగాధమైన లోతు గల్గినను పరమ గంభీరముగ ప్రవహించును. ఆ గోదావరీ జలపాన పరివర్ధిత నన్నయ సాకిన యాంధ్ర కవితా స్వాధీన పతిక. ఆమె యౌవన లావణ్యమును తపతీ సౌందర్య వర్ణన మిషచేనిట్లు చిత్రించి చూపినాఁడు నన్నపార్యుఁడాంధ్రకుమారులకొఱకు,

సీ. త్రిభువన లక్ష్మి యేతెంచి యేకాంత మి, ట్లేలకో
యున్నది యివ్వనమున,
గగనమణిప్రభ గగనంబు నందుండి. యవనీతల
ప్రాప్తయయ్యె నొకొ్క,
శంభుండు లావణ్య సద్గుణ సముదాయ. మింద
యిమ్మిగ సంగ్రహించె నొకొ్క,
పొలఁతి యంగంబులఁబొందిన భూషణ, శ్రీ యేమి
పుణ్యంబుఁ జేసెనొకొ్క,

గీ. అమరకన్య యొకొ్క యక్షకన్యక యొకొ్క. సిద్ధ
కన్య యొకొ్క శ్రీ సమృద్ధి
సర్వలక్షణ ప్రశస్తాంగి యిది దివ్య, కన్యయగు
ననంత కాంత పేర్మి॥

చ. నెఱిగురుల్, విలోలసిత నేత్రయుగంబును, నొప్పు
లొల్కు వా
తెఱయును, దీని యాననముఁ దెల్వికరంబు మనోహ
రంబు, నా
యెఱిఁగిన యంతనుండి సతి, నిట్టి లతా లలితాంగిఁ
జూచి యే
నెఱుఁగ, సురేంద్ర కన్యకలు నిట్టిరె రూపవిలాస
సంపదన్॥

వ. అని వితర్కించుకొనుచు మదన కర్కశ మార్గణ
లక్షీభూత చేతస్కుండై. తదీయ గుణమయపాశ
బద్ధుండునుంబోలెఁ గదలనేరక, తన్నివేశిత చేత
నుండు నుంబోలెఁ దన్నెఱుంగక, తద్రూపామృత
పానంబున ననిమిషత్వంబునం బొందిన తన నయ
నంబులు దానియంద నిలిపి యక్కన్యక కిట్లనియె॥

ఆ. ఎఱుగ జెప్పు మబల యెవ్వరిదాన వి, ట్లేల యున్న
దానవే కతంబ
క్రూర వనమృగములు గ్రుమ్మరుచున్న యీ, విజన
విషమశైల విపిన భూమి॥

క. అని పలుకుచున్న నృప నం, దనునకు మఱుమాట
యీక తామరసనిభా
ననమేఘ మధ్య సౌదామని వోలె నడంగె దృష్టి
మార్గము గడవన్ ॥ఆది II 73-77

ఈ చిన్న మనోహర రసవత్సన్నివేశమున నన్నయ యెట్ల ప్రయత్నపూర్వకముగా తపతీ సౌందర్యమును లోకాతీతముగ వర్ణించి. పాఠకులకుఁగూడ నామె పైనను రాగముదయించునట్లు చూపినాఁడో మననము చేసిననే కాని యర్థము కాదుకదా. ఆమె సౌందర్యమును రెండు పద్యములలో మాత్రమె చిత్రించి, యామెను పాఠకుల మనో నేత్రములకు సాక్షాత్కరింపజేసి, యామెను దర్శించిన ప్రభావమున సంవరణుఁడెట్టి మోహావేశ స్థితిని బొందినదియు సక్రమముగా వచనమున కవి విపరించినాడు. 'తద్రూపామృత పానంబున ననిమిషత్వంబునం బొందిన తన నయనంబులు దాని యంద నిలిపి' నాడఁట సంవరుణుఁడు. సీస పద్యమందలి యుత్ప్రేక్షలు నిసర్గమనోహరములై ప్రబంధోత్ప్రేక్షలవలె కృత్రిమములు గాక యున్నవి. ఇఁక వృత్తమందలి భావములు సరళములు, స్వభావసిద్ధములును. అల్ప శబ్దములతో ననల్పార్థమును గూర్చు కవితా శిల్పమిది. 'సర్వలక్షణ ప్రశస్తాంగి' గా నామెను కవి తీర్చిదిద్దినాడు. ఇందు శృంగారాద్భుత రసంబుల రెండింటిని జోడించి పోషించినాఁడు నన్నపార్యుఁడు. ఈ రచన సుబోధకమై డొంక తిరుగుడులతోఁ గూడిన క్లిష్టత యెక్కడను లేక సాఫిగ సాగినది. భావములలోఁ గాని, భాషలోఁ గాని, కూర్పులోఁ గాని యే విధమైన క్లేశమును పాఠకునికి గల్గింపకయే విగళిత వేద్యాంతరమైన యానందము నీయఁగల్గినది యీ కవిత. ఇందు వ్యామోహమును గల్గించి మోసము చేయు తళుకు బెళుకుమను నలంకారములు లేవు. భావమును భాషయుఁగూడ స్వచ్ఛములే. తపతియొక్క ముగ్ధమోహన కళ్యాణ మూర్తిని సాక్షాత్కరింపజేయుటలో మధురమైన భావములు మృదుశైలినే యతిశయించినవో, లేక, మృదు శైలి మధుర భావములనే యతిశయించినదో విమర్శకులు గూడ నిర్ణయించుట కష్టము. ఇందు నన్నపార్యుని నిర్మల హృదయమును, నవ్యాజ ప్రకృతియు ప్రతిబింబించుచున్నవి. ఇట్టి స్వచ్ఛము, నమాయికము, గంభీరమునైన స్వాధీన పతిక నన్నయగారి చేతిలో వర్ధిల్లినది.

ఇఁక తిక్కనగారి స్వాధీనపతికయైన కవితా సుందరి పెన్నానదీ మధుర జలములఁ గ్రోలి నెల్లూరి నెఱజాణగా రూపొందినది. ఈమె సాధ్విగాదు, ప్రౌఢ, మాటకారి, వయ్యారి భామ. గడుసు పోకలు పోవునది, కులుకు నడకలు నేర్చిన కోమలాంగి. అందుచే నామె యడుగు జాడలను గుర్తించుట సామాన్యులకు సాధ్యము గాదు. ఈమె

మాటలును, నడకలును నన్నయ గారి స్వాధీనపతి కవి వలె నమాయికముగను సాఫీగ నుండవు. వ్రేలి ముసుఁగులో నుండి ముసిముసి నగవులతోఁ దన శృంగారము నీమె వెలార్చు చుండును. ఈమె కుద్రేకము మెండు. ఏ రసావేశమైనను నాపుకొనలేదు. ఆ యుద్రేకము పొంగి పొరలినఁగాని యావేశముపశాంతి పొందదు. గాంభీర్యము చాల తక్కువ. అట్లని మితిమీరి మాత్రము పోదు. మంచిగాని, చెడుగాని, కష్టముగాని, సుఖముగాని యామె సంతృప్తికరముగ ననుభవించి యితరుల ననుభవింపఁజేయును. ఈ శిల్ప చాతుర్యమంతయు కీచక ఘట్టమున తిక్కన చిత్రించినాడు.

వ. కీచకాగ్రజుండు............ అనతి దూరమున నున్న ద్రుపద రాజ నందనం గనుంగొని,

ఉ. అక్కజమైన చెల్వమున నాత్మకు వ్రేగయి పొల్చు పొల్తిపై
నెక్కొను చూడ్కిఁ గ్రమ్మరుపనేరక యూరక నిల్చెఁ, గాముచేఁ
జిక్కిన నెమ్మనంబుఁగడుఁ జేడ్పడు మానముఁ జేష్టి తంబులం
దక్కిన యంగముం దలఁకు ధైర్యమునై యతఁ డప్పుడయ్యెడన్॥

తే. ద్రౌపదీ రూపమను నురిఁదగిలి తనదు, హృదయ మను మృగమత్తటి నుడిలగొనుచు
గాముఁడను బల్లిదపు వేఁటకాని బారిఁ, బడుట కెంతయు నా సింహఁబలుడు దలరి॥

వ. నిజాంతర్గతంబున,

ఉ॥ ఎందును నిట్టి రూపు నరులెవ్వరుఁగాంచిరె, నాక కాదు సం
క్రందన సూతికిం దగిలి కన్గొనఁజాలదె, దీని నిందిరా
నందను నాజ్ఞయేఁచి భువనంబుల బ్రబ్బదె, యిత్తలోదరిం
జెంద, గఁగాన్పుగాదె ఫల సిద్ధి పురాతన పుణ్య బుద్ధికిన్॥,

సీ॥ ఇయ్యింతి ప్రాపున నయ్యనంగుడు పార్వ, తీశు నైనను దక్కనేలకున్నె,
యిన్నాతి చెలువంబు గన్న శచీ ప్రియుం, డైనను గనుకవి నవయకున్నె,
యిత్తన్వి కెనలేమి కెదిరి పన్నిదము భాషా విభుతో నైనఁ జరపరాదె,
యిత్తలోదరి జీవితేశున కిందిరా, పతినైన మెచ్చక పలుకఁజనదె,

తే॥ కుసుమ బాణుని బాణముల్ గూడనైదు. గరగి నేరిమి వాటించి కరువు గట్టి
పోసివేసి చైతన్య సంపుటము దగ. ఘటించెనో కాక యిట్టి చేడియలు గలరె॥

* * *

చ॥ అని యని యుగ్గడించు, ధృతియల్లల నాడినఁదల్లడిల్లుఁబై
కొను తలపోత నించు, మది కోర్కులు నేర్చిన నప్పళించు, నె
ట్టన తెగ నగలించు, నచటన్ జనులం బరికించు, బుద్ధిమా
లిన వెసనెంతయుంగళవళించు మనోజ వికార మగ్నుఁడై॥

* * *

చ॥ పొలతుక కాంతి యింత పొలిపోవఁగ నీకెనలాఁ దారని
శ్చలతఁగడంగి క్రోలికొనఁ జాలుటఁ గీచక ముఖ్య లోచనం
బులు "నయనం ప్రధాన" మను పూర్వ వచస్థితిఁ దప్ప కుండఁగా
నెలమి వహించెఁ దక్కఁ గల యింద్రియ వర్గము ధిక్కరించుచున్॥,

* * *

సీ॥ తన్వంగి మవ్వంపుఁ దనులత నెసఁగెడు, నును కాంతి వెల్లు వమునుగఁ బాఉ
గిసలయ హస్త కెంగేలనే పారు శ్రీ, న్మించను లే యెండ మిగులఁ బర్వఁ
గమలాస్య ముద్దు మొగంబులే మెరుఁగుల మొత్తంబు పరి చుట్టు ముట్టి కొనంగ,
ధవళాక్షి తొంగలి తఱచు రెప్పల చెన్ను, కప్పను చీకఁటి గలియుఁదేర,

తే॥ బెగ్గలం బంతకంతకు నగ్గలింప. నొదవు చెమటతోఁ జిత్తంబు సెదరి యెందు

మెలఁగఁ దలపేదియా సింహ బలుఁడ నంగు, పట్టి
యాడెడు జంత్రంబు వగిది నుండె.

ఈ చివరి సీస పద్యములో ద్రౌపదీ సౌందర్య విశేషమును ప్రేలి ముసుగులో నుండి దాగుడు మూఁత లాడించినాఁడు తిక్కనకవి. నన్నపార్యుని వలె సూటిగా, సాఫీగా తిక్కన వర్ణింపఁడు. స్త్రీ సౌందర్య వర్ణనఁజేసినప్పుడెల్ల విశేషముగ నతడిట్లే చేయును. ఇది యాతని విశిష్టత. దీనితోఁ బాటు పాత్ర యనుభవించు మానసిక వ్యాపారము ప్రవృత్తి, వివిధ భావములను విపులముగా వివరించి, యాపాత్రయొక్క చైతన్య స్థితిని విశేషముగా ప్రతిపాదించి చూపును తిక్కనకవి. ఇది భావములతో జేయు ఒకవిధమగు దొమ్మరి విద్య వంటిది. ప్రబంధకవులు శబ్దములపై దొమ్మరి విద్యను జూపిరి. భావములతోఁ జేయు దొమ్మరి విద్య తిక్కన కవితలోని విశేషము. నన్నయవలె క్లుప్తముగ, గంభీరముగ, ముక్తసరిగ పాత్రల నీతఁడు ప్రవర్తింపనీయఁడు. ఇందుచే పాఠకులు గూడ నా పాత్రలతోఁబాటు సన్నివేశములో తన్మయావస్థ నొందుదురు. ఇది దాని ప్రయోజనము. సమాన సన్నివేశములలో సామాన్యముగా కవులందఱకు, సంస్కారములో విశేష భేదమున్నప్పుడు దప్ప నొకవిధమైన భావములే జనించుచుండును. ఈ విషయము దేశ కాలములను బట్టి గూడ సామాన్యముగా భేదింపదు. ఇది మానవులలోఁగల విశ్వజనీనత్వము. అందుచేతనే కొన్ని శతాబ్దములకుఁ బూర్వము కాళిదాసు రచించిన శాకుంతలములోని భావముల నిప్పుడు మనము చదువుకొని మురిసిపోవుటయే కాక, పాశ్చాత్య దేశములలోఁ గగేటీ మొదలైన పండితులు గూడ పరమానందమును బొంది కాళిదాసు నభినందింపఁగల్గినారు. సాహిత్యము మానవులకు మాత్రమే యుద్దేశింపఁబడినదగుటచే. మానవేతరములగు పక్షి మృగాదులఁ గూడ, సదృశావస్థలో వర్ణించినపుడు మానవ భావములే వానికిఁగూడ నారోపింపఁబడును. ఇట్టి విశ్వజనీన భావములను కవి ప్రతిపాదించుటచేతనే యాతని కావ్యమా భాష యున్నంత కాలము చిరస్థాయిగా నుండగల్గుచున్నది. పైన నన్నయ తిక్కనలు, చిత్రించిన తపతీ సంవరణ, ద్రౌపదీ కీచక సన్నివేశ ద్వయములో తుల్యావస్థలుండుటయే కాక, యా నాయకులు తాము వలచిన వారినిఁ జూడగనే సదృశమైన భావములనే వ్యక్తీకరించినట్లు స్పష్టమగుచున్నది. నన్నయ చేతిలో తపతినిఁజూచిన సంవరుణుఁడు.

''నా, యెఱిఁగిన యంత నుండి సతి నిట్టిలతాలలితాంగిఁ జూచియే
నెఱుఁగ సురేంద్ర కన్యకలు నిట్టిరె రూప విలాస సంపదన్''.

అని తన మెప్పునొక యోగ్యతా పత్రముగాఁ దెలిపినాడు. ఇట్టి భావమునే ద్రౌపదినిఁ జూచినపుడు కీచకుఁడు గూడ వ్యక్తీకరించినట్లు తిక్కన యిట్లు రచించె,

ఎందును నిట్టి రూపు నరులెవ్వరు గాంచిరె, నాక కామ సం
క్రందన సూతికిందగిలి కన్గొనఁజాలిరె''.

మఱియు నన్నయ చిత్రించిన సంవరుణుఁడు తపతినిఁ గూర్చి '' తద్రూపామృత పానంబున ననిమిషత్వంబునం బొందిన దన నయనంబులు దాని యంద నిలిపి'' యని వర్ణించినాఁడు. ఇఁక తిక్కన కవియో, కీచకుడు ద్రౌపదీ శరీర కాంతి ప్రభావమున,

చ॥ పొలతుఁక కాంతి యింత పొలి పోవఁగ నీకెసలారఁ దారని
శ్చలతఁగడంగి క్రోలికొనఁ జాలుటఁ గీచక ముఖ్య లోచనం
బులు ''నయనం ప్రధాన'' మను పూర్వ వచస్థితిఁ దప్పకుండగా''.

అని యిద్దరును దమ ప్రియురాండ్ర సౌందర్యమును నేత్రములతో పానమును జేసినవారే. ఈ ప్రేమ తత్త్వమీ యిద్దరి నాయకులకు మాత్రమే కాదు. లోకమున సందరకు సమానమేకద. ఇట్టి విశ్వజనీనతత్త్వమును నన్నయ, తిక్కన లిరువురును వివిధ నాయకులకు ప్రతిపాదించిరి. కాని వీరిద్దరు వ్యక్తీకరించిన విధము గాని, యుపయోగించిన శబ్ద జాలము గాని కొంచెము భిన్నమైనది. ఇందుచేతనే ''తథాపినవ్యంభవతి గ్రథన కౌశలాత్'' అని పైనఁ జెప్పవలసి వచ్చినది. నన్నయ, తిక్కనల శబ్దజాలము భిన్నమైనను, రెండును గూడమృదు మధురమైనవియే. వారి గ్రథన కౌశలము వేరుగా నున్నను హృదయరంజకముగ, నాకర్షణీయముగనే యున్నది. ఒకని పద్ధతి రెండవవాని వైఖరి కంటె నవ్యముగనే కనుపించును.

ఇఁక నెఱ్ఱాప్రెగడ స్వాధీనపతిక యెట్లు తీర్చి దిద్దఁబడినదో చూతము: ఈమె తిక్కనగారి స్వాధీన పతికవలె నంత గడిసరియుగాదు. నన్నయగారి స్వాధీనపతికవలె

నంత పరమ సాధ్వియుఁగాదు. వారిద్దరికి మధ్యగా నుండు నీమె. నన్నయ, తిక్కనల కవితా పద్ధతులను చక్కఁగ జీర్ణము చేసికొనిన బుద్ధిశాలి యెఱ్ఱాప్రెగ్గడ. వారియంత ప్రతిభాశాలి కాకపోయినను వారి యడుగు జాడల ననుసరింపఁగల నేర్పరియే కాని తక్కువ వాడు గాడు. సైంధవుఁడు ద్రౌపదిని మోహించి బలవంతముగా నపహరించిన ఘట్టము నతఁడెట్లు చిత్రించెనో చూతము.

ఉ॥ వీరుఁడు సైంధవుండు, సయవిశ్రుత శౌర్యుఁడు, సాళ్వ కన్య నిం
పారఁగ పెండ్లియాడుటకునై నిజవైభవముల్ల సిల్ల వి
స్ఫార చతుర్విధోరు బల సంగతుఁడై చనుచుండి యాశ్రమ
ద్వారమునందుఁగాంచె ద్రుపదక్షితిపాల తనూజ నచ్చటన్॥.

ఉ॥ నీలపయోదమండలి వినిశ్చల లీల వెలుంగఁజేయుచుం
గ్రాలెడునట్టి క్రొమ్మెఱుఁగుకైవడిఁ దద్వన భూమి నెంతయున్
లాలిత దేహకాంతి పటలంబునఁజేసి వెలుంగఁజేయు న
వ్వాలవినీలకుంతలవిభాసినిఁజూచియువిస్మయాత్ముఁడై॥

తే॥ మగుడఁదగిలిన చూడ్కుల మగుడఁదిగువ, నేర్పు సాలక యప్పుడు కందర్ప దర్ప
గోచరాత్ముఁడై నిజసఖుఁగోటి కాస్యుఁ, డను నృపాత్మజుఁ జూచి యిట్లని యెఁబ్రీతి.

ఉ॥ ఇన్నలినాక్షి యెవ్వతెయొ, యివ్విపినంబున నేకతంబ యి
ట్లున్న నిమిత్తమేమియొ. సురోత్తమ కన్యయొ, యక్ష కాంతయో,
పన్నగ భామయో, మనుజభామిని గామి నిజంబు. యిట్టి చె
ల్వున్నది యే మహీతలము నుగ్మలు లెవ్వరి కెందు నారయన్॥

ఉ॥ లీలయొనర్పఁగా నబల లేఁజిగురాకును బోలె నొప్పు కెం
గేలు కదంబ శాఖ తుద। గీల్కొనజేసి వసంత విభ్రమో
న్మీలిత బాలపల్లి క్రియ మేలగు చూడ్కుల నించి పావక
జ్వాలయ పోలెఁ జిత్తము నిజంబెరియింప దొడంగెఁ గంటివే॥

ఉ॥ ఈ కమలాక్షి నాకు హృదయేశ్వరియైనఁ ద్రిలోకరాజ్యముం
జేకుఱనేలినట్లు వికసిల్లదె దర్పక వీరు బంటుగా
గైకొననే వయస్య, వెసఁగాంత నొడంబడఁ బల్కి దీనికిన్
నాకును బొంధొనర్చి కరుణం జరితార్థునిఁజేయవేననున్॥

సైంధవుండు ద్రౌపదీ సౌందర్యమును జూచి, యామె దేవలోక స్త్రీయొ, పన్నగాంగనయో, యేమొకాని భూలోక వనిత గాదని యెంచినాఁడు. ఇది సామాన్యముగా ప్రతి కాముకుఁడును భావించునట్లె వర్ణింపబడినది. ఇట్టిరీతిపై నుదాహరించిన నన్నయ, తిక్కనల రచనలలోఁగూడఁ గలదుకదా. వెనుక నెప్పుడును జూడని నూతన వనితను గూర్చి కాముకుడిట్లూహించుట సమంజసమే యగును. కాని సైంధవుఁడు ద్రౌపది నిదివరకెన్నడును జూచియుండ లేదా యని ప్రశ్న. దుర్యోధనుని బావమరది కదా యితఁడు. కనుక నితఁడామెను వెనుకఁ జూచియే యుండునని మన మూహింప వచ్చును. మఱియు "ఇన్నలినాక్షి యెవ్వతెయొ యివ్విపినంబున నేకతంబ యిట్లున్న నిమిత్తమేమియొ" యని భావించిన వాఁడు పాండవులరణ్యావాసము చేయుచుండిరనియైన నాలోచన యాతనికిఁ బుట్టలేదా. కాముకులకు బుద్ధి పని చేయదా, యని తోచును. కాముకులకు బుద్ధి పని చేయక పోయినను, కవికౌచిత్యము పాటింపవలయునని యైన బాధ్యతయుండునుకదా. మూలమున నున్నట్లే యెఱ్ఱన యాంధ్రీకరించెనననిచో, యనుచితములను పరిహరింప వలసిన యావశ్యకత యుత్తమ కవికుండ వలదా. ఇట్టి నెరసు లేవో తప్ప యాతని కవిత నన్నయ, తిక్కనల కవితల తర్వాత నభినందింపదగినదే కాని తక్కువది కాదు. తిక్కన కవితయందు గోచరించు మానసిక ప్రవృత్తి వివరణ యెఱ్ఱనార్యుని రచనలోఁ గానరాదు. అట్టి పరిస్థితులను నన్నయవలె నితఁడు బహు క్లుప్తముగా కథాకథన రీతిని రచించినాఁడు. మఱియు కీచక ఘట్టమున తిక్కన కవి ద్రౌపదీ శరీరకాంతి లావణ్యాదులను గాని, యామె విలాసమునుగాని చిత్రించినట్లుగ యెఱ్ఱన వర్ణింప లేదు. సౌధమున సుధేష్ణాదుల సమక్షముననే కీచకునిచే ద్రౌపదీ సౌందర్యము

నననృ సామాన్యముగ వర్ణింపఁజేసినాఁడు తిక్కన. వనమున నొంటరిగా నొక కదంబ వృక్షము దగ్గర నున్న ద్రౌపది నెక్కుడు శిల్ప దృష్టితో. శకుంతలను దుష్యంతునిచే కాళిదాసు వర్ణింపఁజేసినట్లుగ, సైంధవునిచే వర్ణింపజేయుట కెఱ్ఱనాద్యున కవకాశమున్నది. కాని యితఁడట్లు చేయలేక పోయినాడు. "లీల యొనర్పగా నబల లేఁజిగురాకును బోలె"నని ముక్తసరిగా మాత్రము వర్ణించి మానివేసినాఁడు. పాత్రలకు ప్రాణముపోసి, నూత్న చైతన్యమీయ గల్గిన సృజన శక్తి తిక్కనకు వలె నెఱ్ఱనకు లేదు. కాని రచనా విధానమును. కవితా భావములను. రసోత్పాదన శక్తియు నెఱ్ఱనార్యుని కవితయందు చక్కఁగఁ జూపబడినవి. రచన సాఫీగా నొడుదుడుకులేక చక్కని ధారాశుద్ధితో నొప్పి, కావ్య పద్ధతికి సన్నిహితముగా తయారైనది. ఇది యెఱ్ఱన తీర్చిన స్వాధీనపతిక తీరు. ఈమె మధ్య మొత్తముమీఁద నీ కవిత్రయము వారి కవితలో స్వాధీన పతిక యందు గోచరించు సొగసము. సరళమునైన రూపురేఖలు నుదాత్త గంభీర భావములును. నిరాడంబరమైన నడకయుఁ సముచితాలంకారములును జూడనగును.

స్వాధీనపతిక నిత్య సంతృప్తియు. నిత్యసంతోషియునై ప్రసన్న వదనారవిందముతో పతికానందమును గల్గించును. అట్లే కవిత్రయము వారి కవిత నిసర్గ మనోహరమై, ప్రసాద మాధుర్యాది గుణములతో పాఠకుల కానందము గల్గించును. కాని తన పాండిత్య ప్రభావమును, కల్పనాశక్తియు ప్రదర్శించి కాముకుల నాకర్షించుటకై వివిధాలంకారములఁ గైసేసి, సహజ సౌందర్యము తక్కువైనను సంస్కార వైభవము మిన్నగా తీర్చికొను వాసక సజ్జికగా మాత్రము కవిత్రయము వారి కవితయుండదు. లేక సహజ కాంతి విరహిత యైనను ప్రత్యవయవమును దిగ్భ్రమ గల్గించు తళుకు బెళుకను కృత్రిమాలంకారాలంకృతయై, ప్రియాన్వేషణార్థము రాత్రివేళల తారుమారు లాడుచు. ప్రియుల నాకర్షింపఁజూచు నభిసారికవలె, వివిధ శబ్దార్థాలంకారములతో నింపి పాఠకులకు భ్రాంతి గల్గించి, మోహింపఁజేయునట్లొయ్యారపు కులుకు నడకల తీరుతో కవిత్రయము వారెన్నడును దమ కవితను గూర్పలేదు. ఇది వారి కవితా రహస్యము కవిత్రయమువారి స్వాధీన పతికను గూర్చి యెవ్వరెట్టి యపోహలు గాని, భ్రాంతినిగాని పొందరు. ఏలన నామె పాఠకుల కట్టి భావములను గల్గించుట కవకాశ మీయదు. ఇవి యామె ప్రకృతిలోనే లేదు. అందుచే నామెకాభయమును లేదు. ఆమె నడక యటువంటిది. ఆమె పెంపకము. శిక్షణయట్టిది. లోకమున కామె తలయొగ్గి సంచరించును. ఒద్దికతో ప్రవర్తించును. తనకేమియని విఱ్ఱవీగదు. పరమసాధ్వి, ఇల్లాలు, కుటుంబిని. ఇందుచేతనే తరువాత తరము నుండి యనేక విధములైన తనయలను తన యందుండి యుద్భవింప జేసినది, కాని వారు తల్లి నుండి క్రమముగా కాలానుసరణమున భేదించి యితర విధములైన సప్తవిధ నాయికలుగా రూపొందిరి. అందుచే స్వాధీనపతిక వృద్ధమాతామహిగా పరిగణింపబడి గౌరవింపబడినది. వాసక సజ్జిక నమస్కృతొనర్చినది యామెకు. అభిసారిక జోహారులర్పించినది. ఖండిత తలయొగ్గినది. ప్రోషిత భర్తృక గూడ నామె పెద్దరికము నామోదించినది. విప్రలబ్ధ వందనము చేసినది. కాని యిది యంతయుఁ జూచి కలహాంతరితకుఁ గోపము వచ్చినది. విరహోత్కంఠ కసూయ పెరిగినది. కలహాంతరిత యామెను దిరస్కరించి యాముఖమును గత్తిరించివేసి, యమంగళముగా సమాప్త మొనర్చినది. విరహోత్కంఠ మత్సరగ్రస్తురాలై ఫిడేలు పెట్టి పటాపటా మనునట్లు స్వాధీనపతిక నడుమును విరుగఁగొట్టినది. అందుచే నామె యిపుడు కుంటుచు నడుచుచు, గొనయూపిరితో నున్నది.

ప్రాచీన కవితా స్వాధీనపతికపై నవ్యకవితా కలహాంతరితకును, భావ కవితా విరహోత్కంఠకు నింత కోపద్వేషము లెందుకుఁ గల్గినవని విచారింపవలసి యున్నది. కవిత్రయము వారి ప్రాచీన కవితలో సమాన సన్నివేశములందు ప్రియులు దమ ప్రియురాండ్రను గూర్చిన భావములు తుల్యముగా నుండుటను పై నుదాహరించిన ఘట్టముల నుండి స్పష్టమైనది. వారందరి భావములు మన భావములతోఁ గూడ నేకీభవించుట చేతనే మనము వారి కవితా భావముల నభినందింపఁ గల్గుచున్నాము. మనము గూడ నొకవేళ నట్టి సన్నివేశములలో నున్నచో నట్టి భావములనే పొందుదుమన్న మాట. ఇందుచే కవితా భావములు విశ్వజనీనములనుట నిర్వివాదాంశము. ఇట్టి విశ్వజనీన భావములను ప్రాచీన కవులగు కవిత్రయమువారు ప్రతిపాదించి సరళముగా కావ్య రచనము సేయఁగ, శ్రీ నాథాదులు దమ భావముల నుత్ప్రేక్షాతిశయోక్త్యాదులతో డొంక తిరుగుడుగను, దీర్ఘ

సంస్కృత సమాస జటిలముగ రచనను గావించి, వాసకసజ్జికగాఁదీర్చుటలోఁ గొంత కృతకరూపము వచ్చి, ప్రాచీన కవితలో నున్న విశ్వజనీనతకుఁ గొంత కళంకము చేకూరినది. ఇది కొంతవరకు సైపఁబడినను ప్రబంధ యుగములో పెద్దనాదుల చేతులలోఁ దయారైన యభిసారికలు చాల మనోరంజకముగా నుండి, జనామోదమును బడసినను, కవిత్రయము వారి ప్రాచీన రచనలలోఁగల విశ్వజనీనభావములు పూర్తిగ కృత్రిమ రూపములు దాల్చి, సాంకేతికము, సాంప్రదాయకములునై విశ్వజనీనతకు దూరముగా నిలచినవి. ఉత్తర ప్రబంధ కవితా విప్రలబ్ధకు విశ్వజనీనతా దృష్టియే పోయినది. ఇఁక శ్లేష శుద్ధ దేశీయ కావ్యములు విశ్వజనీనతకు యోగ్యములే కాకపోయినవి. ఇందుచే క్రమక్రమముగా కవితాస్రవంతిలో విశ్వజనీనత క్షీణించిపోయినది. చివరకు రూపొందిన భావకవితా విరహోత్కంఠ యాంగ్ల భాషా పరిసరములలోఁ బుట్టి పెరుగుటచే నాంధ్ర భాషా సంప్రదాయములు గాని, ప్రాచీన భారత కవితా సంప్రదాయములు గాని తెలియక పోవుటచేతను, నవీన, పాశ్చాత్య భావములను తెలుగు బాషలో చక్కఁగ వ్యక్తీకరించుటకుఁ దగిన భాషా పాండిత్యములు లేక పోవుటచేతను, భాషా రచనలోనే లోపము వాటిల్లి యగమ్య గోచరముగా తయారైనది. దీనికిఁదోడు మరియొక యుపద్రవము వచ్చినది. ప్రాచీన కవులు గ్రహించిన కవితా వస్తువులో సుప్రసిద్ధమైన యొక కథయు, పాత్రలు, పాత్ర పోషణము నుండు. అందుచే వారి చరిత్రలలో దాటు, రహస్యము నుండవు. కాని భావకవితా విరహోత్కంఠలో కథావస్తువు స్వీయమును, పాత్రలు వివాహితలో, నవివాహితలో, లేక విధవలో యగు నన్యలగుటచే వారి ప్రణయ వృత్తాంతములును, శృంగారమును, వారి నామములు మొదలైనవి రహస్యముగా నుండకతప్పవయ్యెను. వారిసాంకేతిక స్థలములతోఁ బాటు వారి భాషకూడ సాంకేతికముగావలసి వచ్చినది. ఇన్ని కారణములచే భావ కవితా విరహోత్కంఠలో విశ్వజనీనత యను భావమే పూర్తిగ నశించిపోవలసిన యవసరము పట్టినది. దీనికి గత్యంతరము లేకపోయినది. అందుచే నా భావ కవితా విరహోత్కంఠలోని భావము లితరుల కెంత మాత్ర మర్థము కాక పోవుటలో నాశ్చర్యములేదు. అది సకారణముగను సక్రమముగనే యున్నది.

కాని స్వాధీనపతిక సంప్రదాయాను యాయులనఁబడు విప్రలబ్ధలీ భావ కవితా విరహోత్కంఠనునభావ కవితయనియు, బావకవితయనియు ననేక విధముల పరిహాసము చేసి దూషింపసాగిరి. అందులకు విరహోత్కంఠకు పౌరుషమువచ్చి తన కవితనర్థము చేసికొనుటకు వారికి సంస్కారము చాలదనియు,ఁ గొంత కాలము పోయినఁ గాని యర్థముగా సాధ్యముగాదనియు, ''ఏగతి రచించిరేని సమకాలము వారలు మెచ్చరేకదా'' యని సమాధానమిచ్చినది, ఈ ప్రలాపమును గమనించి మరికొందరు స్వాధీనపతి కాను సారులు విరహోత్కంఠను భావకవితలోని భావములను దమకు వివరించి తెలుపుమని వెంటాడ నారంభించిరి. తనకేమి చెప్పవలయునో తనకే తోఁచలేదు. కవితారచన చేసినపుడే తనకేమియుఁదోఁచక యేదో కూర్చుట జరిగినది. కనుక స్వాధీనపతికా సంప్రదాయములనే విచ్ఛిన్నము చేసి, యామెను రూపుమాపఁదలఁచి, విరహోత్కంఠ 'శేషం కోపేన పూరయేత్' అనునట్లు వెనుక చెప్పినట్లుగా ఫిడేలు పెట్టి పటాలు, పటాలుమని కొట్టి యామెను కురూపినిఁ జేసినది. కాని యామె ముఖమునఁదాండవించు జీవకళ పోలేదు. పోఁజాలదు. విప్రలబ్ధాదు లామెకుఁగల్గిన యవమానాపకారములకు ఖిన్నులై జాలిచెందిరి. కాని యేమియు చేయఁజాలక కాలప్రభావమునకు వారు తలయొగ్గిరి. వసంత కాలము తిరిగి రాకపోదని యెంచి స్వాధీనపతిక ధైర్యోత్సాహములను గోల్పోలేదు.

ప్రాయికముగఁ గవి ప్రపంచమున కీట్సులనేకులుందురు, పోతనామాత్యు లెచ్చటనో గాని కానరారు.

— శ్రీ భోగరాజు నారాయణమూర్తి (ఆంధ్ర కవిత్వ చరిత్రము)

జీవనగీతి

— చిల్లర భావనారాయణరావు

అవునా ! ఆశా వేణువు
భువనమ్ములు పుల్కరింప మ్రోళ్ల చిగుర్చన్
జెవిబడె ! మాధవుడేనా
నవజీవనగీతి బాడి నను లోగొనియెన్-

మనసోకరాధయై, పతిసమాగమ కౌతుకపారవశ్యమొం
దినయభిసారికై, బ్రతుకునిండిన చీకటి జీల్చివచ్చు పా
వన మురళీ రవోదిత విభా పథగామినియైన గోపికాం
గనయయి, ఆశలన్ వెదుకగా వెదజల్లుప్రసూనదృక్కులన్

కూటికిగుడ్డకై సలుపు ఘోరనికృష్ట నితాంత యాతనా
ర్భాటమెనేటి జీవితపు లక్ష్యముగా హృదిబండబారిపోన్
ఏఁటికిఒక్కమారుకు సుమించినచైత్ర వసంతశోభలన్
వాటిలుజీవనార్ద్రరసవత్స్ఫురితమ్ములగుండె జల్లనున్

ఎన్ని శిశిరాలు వచ్చినా ఇగురు లెత్తి
పల్లవించును లోకమ్ము బాధలందె !
పూల బ్రతుకులు పుట్టు రాబోవుగ్రీష్మ
వర్ష హేమంత శిశిరాల బంతమాడ-

కుసుమ ప్రాయము లేశమైన, మదిలోగుప్పిల్లుతత్సౌరభ
ప్రసరోద్దీపిత మీ వసంతసుష మాప్రత్యూష మేగావలెన్
విసమైపోయిన జీవితమ్ముల భయా విష్టమ్ములై స్రుక్కునీ
రసమే ప్రాణములాది సంతతము ధైర్య స్థైర్యముల్ పెంచగాన్

———:*:———

ఆంధ్ర ప్రదేశ్

రక్తదానం

— శ్రీ ఎస్. వి. నరసింహారావు

(నెల్లూరు జిల్లా గూడూరు వాస్తవ్యులు శ్రీ ఎస్.వి. నరసింహారావు న్యాయవాది, సాంఘిక సేవకులు. వయస్సు 55 సంవత్సరాలు. ఈయన 3 నెలల కొకసారి రక్తదానం చేస్తున్నారు 28–1–60న హైదరాబాదులోని ఉస్మానియా జనరల్ ఆస్పత్రిలో 34 వ సారి తమ రక్తాన్ని దానమిచ్చారు. ఆయన యీ వ్యాసంలో తన అనుభవాలు విశదీకస్తూ, యితరులు కూడా రక్తదానం చేయవలెనని కోరుతున్నారు.)

రక్తం తీసేటప్పుడు నాకేమీ నొప్పి పెట్టదు. ఊరికే అలా సూది గుచ్చుకున్నట్టు ఉంటుంది అంతే. ఎంత బలహీనంగా ఉన్నవారయినా దీనిని ఓర్చుకోవచ్చు. వంట్లో నుంచి రక్తం తీసేటప్పుడు నొప్పి పెడుతుందనే అభిప్రాయం ప్రజలలో ఉంది. కాని అది పొరపాటు.

రక్తపు పరిమాణం

పుట్టినప్పటి నుంచీ నా వంట్లో రక్తపు పరిమాణం (ప్రెషర్) తక్కువే 96/70. అయినా నేను రక్తాన్ని దానమిస్తూ నేడున్నాను. కాబట్టి నా వంటి యితరులు కూడా నావలెనే రక్తదానం చేస్తూ ఉండవచ్చు. అందువల్ల ఆరోగ్యానికేమీ భంగం కలుగదు.

వయస్సు

నా 37వ యేట రక్తదానానికి ఉపక్రమించాను. 55 సంవత్సరాలు వచ్చినా యింకా యిప్పటికీ యిస్తూనే ఉన్నాను. మధ్య వయస్సులో ఉన్నవారు, 50 సంవత్సరాలు దాటిన వారు కూడా నావలెనే రక్తదానం చేయవచ్చునని నా స్వానుభవం తెలుపుతున్నది.

ఆహారం

నేను మామూలు ఆహారాన్నే తీసుకుంటాను. టానిక్కులు, మందులు అంటే నాకు నమ్మకం లేదు. రక్తదానం చేసేవారు ఖరీదయిన ఆహారం తీసుకోవాలనే పొరపాటు అభిప్రాయం ఒకటి ఉంది. నేను భారతీయ మల్లులు తీసుకొనే ఆహారాన్నేమీ తీసుకోను. మామూలు ఆహారమే తీసుకొంటాను. ఎవరేనా సరే రక్తదానం యివ్వడానికి ప్రత్యేకాహారం తీసుకోవలసిన అవసరం లేదు.

ఎన్నిసార్లు

ఒక మనిషి ఎన్నిసార్లు తన రక్తాన్ని యివ్వవచ్చు? ఈ విషయం ఆయా వ్యక్తుల వయస్సు, ఆరోగ్యం మున్నగు అంశాలపై ఆధారపడి ఉంటుంది. నేను 3 నెలల కొకసారి నా రక్తాన్ని యిస్తున్నాను. 1944, 1945, 1956 సంవత్సరాలలో నా మిత్రుల రక్షణకై సంవత్సరానికి 5 సార్లు రక్తం తీసి యిచ్చాను. 1956 లో నా వయస్సు 50 సంవత్సరాలు దాటింది. అయినా అప్పుడు 5 సార్లు రక్తం తీసి యిచ్చాను. కాబట్టి పిన్న వయస్కులు 3 నెలల కొకసారి అవలీలగా యివ్వవచ్చు. ఒక వ్యక్తి ఎన్నిసార్లు రక్తదానం చేయవచ్చో, ప్రాణ దాతలు, ప్రాణరక్షకులు అయిన మన డాక్టర్లు నిర్ణయిస్తారు.

అర్హులు

రక్తదానం చేయడానికి ఎవరు అర్హులో ఎవరు కాదో నిర్ణయించే విషయం కూడా డాక్టర్లకు వదిలివేయవచ్చు.

వర్గం

నా రక్తం "బి" వర్గానికి చెందినది. కాబట్టి "బి" వర్గం రక్తం కలవారికి అది ఉపకరిస్తుంది.

ఉపయోగాలు

కొత్త రక్తం పెక్కు సందర్భాలలో ఎంతో ఉపయోగకరం. వివరాలు ఇవి:-

1. మనకు సోదరీ తుల్యులయిన స్త్రీలు పెక్కు మందికి ప్రసవసమయంలో రక్త నష్టం జరుగుతుంది. కొత్త రక్తం వల్ల వారు రక్త లేమికి సంబంధించిన వ్యాధులకు గురి కాకుండా కాపాడవచ్చు.

2. రక్తహీనం, క్షయ మున్నగు వ్యాధులలో అది ఉపకరిస్తుంది.

3. ప్రమాదాలకు గురయిన వారు విశేషంగా రక్తాన్ని కోల్పోయినప్పుడు కొత్త రక్తం యెక్కించి వారి ప్రాణాలను రక్షించవచ్చు.

4. పెద్ద ఆపరేషను జరుగవలసిన వారికి ఒక్కొక్కప్పుడు ఒంట్లో తగినంత రక్తం ఉండదు. అట్టి వారు దానికి తట్టుకోలేరు. అటువంటప్పుడు వారికి కొత్త రక్తం యెక్కించిన పిమ్మట శస్త్ర చికిత్స చేయబడుతుంది.

5. ద్వితీయ ప్రపంచ యుద్ధం సమయంలో గాయపడిన లక్షలాది జనం కొత్త రక్తం యెక్కించడం ద్వారా మృత్యు ముఖం నుంచి రక్షించబడ్డారు.

నేను యీ విషయంలో ఆరితేరిన నిపుణుణ్ణికాను. ఏదో నాకు తెలిసినంత మటుకు్ రక్తం ఉపయోగాల్ని వివరించాను. కొత్త రక్తం అమృతంలా పని చేసే అనేకమయిన సందర్భాలను డాక్టర్లు చెప్పగలరు.

టానిక్కులు, ఓవల్టీన్, పళ్ళరసం వగైరాలు రక్తంగా మారడానికి కొంత వ్యవధి కావాలి. ఈ లోపున రక్తలేమికి సంబంధించిన వ్యాధులు ఆరంభం కావచ్చు. కాబట్టి, దీని నివారణకు కొత్త రక్తాన్ని యెక్కించడం తప్ప మరో మార్గం లేదు. ఇందు వల్ల తక్షణం పని జరుగుతుంది.

విజ్ఞప్తి

రక్తదాతలు లేనందున ఆంధ్రప్రదేశ్‌లో రక్తపు బ్యాంకులు బాగా పనిచేయడం లేదు. యెప్పటికప్పుడు కొత్త రక్తం కావలసి వస్తున్నది. కాని తగినంత లభించడం లేదు.

రక్తదానానికి ప్రభుత్వం తడవకు రూ 8 (ఎనిమిది) యిస్తుంది. ఆ పైన రక్తం యిచ్చాక ఒక రూపాయ విలువ గల తినుబండారాలను కూడా యిస్తుంది. రక్తాన్ని యివ్వగోరేవారికి వైద్య పరీక్షకూడా ఉచితంగానే జరుగుతుంది.

రక్తదానం విషయంలో ప్రజలలో కొన్ని పొరపాటు అభిప్రాయాలున్నాయని చెప్పాను. వీటిని తొలగించి రక్తదానం అంటే యేమిటో ప్రజలకు తెలియ చెప్పడానికి ప్రచారం విరివిగా సాగాలి,

జిల్లా సంఘాలు

ఈ ఉత్తమాశయ సిద్ధికి ప్రచారం చేయడానికై నేను ఆంధ్రప్రదేశ్‌లో పెక్కు జిల్లాల్లో పర్యటించాను. నెల్లూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో జిల్లా రక్తదాతల సంఘాలు ఏర్పడినవి. రక్తపు బ్యాంకులు గల యితర జిల్లాల్లో కూడా యిటువంటి సంఘాలు ఏర్పడాలి

రోటరీ క్లబ్బులు, రెడ్‌క్రాస్ సంఘాలు, కళాశాలలు మున్నగునవి యీ ఉత్తమ కార్యానికి యింకా యెక్కువ చేయూతనివ్వాలి.

తోటి మానవుల బాధా నివారణకై రక్తదానం చేయమని యువతీ యువకులకు ముఖ్యంగా కళాశాలా విద్యార్థులకు విజ్ఞప్తి చేస్తున్నాను.

రక్తదానం, భూదానం, శ్రమదానం మున్నగు దానాలన్నిటి కంటె శ్రేష్ఠమయినది. ఈ సత్కృషికి యువకులు పట్టుగొమ్మ కావాలి,

రక్త దానాన్ని గురించి యింకా వివరాలు తెలుసుకొనగోరువారు డా. సి.ఎస్. రామచంద్రరావు, డైరెక్టరు, సెంట్రల్ బ్లడ్ బ్యాంక్, ఉస్మానియా జనరల్ హాస్పిటల్, హైదరాబాద్, పేర కాని ఆయా జిల్లాల్లో రక్తపు బ్యాంకు వ్యవహారాలను చూసే వైద్యాధికారికి కాని వ్రాయవచ్చు.

దున్నక చల్లితే కొయ్యక పండినది.

— తెలుగు సామెత.

కోతులు

— మంజుశ్రీ

పక్కింటి శారదాంబ గారికి ఆ రాత్రంతా నిద్ర పట్టితే ఒట్టు. నిద్ర పట్టక పోవటమే గాకుండా పచ్చి మంచి నీళ్లుకూడా సయించలేదు. పచ్చి మంచినీళ్లు సయించక పోవటమే కాకుండా కడుపు వుబ్బికొచ్చింది. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నైనా చెప్పవచ్చు. అసలు విషయం ఏమిటంటే, పొరుగునున్న వెంకాయమ్మగారు రాజలాంఛనంగా కొడుకును వెంటబెట్టుకుని, వాడికి పెండ్లి సంబంధం చూడటానికి మళ్ళీ బయలుదేరారు. ఆమె వచ్చి ఆ పెళ్ళి సంబంధం కుదిరిందీ, కుదరందీ చెప్పిందాకా, పాపం, శారదాంబగారికింతే కాబోలును-అనగా, పచ్చి మంచినీళ్లుకూడా వొంటబట్టక పోవటం, రాత్రి నిద్ర పట్టక పోవడం...త్యాదయః. పెండ్లి సంబంధం చూడటానికి పోయిన వెంకాయమ్మ గారు మాత్రం ఎన్ని రోజులుంటుందేం. ఆ చూడబోయిన వారింట — రేపో మాపో రాదా—ఆకాస్త వార్త తన చెవిన వెయ్యదా—అప్పటికి కాని తన మనస్సు కుదుటబడదా—సదరు శారదాంబ గారికి ఎందుకయ్యా ఇంత జిజ్ఞాస అనగా—

అనగా, అనగా ఆరుగ్గురు కుమారుళ్ళ తర్వాత, అబ్బ నాకారపు పిల్లే ననుకుందాం — మనలో మన మాట. అన్నగారికో కూతురు పుట్టింది. ఆ పిల్ల అలా అలా పెద్దదై నేటికి వాళ్ళ నాన్నకో సమస్యనే తెచ్చి పెట్టిందనుకుందాము. మేనత్త కామాత్రం జిజ్ఞాస వుండటంలో బేసబబేముంది. ఎప్పుడో ఇరవైయేళ్ళ క్రితం ఆస్పత్రిలో పోయిన పసికూన కోసం ఆమె మనస్సు తపిస్తూనే వుంటుంది. అటువంటిది ఏ అమ్మ కుమారుణ్ణో తన వాణ్ణిగా చేసుకుని, ఆ కాస్త మేనకోడల్నిచ్చి చేసుకుందామనుకున్న ఆమె వుబలాటం మగడు కాస్తా వూదేశాడు వుప్పుమని. ఎట్లానైనా ఆడజన్మాయిరి - ఆమె అట్లానే అనుకుంది.

మరయితే వెంకాయమ్మ గారి చిన్నవాడు చూపులకేమీ బావుండడు. అయినా మనం చూడటంలో వుంది కాని—ఎవరైనా యెందుకు బావుండరు? పిల్లవాడు బుద్ధిమంతుడు. తనను పిన్నిగారూ-అని పిలుస్తాడు. అప్పుడే కనుక్కుంది ఆ కలుపుగోలుతనం- అదీ-పిల్లవాడు చదువుకున్న వాడాయె. ఆస్తిపాస్తులు కూడా తగినంత మాత్రం వుండె — తనని పిన్నిగారని పిలుస్తుండె. అటువంటి చిన్నవాణ్ణి వెంటబెట్టుకుని ఆ తల్లి పెళ్ళి సంబంధం చూడటానికి పోలోమని బయలుదేరిందంటే శారదాంబగారికి కష్టంగా వుండదూ— మరీ కాకపోతే వెంకాయమ్మ గారికి సరదా అయింది ప్రతి తడవా సంబంధం చూడటం, పెళ్ళవటం ఇష్టం లేనట్లు- ఇన్ని సంబంధాలు చూడాలా-

శారదాంబ గారికి గట్టినమ్మకమే-ఎలాగూ వెంకాయమ్మ గారు సంబంధం కుదిరేంత తెలివితక్కువగా ప్రవర్తించదని, అయినా తనకింత జిజ్ఞాస లేకపోవునా, తన కడుపున కాసిన కాయవుంటే ఇరవై యేళ్లు నిండేవి. ఎంచక్కా మేనగోడల్నే చేసుకునేది - పోనీ అయ్యా మేనకోడల్నే కోడల్ని చేసుకుందామనుకుంటే వేరే మార్గాలు లేవా అంటే, ఆయనంటాడూ - "పోవే నీ పిచ్చి గాని. ఎవరికో పుట్టిన వాడు మనకు పుట్టిన వాడవుతాడూ". ఆమె నోరు నొక్కుకుంది. ఇంతకూ వెంకాయమ్మగారి చిన్నవాడికి తన మేనగోడల్ని చేసుకుంటే బావుండును. అని ఆమె కొన్ని రోజులుగా ఆలోచిస్తోంది. ఇది బాగానే వుంది. ఆయనకూడా బాగానే వుంది అన్నాడు. అన్నగారికి ఉత్తరం

వ్రాయించింది. ఆయనకు తగని గర్వం. ఆర్నెల్ల నుంచీ, ఉత్తరాల్లో చెవినిల్లు గట్టుకుని పోరుతున్నదా-ఆ తోడబుట్టిన వాడు తన మాట ఖాతరు చేశాడూ - అదేమిటంటే - ఆడ పిల్ల పెళ్ళి వొత్తిడా - లేక పని తొందరా ముఖ్యం.

ఈ ఆర్నెల్లలోపున వెంకాయమ్మ గారు అరడజను సంబంధాలు చూడనే చూసిరి. అనగానగటున నెలకు ఒక్కటీ-ఇందులో ఆమె యెవరికైనా తన కొడుక్కి చేసుకోవటానికి ఇకపడి వున్నట్లయితే తన ప్రయత్నం అంతా వ్యర్థమయ్యేది కదా—

ఏడో నెల గడుస్తున్నది. అప్పుడే వెంకాయమ్మగారు ఏడో సంబంధం చూడటానికి వెళ్ళింది. శారదాంబ గారి కామాత్రం జిజ్ఞాస యెందుకుండగూడదూ.

శారదాంబ గారికా రాత్రి నిద్ర పట్టలేదుకదా - తెల్లవార గట్ల మూడు గంటల రైలుకి అమ్మా, కొడుకూ రానే వచ్చారు. శారదాంబ గారు లేచి కూచుంది. వెంకాయమ్మ గారు రిక్షావాణ్ణి కాసేపు తిట్టటం, ఇంటాయన వాణ్ణి సర్ది పంపించటం, శారదాంబగారు చూస్తూనే ఉన్నది. ఆమెకు సంతోషమైంది, అప్పుడే అడిగేయాలని కాని ఆయన "తెల్లవారుతుంది మరేం ఫరవా లేదు" అని భరోసా ఇవ్వటం వలన అయిష్టంగానే ఆగిపోవలసి వచ్చింది. ఆ ఇంటాయన బెల్లంగొట్టిన రాయిలా అడగనైనా అడగడేం. ఆమె చెప్పదూ — శారదాంబ గారికి తెల్లవారేట్లు లేదు. అలానే ఆ నిశి యెల్ల గడవగా—

ప్రొద్దున్నే బావి దగ్గర హరి గోవిందా హరి గోపాలా అంటున్న వెంకాయమ్మగారిని శారదాంబగారు అడుగనే అడిగింది.

వెంకాయమ్మగారు సగర్వంగా "ఏమో చేసుకోదలచ లేదు'' అని చెప్పనే చెప్పింది.

శారదాంబ గారికి కావలసిన సమాధానం అదే. అయినా వెంకాయమ్మ గారి కామె కళ్ళలో వివరణ అవసరం, అన్న సూచన కనిపించబట్టి—

''పిల్ల కోతిలా వుంటుందండీ - ఏం చెయ్యక పోతే చూసి, చూసి'' శారదాంబగారికి నోటమాట రాలేదు. ఏడోది కూడా కోతేనా -?!

గిట్టని వాళ్ళంటారు కదా - ఇదివరలో చూసిన ఆరు సంబంధాల్లో మూడు వాళ్ళే వొప్పుకోలేదని-ఆమాట వెంకాయమ్మగారు ఛస్తే వొప్పుకోదు.

ఆ ఆరూ కోతులు. ఈ ఏడోది కూడా కోతేను - వెంకాయమ్మ గారు రామభక్తురాలు.

అందుకే ఆమె కందరూ..............గా కనిపిస్తారు. ఆమె భర్త పేరు అంజనేయులు గారు.

ఆమె కొడుకు పేరు హనుమంతరావూ, కూతురి పేరు మారుతీ-ఆమెకింకా యిద్దరు కొడుకులుంటే బావుండును.... అంగదుడూ, జాంబవంతుడూ అని పెట్టుకునేది.

శారదాంబగారు విస్తుపోయినా, తోడబుట్టిన వాడికి ఆ రోజే ఉత్తరం వ్రాయించింది.

తోడబుట్టినవాడురాడూ-శారదాంబగారుసంతోషంతోపొంగిపోయింది, ''అవునా, అన్నయ్యా యీ సంబంధం చేశావా బావుంటుంది.'' అని చెప్పింది. అన్నయ్య సరేనని వొప్పుకుని వెంకాయమ్మగారి భర్తతో మాట్లాడి చక్కాపోయాడు.

వెంకాయమ్మగారు, చిన్నవాణ్ణి తీసుకుని శారదాంబగారి అన్నగారింటికి బయలుదేరింది. శారదాంబగారు కూడా ఆయన్ను యెలానో కష్టపడి వొప్పించింది. తానూ బయలుదేరింది. అంతా బాగానే వుంది. చూసుకున్నారు. మాట్లాడుకున్నారు, వెంకాయమ్మగారు వెళ్ళిపోయింది. రాజసంగా-తరువాత తెలియజేస్తాం, అని చెప్పి కొడుకుని వెంబెట్టుకుని.

ఆమె అట్లా స్టేషను చేరిందో లేదో, ఆడబడుచు తన మీద పడదూ-శారదాంబగారికోపమొచ్చింది. ''ఏమే అమ్మడూ-ఎలా వున్నాడే; నా చిట్టికదూ-చెప్పమన్నది మేనగోడల్ని.

''కోతిలావున్నాడు, నేను ఛస్తే చేసుకోను'', తానెలా వుందో-! శారదాంబగారికి....''మూర్ఛ వచ్చె, తనువున్ డస్సెన్ శ్రమం బయ్యెడిన్....'' అన్నంత పనైంది.

ఆడబడుచు 'కోతి'అన్నది వెంకాయమ్మగారి చిన్నవాణ్ణి. అన్నయ్య ఇక్కడకొచ్చి అదే అంటున్నాడు. అది సరే సరి-బరిదెగించి మాట్లాడుతోంది. అన్నయ్య అక్కడికొచ్చినప్పుడే అఘోరించకూడదూ-తనేం చెప్పాలి. వెంకాయమ్మ గారితో, శారదాంబగారికి కోపమొచ్చింది. నవ్వొచ్చింది. కోతులు-అనుకుంది, వెంకాయ్మగారినుంచి జాబు

రాకముందే, అన్నయ్య మీ సంబంధం అక్కర్లేదని వ్రాయనే వ్రాశాడు. అదట్లా జరిగింది. ఎదుటి వాళ్ళంతా కోతులా! మనకు మనం అందగాళ్ళమూ-అనుకుంది శారదాంబగారు

తరువాత శారదాంబగారి ఆయనకు అక్కడినుంచి ట్రాన్స్ఫర్ కావటం, ఆమె వేరే ఊళ్లో, ఎప్పుడూ పొరిగింటి వాళ్ళతో పెండ్లి సంబంధాల విషయమై మాట్లాడక పోవటమూ జరిగింది.

తరువాత రెండు మూడేళ్ళు, ఎక్కడ పెళ్ళి ఊరేగింపు కనపడ్డా, ఏ శుభలేఖ వచ్చినా, వెంకాయమ్మగారూ, తనని పిన్నిగారూ, అని పిలచే వాళ్ళ చిన్నవాడూ, గుర్తు వస్తూనే వున్నారు పాపం, శారదాంబగారికి.

తరువాత మళ్ళీ వెంకాయమ్మగారి ఊరికి ట్రాన్స్ఫర్ వచ్చిందని-ఆయన చెప్పినప్పుడు శారదాంబగారికి ఆశ్చర్యమూ, ఆనందము కూడా కలిగినయ్.

వెంకాయమ్మగారి పక్కభాగం ఖాళీగా లేదు

ఆ ఊరొచ్చిన నాలుగురోజుల తర్వాత శారదాంబగారు, వెంకాయమ్మగారింటికి పోయింది. కుశల ప్రశ్నాదికాలైన తర్వాత వెంకాయమ్మగారు చెప్పింది. ''ఏమిటో పెద్దదాన్నైపోయినాను. సరిగా కనపడదా - సరిగా వినపడదా- అయినా నా కింకేం కావాలిలే-'' శారదాంబగారు అడిగింది చిన్నవాడి పెళ్ళిని గురించి.

''ఆ చేశాం, ఎట్లానైతేనేంవో కోతిని దెచ్చి.''
శారదాంబగారికి నవ్వొచ్చింది.

''పిల్లలా—''

''అ....రెండేళ్ళవాడు కొడుకు. మళ్ళీ కాన్పుకని పోయింది. పది రోజులు ముందొచ్చివుంటే నా మనవణ్ణి చూసేవాళ్ళు. అయినా యెక్కడికి వెళతారులే. ఇక్కడే ఉంటారుగా. ఆ వెధవ ఏమి అల్లరి అనుకున్నారు. ఉట్టి కోతి వెధవ. ఒక్క క్షణం, ఒక్కచోట వుండడు కోతి....''

శారదాంబగారికి ఆపుకుందామనుకున్నా, ఆగనంత నవ్వొచ్చింది.

వెంకాయమ్మగారు కూడా నవ్వుతూ ''వాళ్ళ తాతయ్య పేరే....'' ఈసారీ శారదాంబగారికి నవ్వొచ్చింది.

శారదాంబగారు లేచి వెళ్లొస్తానంది.

"మా కోతి వెధవ వచ్చిన తర్వాత వోసారి రండి.... రామ చంద్రా, రామా, రామా." వెంకాయమ్మగారు ఆవలించింది.

అంతా రామమయం అన్నాడు వెనుకటికి ఎవరో మహానుభావుడు.

అందుకే యీ లోకమంతా-మయం.

మంగలి పాత చాకలి కొత్త.

* * *

ఊసుపోక పోతే ఊళ్ళో చుట్టరికం.

— తెలుగు సామెతలు.

శార్వరి శుభాకాంక్షలు

— రావిపాటి లక్ష్మీనారాయణ

శారికా కీరముల్, జతలయి నేత్రప
        ర్వములుగాన్ హాయితో ప్రజలు మనగ
రిత్తధనులు నొనర్చియు నప్పులన్ సంత
        సంబున నూత్న వస్త్రముల గొనగ
పఙలు వేడ్కను నెల్లవారల పరిమితో
        త్సవమున జేదు భక్షణ మొనర్ప
రహిబల్కి పాడుచామ్రక్షోణిజములపై
        శుకపిక సంతతుల్ సొంపు గూర్ప

భాసురంబుగ బంచాంగ పఠన యొనరి
క్రాంతి జిగురు టాకులను వృక్షములు దనరి
క్షమను వచ్చి శార్వరి శుభా కాంక్షలంగ
లుగ సలుపుగాత భూప్రజలుంజెలంగ ॥

——:0:——

దొంగలు దూరిన యిల్లు దోసలు తిన్న కడుపు.

*　　*　　*

గారాబం గజ్జెల కేడిస్తే వీపు దెబ్బల కేడిచింది.

— తెలుగు సామెతలు.

ఆంధ్ర ప్రదేశ్

నూతన సౌకర్యం

ఆంధ్ర ప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ కొత్తగా Luxury కోచ్ నొకదానిని కొన్నది. పూర్తిగా ఉక్కు రేకుతో తయారయిన దీని ఖరీదు రూ. 22,000 ఇది హైదరాబాదు ఆల్విన్ మెటల్ వర్క్సు సంస్థచే తయారు చేయబడింది. ఆల్విన్సు బస్సు ప్రధాన భాగం డివిజన్ చీఫ్ ఇంజనీరుచే 10-2-60 న యిది ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రవాణా సంస్థ అధ్యక్షులు అయిన శ్రీ ఎమ్. పురుషోత్తంపాయ్, ఐసిఎస్., కి అప్పగించబడింది.

నీటుగా, అందంగా ఉండే యీ కోచ్‌లో దాదాపు ప్రయాణీకులు కోరుకొనే సౌకర్యాలన్నీ ఉన్నాయి. ఇందులో 26 మంది సుఖంగా కూర్చో వచ్చు. సీట్లు విమానం సీట్లవలె ఉంటాయి. వెనక్కు జేరబడ్డానికి, పక్కలకు చేతులు పెట్టుకోడానికి కూడా మెత్తలు ఉంటాయి. సీట్లలో కుషన్లు, జేరబడే చోట మెత్తలు లోపల రబ్బరుతో పైన మంచి పివిసి లెదర్ క్లాత్‌తో తయారు చేయబడ్డాయి. ప్రతి సీటుకి హంసతూలిక వలె మృదువయిన 'హెడ్ రోల్' ఒకటి ఉంది. దానికి గుడ్డ తొడుగు ఉంది. ఈ తొడుగును పైకి తీయవచ్చు. దీనిపై ఆంధ్రప్రదేశ్ పటం, దాని మధ్య 'ఆర్.టి.సి.' అనే అక్షరాలు రంగు దారాలతో కుట్టబడ్డాయి. ప్రతి సీటుకి వెనుక భాగంలో సిగరెట్లనుసి రాల్చుకొనేందుకు, పుస్తకాలు, వార్తా పత్రికలు వగైరా పెట్టుకొందుకి వసతి ఉంది.

లోపలి భాగం

కిటికీ అద్దాలు కంటికి విశ్రాంతినిచ్చే లేత నీలంరంగులో ఉంటాయి. సగం వాలి ఉండే రకం కిటికీలు మామూలు కంటె వెడల్పుగా ఉండి ప్రయాణీకులందరూ పక్క వస్తువులు చూడ్డానికి వీలు కల్పిస్తాయి. అద్దాలు ట్రిప్లెక్సు 'సన్ డిమ్' గట్టి పలక రకం. ఇది సూర్యరశ్మిలోని వేడిని చాల భాగం తీసివేసి వెల్తురునుమాత్రం చొరనిస్తుందని అంటారు. కాబట్టి వీటి అమరికవల్ల లోపలిభాగం ఆరోగ్యకరమయి తగినంత వెల్తురు కలిగి మరీ వేడి లేకుండా ఉంటుంది. కిటికీలన్నిటికి మృదువయిన నీలం నైలాన్ తెరలు ఉన్నాయి. ఇవి స్టెయిన్‌లెస్ స్టీల్ కమ్ములపై వ్రేలాడుతూ ఉంటాయి.

ప్రయాణీకులు కూర్చునే భాగంలో పైన ఆరు విద్యుద్దీపాలు, 2 పంకాలు ఉన్నాయి. ఆపైన యిద్దరు ప్రయాణీకుల సీట్లలో ప్రతి ఒక్కదానికి చదువుకొందికి ఒక దీపం దానికి ప్రత్యేకం మీట ఉన్నాయి. కండక్టరు వగైరాలను పిలవడానికి ప్రతి సీటుకి ఒక పుష్ బటన్‌కూడా ఉంది.

అలంకరణ గది

ఈ కోచ్ వెనుక భాగంలో అలంకరణ గది ఉంది. ఇది దీని విశేషాలలో ఒకటి. ఈ గదిలో వాసన రాని లావెటరీ, ముఖం, చేతులు కడుక్కొనే బేసిన్, అద్దం, నీటి తొట్టి ఉన్నాయి. కప్పులు, సాసర్లు వగైరా సామాను పెట్టుకొందుకు చిన్న బీరువాకూడా ఉంది.

నేల భాగం కొయ్య. పైన రబ్బరు చాప ఉంది. కోచ్ గోడలు, పై కప్పు రేకుల మధ్య ఖాళీ స్థలం థెర్మోకోల్ ఇన్సులేషన్ పలకలతో కప్పబడింది. ఈ విధంగా బయటి వేడిమి లోపలకు సాధ్యమయినంత తక్కువ వచ్చే యేర్పాటు చేయబడింది; యిందువల్ల ముందు ముందు అవసరమయితే యీ కోచ్‌ని 'ఎయిర్ కండిషన్డు' చేయవచ్చు. ఈ కోచ్ రంగు అందంగా ఉదాత్తమయిన దాని ఆకారానికి తగ్గట్టుగా ఉంది.

సామాను

ప్రయాణీకులు కూర్చునే భాగం పొడుగునా రెండువైపులా సామాను పెట్టుకొనే చక్కని షెల్ఫులు ఉన్నాయి. ఆపైన

బస్సు నేల క్రింద పది ఘనపుటడుగుల పరిమాణంగల నాలుగు సామాను అరలున్నాయి. కండక్టరు సీటు డ్రైవరు కూర్చునే అరలో ఎడమవైపున ఉంది. డ్రైవరు వెనకాల ఒక జారుడు తలుపు ఉంది. అక్కడి నుంచి కండక్టరు కోచ్ నడుస్తుండగా కూడా ప్రయాణీకులు కూర్చున్నచోటికి రావచ్చు.

ఆల్విన్ చీఫ్ ఇంజనీరు మాటలనుబట్టి ఎప్పుడో కొన్ని సంవత్సరాల క్రితం నిర్మించిన 4 Luxury కోచ్‌లు తప్ప ప్రయాణీకుల సౌకర్యాలు ముఖ్యంగా ఆంధ్ర ప్రదేశ్‌ను దర్శించే యాత్రీకుల సౌకర్యాల పెంపుకి యింతవరకు యిటువంటి శకటం తయారు కాలేదు. ఇటీవల బీహారు ప్రభుత్వం మరి రెండు Luxury కోచ్‌ల నిర్మాణాన్ని కోరిందిట.

ప్రత్యేక సందర్భాలలో మాత్రమే

రోడ్డు రవాణా సంస్థ సంపాదించిన యీ Luxury కోచ్ ప్రత్యేకం యాత్రికులు, పెళ్ళి వారు మున్నగు వారి సౌకర్యార్థం మాత్రమే ఉద్దేశించబడింది. కాబట్టి మామూలు బస్సుల వలె యిది రోజూ నడపబడదు. ఆంధ్ర ప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ బొంబాయి బి. ఇ. ఎస్. టి. తో పోల్చతగిన బృహత్ సంస్థ. దీని క్రింద ప్రస్తుతం 1100 బస్సులు ఉన్నాయి. వీటిలో 175 హైదరాబాదు, సికిందరాబాదు నగరాలలో నడుస్తున్నాయి. 1966 ఆఖరు నాటికి యీ సంస్థ 2,700 బస్సులను నడుపగలదు, 20,000 మందికి పని కల్పించగలదు.

ఈ సంస్థ యీ సంవత్సరం అక్టోబరు నుంచి గుంటూరు జిల్లాలో బస్సు మార్గాలను స్వాధీనం చేసుకొంటుంది. పశ్చిమ గోదావరి జిల్లాలో ఈ సంస్థ క్రిందకు రావలసిన మార్గాలు ఇదివరకే గెజెట్‌లో ప్రకటింపబడినవి. ఈ సంస్థ ప్రస్తుత విస్తరణ పద్ధతినిబట్టి, తృతీయ ప్రణాళిక ఆఖరు నాటికి (1966-67) పదకొండు ఆంధ్ర జిల్లాలలోని అన్ని మార్గాలలోను దీని బస్సులు ప్రవేశపెట్టబడగలవని భావించబడుతున్నది. ఈ సంస్థ బస్సులు తెలంగాణా జిల్లాలు తొమ్మిదింటిలోనున్నూ, కృష్ణా జిల్లాలోనున్నూ యిదివరకే నడుస్తున్నాయి. ఈ విధంగా జాతీయకరణ పథకం పూర్తి చేయబడిన నాడు యీ సంస్థ ఆస్తులు రూ. 20 కోట్లు మించగలవు—ఇది యీ సంస్థ స్థిరత్వానికే కాక రాష్ట్ర ప్రభుత్వ పరపతికి కూడా ప్రబల నిదర్శనం.

—:0:—

పొడుపు కథలు

1. చంద్ర బింబ సమం వస్తు వస్తునామత్రయాక్షరం.
2. ఈరికిలంటి గుడ్డలు కట్టుకొని ముత్యాలంటి బిడ్డల గన్నది.
3. తోకలేని పిట్ట తొంభై ఆమడ వెళ్ళింది.
4. చారెడు గుంటలో మానెడు పొగడాలు

(జవాబులు: 1. అప్పడం, 2. మొక్కజొన్న పొత్తు, 3. ఉత్తరం, 4. పొయ్యి, నిప్పులు)

రాష్ట్ర బడ్జెట్టు

1960-61 రాష్ట్ర బడ్జెట్టు 1960 ఫిబ్రవరి 20 న రాష్ట్ర శాసనసభలో ప్రవేశపెట్టబడింది. ఇది రూ. 20.01 లక్షల మిగులు చూపిస్తున్నది. ఆదాయం రూ. 82.18 కోట్లు కాగా వ్యయం రూ. 81.98 కోట్లుగా ఉన్నది.

కొత్త పన్నుల ప్రతిపాదనలేమీ లేవు. పెట్టుబడి వ్యయం రూ. 32.44 కోట్లు ప్రణాళికా పథకాలకు ఉద్దేశించబడిన మొత్తం రూ. 44.04 కోట్లు.

వ్యవసాయానికీ, పరిశ్రమలకు ఆర్థికమంత్రి కొన్ని ప్రత్యేక సౌకర్యాలను ప్రకటించారు. ఇందువల్ల మిగులు రూ. 26 లక్షల లోటుగా తేలగలదు.

ఆ ప్రత్యేక సౌకర్యాలు యివి: వేరుసెనగ, ప్రత్తిపై మూడు సంవత్సరాల వరకు ప్రత్యేక అసెస్‌మెంట్ నిలుపుదల. చేనేత పరిశ్రమ వారు కొనే నూలు దారం అమ్మకంపై పన్ను మినహాయింపు. గానుగ యజమానులకు నూనె గింజల కొనుగోలుపై పన్ను మినహాయింపు. వారి గానుగ సరుకు అమ్మకంపై మినహాయింపుకి వారు అర్హులయితే. తెలకపిండి అమ్మకంపై పన్ను రేటు 3శాతం నుంచి 2 శాతానికి తగ్గింపు. ఇందువల్ల ప్రభుత్వ ఖజానా నుంచి రూ. 46 లక్షలు ఖర్చు కాగలదని అంచనా.

రాష్ట్రంలో పరిశ్రమాభివృద్ధికై ఒక కోటి రూపాయల ఆరంభ వ్యయంతో పారిశ్రామిక అభివృద్ధి సంస్థ నొకదానిని యేర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు ఆర్థిక మంత్రి వెల్లడించారు. ఈ పెట్టుబడి తరువాత, అవసరమయితే మూడు కోట్లకు హెచ్చించబడగలదు.

ఈ సంస్థ భారతీయ కంపెనీల చట్టం క్రింద రిజిస్టరు కాగలదు. డైరెక్టర్ల బోర్డులో రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధిలో ఆసక్తి గల ప్రముఖ పౌరులు ఉంటారు.

రసాయన ఎరువుల ఫ్యాక్టరీ పెట్టుబడి నిమిత్తం యీ సంవత్సరం వచ్చే సంవత్సరం రూ. 2.50 కోట్ల వరకు రాష్ట్ర సెక్యూరిటీలు రొక్కం చేయబడతాయని మంత్రిగారు బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు.

ఈ ఫ్యాక్టరీప్రాజెక్టు అభివృద్ధిని గురించి నివేదిస్తూ. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సాంకేతికుల సంఘం గడచిన ఏప్రిల్‌లో మన రాష్ట్రాన్ని దర్శించి సాలుకు 80,000 టన్నుల నత్రజనిని తయారుచేసే ఫ్యాక్టరీని కొత్తగూడెం సమీపంలో నెలకొల్పాలని సిఫార్సు చేసిందని చెప్పారు.

ఈ ఫ్యాక్టరీలో కొంత భాగం యూరియా, కొంత భాగం నైట్రో ఫాస్ఫేట్ అనే రసాయన యెరువు తయారు చేయబడతాయి.

రాష్ట్ర భూములలో భాస్వరం, నత్రజని కొరత కాబట్టి యీ రెండూ గల నైట్రో ఫాస్ఫేటు తయారీ వ్యవసాయ వస్తూత్పత్తి హెచ్చుదలకు బాగా దోహదం చేయగలదన్నారు.

ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రణాళిక తయారీలోనేమీ, నిర్వహణలో నేమీ తోడ్పడగలనని కేంద్ర ప్రభుత్వం హామీనిచ్చింది. తగిన దీర్ఘ కాలిక ఋణాల రూపంలో విదేశ ద్రవ్యం సమకూర్చబడుతుంది.

ఈ ఫ్యాక్టరీ 1963 లో పని ప్రారంభించగలదన్న విశ్వాసం వెల్లడిస్తూ, యిప్పుడు ప్లాంటు, పరికరాలకు టెండరు స్పెసిఫికేషన్లు తయారు చేయబడుతున్నవన్నారు.

ఈ ప్రాజెక్టు యాజమాన్యం, నిర్వహణ త్వరలోనే రిజిస్టరు కాగల లిమిటెడ్ కంపెనీకి బదిలీ చేయబడగలవు. వాటాలలో 51 శాతానికి తక్కువ కాకుండా రాష్ట్ర ప్రభుత్వానికి ఉండగలవు కాబట్టి యిది ఒక విధంగా ప్రభుత్వ

తంపెనీగా ఉండగలదు. అయితే ప్రైవేటు పెట్టుబడికి కూడా తగినంత అవకాశం ఉంటుంది.

1960-61 బడ్జెట్ ప్రతిపాదనలలో రాజధానీ నగరమైన హైదరాబాద్‌కు ప్రత్యేకంగా ఉపకరించే పథకాలు పెక్కు ఉన్నాయి.

పది లక్షల వ్యయంతో నేషనల్ థియేటర్ నిర్మాణం, అయిదు లక్షల వ్యయంతో ఫతేమైదానంలో స్టేడియం నిర్మాణం వీటిలో చేరి వున్నాయి.

మంత్రులకు, కార్యదర్శి ఉపకార్యదర్శులకు, యితర సీనియర్ ఆఫీసర్లకు పదహారు లక్షల రూపాయలతో నివాస భవంతులు నిర్మించబడతాయి.

అతి తీవ్రంగా ఉన్న నిరుద్యోగ సమస్య పరిష్కారానికై నగర ద్వయంలో పది లక్షల ఆరంభ వ్యయంతో చిన్న కుటీర పరిశ్రమలు అభివృద్ధి పరచబడతాయి.

ఉభయనగరాలలో నీటి సరఫరా అభివృద్ధికై రూ. 78 లక్షల వ్యయంతో మంజీరా పథకం చేపట్టబడుతుంది. ఇందువల్ల కొత్తగా యేర్పడే పేటలలో నీటి కొరత తీరుతుంది.

శాసన సభ్యుల కొత్త వసతి గృహాలను విస్తరించి తద్వారా పాత వసతి గృహాలను నాన్ గెజెటెడ్ ఉద్యోగులకు యిచ్చేందుకు వీలు కల్పించడం.

అన్నిటిని మించి కొత్త సెక్రటేరియట్ భవనం నిర్మాణానికి 20 లక్షల రూపాయల వసతి కల్పించబడింది. సెక్రటేరియట్ కొత్త భవనం నిర్మాణంపై ఒక కోటి రూపాయలను ఖర్చు పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. సాధ్యమయినంత త్వరలో పని ప్రారంభించటానికై వచ్చే సంవత్సరం బడ్జెటు అంచనాలలో ఇరవయి లక్షలు కేటాయించబడినవి. ఇప్పుడు యీ భవన నిర్మాణానికి తగిన స్థల నిర్ణయం పరిశీలనలో వుంది.

ప్రస్తుతం పెక్కు ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాలలో ఉన్నాయి. ఇందువల్ల ప్రభుత్వ వ్యవహారాలు జరగడంలో ఆలస్యం కావడమే కాక సాలుకు దాదాపు రూ. 4 లక్షలు అద్దె చెల్లించవలసి వస్తున్నది.

బడ్జెటు అంచనాల ఇతర విశేషాలు

నాగార్జున సాగర్ బహుళార్థసాధక ప్రాజెక్టుకి 900 లక్షల రూపాయలు, వరద నిరోధక కృషికి 170 లక్షలు, విశాఖపట్నం సముద్ర తీరం అభివృద్ధికి 9 లక్షలు, మోటారు శకటాలపై టోల్ పన్ను, లైసెన్సు రుసుంల వల్ల వచ్చే ఆదాయం నష్టానికి ఆంధ్ర ప్రాంతంలోని పుర పాలక సంఘాలకు నష్ట పరిహారానికి 5 లక్షలు కేటాయించ బడినవి. వినోదం పన్నులు హెచ్చింపు-7.60 లక్షలు.

హరిజన గృహవసతి పథకాలకు 36.47 లక్షల రూపాయలు, వెనుకబడిన తరగతులు, తదితర పేద విద్యార్థుల విద్యా సౌకర్యాలకు 10 లక్షలు, ఆస్పత్రులకు ముఖ్యంగా తెలంగాణా ప్రాంతంలో వాటికి ప్రత్యేక గ్రాంటులకు 24 లక్షలు కేటాయింపబడినవి. పంచాయతీలకు, సమితులకు ప్రత్యేక గ్రాంటులు 248 లక్షలు. సాంకేతిక, వృత్తి విద్యా కళాశాలల విద్యార్థులకు విద్యా విషయక ఋణాలు-2 లక్షలు.

1960 లో రోడ్డు రవాణా జాతీయకరణ గుంటూరు, పశ్చిమ గోదావరి జిల్లాలకు విస్తరణ.

బడ్జెటు అంచనాల ప్రకారం ముగింపు నిల్వ మైనస్ 8.62 కోట్ల రూపాయలు ఉండగలదు. ఖర్చు కార్యక్రమాన్ని తగ్గిస్తే యీ లోటు వచ్చి వుండేది కాదని ఆర్థిక మంత్రి అభిప్రాయపడ్డారు,

''ఏది ఏమైనప్పటికి ప్రణాళికా లక్ష్యాలను మాత్రం సాధించి తీరాలనే పట్టుదలతో వున్నాము. ఇదే మనకు తగినంత ధైర్యాన్ని, ఆత్మ విశ్వాసాన్ని చేకూర్చ గలుగుతుంది తత్ఫలితంగా మూడవ ప్రణాళిక సందర్భంలో ఉత్పన్నమయ్యే అవసరాలను, బాధ్యతలను ధైర్యంతో ఎదుర్కొన గలుగుతాం.''

ప్రభుత్వ ఋణం విషయంలో, వచ్చే సంవత్సరం చేయగల 13 కోట్ల అప్పులోనూ యిదివరకటి అప్పుల వాయిదాలను తీర్చటానికి 11.25 కోట్లు పోగలవు. కాబట్టి ప్రణాళికా పథకాల పెట్టుబడికి అదనంగా యివ్వడానికి యిందులో యేమీ మిగలదు.

''ఇది కొంచెం ఆందోళననే కలిగిస్తోంది. ముఖ్యంగా మూడవ ప్రణాళిక ఆర్థిక అవసరాల సందర్భంలో కొంత చిక్కుగానే వున్నది. అయితే మన అవసరాలను నిర్ధారించే

వ్పుడు రానున్న ఆర్థిక సమితి ఈ విషయాన్ని లెక్కలోకి తీసుకుంటుందని ఆశిస్తున్నాను.''

1960-61 అంచనా ఆదాయం సుమారు 82 కోట్ల రూపాయలు. ఇది 1959-60 అంచనా (72 కోట్లు) కంటె 10 కోట్లు యెక్కువ. అయితే 1959-60 పునర్విమర్శక అంచనా 78.08 కోట్లు తేలింది. ఖర్చు మాత్రం 76.13 కోట్లు.

ఈ విధంగా వచ్చే సంవత్సరం రాష్ట్ర ఆదాయం 4.10 కోట్లు హెచ్చగలదు. ఇందుకు ప్రధానంగా భూమి శిస్తు క్రింద. (50 లక్షలు), రాష్ట్ర ఆబ్కారీ క్రింద (42 లక్షలు) అమ్మకం పన్ను క్రింద (52 లక్షలు), యితర పన్నులు, సుంకాలు (29 లక్షలు), పరిశ్రమలు, సరఫరాలు (27 లక్షలు), కేంద్ర పన్నులు, గ్రాంటులు (164 లక్షలు), చిల్లర పద్దుల క్రింద (46 లక్షలు) వచ్చే అదనపు రాబడి కారణం.

1960 మార్చి మాసాంతానికి ప్రభుత్వ ఋణం 186కోట్ల రూపాయలు ఉండగలదని భావించబడుతున్నది. 1959-60 సంవత్సరం 4.89 కోట్ల లోటుతో ముగుస్తుంది. బడ్జెటు అంచనా ప్రకారం యీ లోటు 1.44 కోట్లు మాత్రమే ఉండ గలదని భావించబడింది.

ఆహారధాన్యాల అధికోత్పత్తి వల్ల మొత్తం ఆహార పరిస్థితిలో పరిమితమయిన మార్పు మాత్రమే వచ్చినదని మంత్రిగారు అన్నారు. సరుకును నిలవచేసి, ధరలను అదుపులో పెట్టేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తమ తమ కృషిని కొనసాగించాలన్నారు.

ఈ సంవత్సరం వ్యవసాయ వస్తూత్పత్తి అంచనాలు తక్షణ ప్రయోజనం గురించి అంత ఆశాజనకంగా లేక పోయినా మొత్తం దేశంలోనూ, రాష్ట్రంలోనూ కూడా పారిశ్రామిక వస్తూత్పత్తి క్రమంగా హెచ్చిందని 1959 లో రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థ గతులను సమీక్షిస్తూ ఆయన అన్నారు.

అయితే ఉద్యోగ పరిస్థితులేమీ చెప్పుకోతగినంతగా మెరుగు కాలేదు. ప్రణాళికా పథకాల అమలు అభివృద్ధి మిక్కిలి ముఖ్యాంశం.

ద్వితీయ ప్రణాళికలో ''కొరదలా పథకాల" పూర్తికి కావలసిన అపార ధనం రాష్ట్ర తృతీయ ప్రణాళిక స్వరూపం మార్పుకి ముఖ్య కారకం కావచ్చునని తృతీయ ప్రణాళిక పై వ్యాఖ్యానిస్తూ ఆయన అన్నారు. తృతీయ ప్రణాళికకు 474.88 కోట్ల రూపాయలు కేటాయించబడాలని అనుకొంటుండగా ద్వితీయ ప్రణాళికలో మిగిలిపోయే పనులకే 139.76 కోట్లు కావాలని అంచనా వేయబడింది.

మింగ మెతుకు లేదు మీసాలకి సంపెంగ నూనె.

* * *

కడవంత గుమ్మడికాయ కత్తిపీటకి లోకువ.

— తెలుగు సామెతలు.

జిల్లాల వార్తలు

ఆదిలాబాద్

ప్రపంచ వ్యవసాయ ప్రదర్శనానికి రైతుల యాత్ర:- బ్లాకుల నుంచి, బ్లాకులు లేని ప్రాంతాల నుండి ఎన్నుకున్న 52 మంది రైతులు 1960 ఫిబ్రవరి 4 వ తేదీన ప్రపంచ వ్యవసాయ ప్రదర్శనను తిలకించటానికి వెళ్ళారు. ఖానాపూరు బ్లాక్ అభివృద్ధి అధికారి, 5 గురు గ్రామీణ స్థాయి కార్యకర్తలు రైతులను అనుసరించారు. బ్లాకులు లేని ప్రాంతాల నుండి వెళ్ళిన రైతుల ఖర్చులకు గాను ప్రభుత్వం రు. 1000 లను మంజూరు చేసింది,

పంచాయతీసమితి కార్యాలయం:- జిల్లా కలెక్టర్ జనవరిలో లక్షెట్టిపేట దగ్గర పంచాయతీ సమితి కార్యాలయానికి శంకు స్థాపన చేశారు. ఈ భవనం రు. 2500 ల అంచనాతో కట్టబడుతోంది.

అదే రోజు లక్షెట్టిపేటలోనే కలెక్టర్ రు. 10000 ల వ్యయంతో నిర్మించబోయే విత్తనాల భాండాగారానికి కూడ పునాది రాయి వేశారు.

గవర్నరు పర్యటన

జనవరిలో గవర్నరు మూడు రోజులపాటు ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించారు. ఆయన తన పర్యటనలో మంచిర్యాల, లక్షెట్టిపేట, చిన్నూరు, బెల్లంపల్లి, అసిఫాబాదులను సంచర్శించారు.

జిల్లా అవార్డులు

రిపబ్లిక్ దినోత్సవాన కలెక్టరు ఈ దిగువ నుదహరించిన వారికి జిల్లా అవార్డులు అందజేశారు.

1. సైనిక అవార్డు: శ్రీ కరణ్‌సింగ్, హవల్దారు నెం. 533/207
2. ఉత్తమ బాలభటుడు: శ్రీ జి. ఉల్లాస్.
3. ఉత్తమ ఎ.సి.సి. కాడెట్: శ్రీ అబ్దుల్ వకీల్.
4. పెరేడు నందు ఉత్తమ పోలీసు: శ్రీ అబ్దుల్ ఖలీఫ్, నాయక్ నెం. 96.
5. ఉత్తమ అటవీ సమాచారకుడు: శ్రీ కరీముల్లా.
6. అభ్యుదయ రైతు: శ్రీ చింతపల్లి చిన్నన్న.
7. ఏజన్సీ ప్రాంతంలో వైద్య సేవకు: శ్రీ రామాచారి మెడికల్ ఆఫీసరు, ఉట్నూరు.
8. ఉత్తమ పోలీస్ స్టేషన్: ఆదిలాబాద్ పోలీస్‌స్టేషన్.
9. పోలీసులకు రొక్కం బహుమతి: శ్రీ అబ్దుల్ ఖాదర్, శ్రీ మహ్మద్ అఫ్జల్.

కేస్లాపూర్ జాతర

జనవరి 28 వ తేదీన కేస్లాపూర్‌లో జరిగిన కొండ జాతులవారి జాతర సందర్భంలో ప్రదర్శన ఒకటి యేర్పాటు జేయబడింది. అందులో జిల్లాలోని అన్ని శాఖలు పాల్గొన్నాయి.

అనంతపురం

గోరంట్ల పంచాయతీ సమితి:- 1959 డిసెంబర్ 15 వ తేదీన గోరంట్ల బ్లాకు పంచాయతీ సమితికి ప్రారంభోత్సవం జరుపబడింది. డిసెంబర్ 26 న సమితికి ఐదు స్థాయీ సంఘాలు ఎన్నుకోబడ్డాయి.

జనవరి 30, 31 తేదీలలో వాయల్పాడులో పశు ప్రదర్శన మొకటి యేర్పాటు జేయబడింది.

గుంటూరు

సహకార సంఘాలు:- 1959 డిసెంబర్ మాసంలో రెండు బహుళార్థ సాధక సహకార సంఘాలు-నిడమర్రులో ఒకటి, రెండవది రామచంద్రపురంలో-ప్రారంభించబడ్డాయి.

నీరు కొండలో పశువుల ప్రథమ చికిత్సా కేంద్రమొకటి తెరువబడింది.

చిన్న మొత్తాల పొదుపు:- గ్రామాలలో విరివిగా పెట్టు

బకులను సేకరించటానికి గాను 1959 డిసెంబర్ ఆఖరు వారంలో తాళ్ళూరు బ్లాకులో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంలో మొత్తం రు 6535 లు వసూలు జేయబడ్డాయి.

ఒంగోలు రైతుల నాగార్జునసాగర్ యాత్ర:- ఒంగోలు బ్లాకు నుంచి అభ్యుదయ రైతులు, యువకులు కలిసి 40 మంది 1959 డిసెంబర్ మాసంలో నాగార్జునసాగర్ దర్శించారు.

మద్రాస్ ముఖ్యమంత్రిచే పాఠశాలా భవనానికి శంకుస్థాపన:- మద్రాస్ ముఖ్యమంత్రి కామరాజ నాడారుతో పాటు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, ఆర్థికమంత్రి 20-12-59వ తేదీన దుగ్గిరాల విచ్చేశారు. అక్కడ బాలికోన్నత పాఠశాల భవనానికి శ్రీ నాడారు పునాదిరాయి వేశారు. ఈ ఉత్సవానికి చాల మంది ప్రజలు హాజరయ్యారు.

కమ్యూనిటీ వర్కుషాపు

1960 జనవరి ఒకటవ తేదీన మంగళగిరిలో వండ్రంగం, కమ్మర వృత్తులకు సంబంధించిన రూరల్ కమ్యూనిటీ వర్కుషాపు నొకదానిని ప్రారంభించారు.

మంగళగిరి పంచాయతీ సమితిలోని ఇప్పటం గ్రామానికి 31-12-1959 వ తేదీన విద్యుచ్ఛక్తి సరఫరా గావించబడింది. ఈ సందర్భంలో ఒక ఉత్సవ కార్యక్రమం యేర్పాటు జేయబడింది.

హైదరాబాద్ జిల్లా

చేవెళ్ళకు విద్యుచ్ఛక్తి:- 11 వ తేదీ చేవెళ్ళ సమితి బ్లాకు చరిత్రలో మరువరాని రోజే. ఆ రోజు ఆ గ్రామానికి విద్యుచ్ఛక్తి వచ్చింది. ప్రారంభోత్సవం రెవిన్యూ శాఖామాత్యులు శ్రీ కొండా వెంకట రంగారెడ్డిచే జరుపబడింది.

కరీంనగరం

నాలుగురోజుల నాటక గోష్ఠి :- కలెక్టరు కార్యాలయావరణలో జరిపిన జిల్లా సంగీత, నాటక పోటీలలో ప్రథమ బహుమతి పెద్దపల్లి మాధ్యమికోన్నత పాఠశాలకు, మానకొండూరు మాధ్యమికోన్నత పాఠశాలకు ద్వితీయ బహుమానమూ వచ్చాయి. జనవరి 28 నుండి 31 వ తేదీ వరకు జరిగిన యీ సంగీత, నాటక పోటీలలో 18 పాఠశాలలు పాల్గొన్నాయి.

ఖమ్మం

సంగీత నాటక గోష్ఠి :- జిల్లా సంగీత నాటక గోష్ఠి ఖమ్మంమెట్టులో జనవరి 24, 25 తేదీలలో జరుపబడింది. ఈ పోటీలలో ఖమ్మం ఉన్నత పాఠశాల ప్రథమంగాను, దుమ్ముగూడెం ఉన్నత పాఠశాల ద్వితీయంగానూ నిలిచాయి.

భారత సేవక్ సమాజ్ :- 1960 ఫిబ్రవరి 9వ తారీఖున ఖమ్మం జిల్లా భారత సేవక్ సమాజ్ సమ్మేళనానికి రాష్ట్ర హోంశాఖామాత్యులు ప్రారంభోత్సవం జరిపారు.

కృష్ణా

దుస్తుల తయారీ శిక్షణా కేంద్రం :- 1960 జనవరి 1వ తేదీన గండేపల్లిలో ఒక దుస్తుల తయారీ శిక్షణా కేంద్రం నెలకొల్పబడింది.

మేలా ఉత్సవాలు :- ఫిబ్రవరి 11, 12 తేదీలలో మైలవరంలో మైలవరం పంచాయతీ సమితి మేలా ఉత్సవాలు బ్రహ్మాండంగా జరుపబడ్డాయి.

చిన్న మొత్తాల పొదుపు :- ఫిబ్రవరి 1 నుండి 15 వరకు రాష్ట్రమంతటా చిన్న మొత్తాల పొదుపు ఉద్యమం కొనసాగించబడింది. ఈ జిల్లా కలెక్టరు పై ఉద్యమాన్ని మచిలీపట్నంలో ప్రారంభోత్సవం జేశారు. అక్కడవున్న ఆంధ్ర సైంటిఫిక్ ఉద్యోగులకు జెందిన ట్రస్టీలు, చిన్న మొత్తాల పొదుపుకు పెట్టుబడిగా రు. 5000 ల చెక్కును అందజేశారు.

కర్నూలు

"మూడు ప్రధానావసరాలు" :- రాష్ట్ర ప్రణాళికా శాఖామంత్రి గిద్దలూరు, కొమరోలు, బెస్తవరప్పేట, మార్కాపురం, యెర్రగొండపాలెం పంచాయతీ సమితులకు జెందిన అధ్యక్షులను, సభ్యులను, ఉద్యోగులనుద్దేశించి మాట్లాడుతూ, ప్రతి గ్రామంలోనూ ఒక ప్రాథమిక పాఠశాల, ఓ మంచి నీటి బావి, ఒక సహకార సంఘమూ వుండవలసిన ఆవశ్యకతను గురించి నొక్కి చెప్పారు. ఫిబ్రవరి మొదటివారంలో మంత్రిగారు యీ జిల్లాలో పర్యటించారు.

మహబూబునగరం

ఉత్తమ గ్రామస్థాయి కార్యకర్త:- జిల్లా పరిషత్తు అధ్యక్షుడు, శ్రీ కె. రామచంద్రారెడ్డి, జిల్లా కలెక్టరు, జిల్లా పరిషత్తు కార్యదర్శి 1960 జనవరి ప్రథమభాగంలో బ్లాకు ప్రాంతాల్లో పర్యటించారు. ఆలంపురం గ్రామ సేవకుడు, శ్రీ

కె. త్రిమూర్తి, జిల్లా అంతటిలోకి ఉత్తమ గ్రామస్థాయి కార్యకర్తగాను, కల్వకుర్తి బ్లాకులోని మిద్దిల ఉత్తమ గ్రామం గాను ఎన్నుకోబడటం జరిగింది.

40 గృహాల నిర్మాణానికి శంకు స్థాపన :- ప్రణాళికలు, సమాచార శాఖ మంత్రి దేవరకదరలో హరిజనులకుగాను 40 గృహాలు నిర్మించటానికి పునాదిరాయి వేశారు.

గ్రామీణ ప్రాంతాలకు నీటి సరఫరా :- జాతీయగ్రామీణ ప్రాంతం నీటి సరఫరా పథకం క్రింద, మహబూబునగరం జిల్లాలోని గద్వాల ప్రాంతంలో ద్వితీయ ప్రణాళిక ప్రారంభ కాలం నుండి 1960 జనవరి ఆఖరు వరకు 150 బావులు త్రవ్వబడ్డాయి.

మానోపాడు బ్లాకు :- మానోపాడు బ్లాకు పంచాయతీ సమితి అధ్యక్షుడు, శ్రీ చంద్రశేఖరరెడ్డి అధ్యక్షత క్రింద 1, 3, 4, 5 వ నంబరు స్థాయీ సంఘాలు సమావేశ మయ్యాయి. పశువుల ఆసుపత్రికి మందులు కొనేందుకు రు. 800లను ఒకటవ స్థాయీ సంఘం మంజూరుజేసింది.

సాముదాయక రేడియో సెట్టులు :- 1959-60 సంవత్స రానికి ఆశించిన ప్రమాణం ఇదివరకే సాధించబడింది. మహ బూబు నగరం జిల్లాలో మొత్తం సెట్ల సంఖ్య 203. తెలం గాణా జిల్లాలన్నిటిలోకి ఇదే హెచ్చు.

చిన్న మొత్తాల పొదుపు :- జడ్చెర్ల పంచాయతీ సమితి బ్లాకు అధ్యక్షుడు, శ్రీ కె. కేశవులు, ఇతర బ్లాకు అధికారులు 1960 జనవరి మాసంలో చిన్న మొత్తాల పొదుపు ఉద్యమం గురించి విస్తారంగా ప్రచారం చేశారు. ఐదు రోజులలో రు. 13,000 ల మొత్తాన్ని వసూలు చేశారు.

మహబూబు నగరం జిల్లాకు నిర్ణయించిన రు. 20లక్షల ప్రమాణంలో, 12-1-60వ తేదీనాటికి రు. 13 లక్షలు విలువ జేసే పొదుపు పత్రాలు కొనబడ్డాయి.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం :- 1960 జనవరి 11 వ తేదీన షాద్‌నగర్ పంచాయతీ సమితి బ్లాకులోని కేషంపేట గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కలెక్టరు ప్రారం భోత్సవం జేశారు.

జిల్లా సమాచార కేంద్రం :- జిల్లా కేంద్ర గ్రంథాల యంలో సమాచార కేంద్ర మొకటి జనవరి నెలలో ఆరం భించబడింది.

వనపర్తిలో తనఖా బ్యాంకు :- జిల్లా పరిషత్తు అధ్యక్షుడు శ్రీ కె. రామచంద్రారెడ్డి 25-1-1960 వ తేదీన వనపర్తిలో తనఖా బ్యాంకుకు ప్రారంభోత్సవం జేశారు.

నాటక గోష్ఠి :- జనవరి 25, 26 తేదీలలో మహబూబు నగరంలో యేర్పాటుజేసిన నాటకగోష్ఠికి దాదాపు 10,000 మంది గ్రామీణులు హాజరయ్యారు. మహబూబునగరం, నాగరకర్నూలు ప్రాంతాలలోని ఉన్నత పాఠశాలల విద్యా ర్థులు ప్రదర్శించిన వాటిలో కొన్ని ముఖ్యమయిన నాటికలు: "పరిశ్రామికా విజయం", "ప్రజా రాజ్యం", "అందం ఆనందం", "మన సమితి".

మెదక్

బేసిక్ విద్యా వారోత్సవం :- మెదక్‌లో జనవరి 20 నుండి 26 తేదీల వరకు బేసిక్ విద్యా వారోత్సవాలు జరుప బడ్డాయి.

నల్గొండ

వ్యవసాయ ప్రదర్శనానికి రైతుల ప్రయాణం:- బ్లాకులు లేని ప్రాంతాల నుండి, వివిధ పంచాయతీ సమితుల నుండి ఎన్నుకున్న 64 మంది రైతులు ఫిబ్రవరి మొదటి వారంలో ప్రపంచ వ్యవసాయ ప్రదర్శనాన్ని సందర్శించారు. ఒక వ్యవసాయ విస్తరణాధికారి, ఒక బి. డి. ఓ., అయిదుగురు గ్రామస్థాయి కార్యకర్తలు రైతుల వెంట వెళ్ళారు.

నకిరెకల్ బ్లాకు మేలా :- జనవరి 22 వ తారీఖున యీ బ్లాకు మేలాను ఉప ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంలో యేర్పాటుజేసిన సభకు దాదాపు 10,000మంది ప్రజలు హాజరయ్యారు.

శిక్షణా శిబిరం :- అస్పృశ్యతా నివారణ పథకం క్రింద సాంఘిక కార్యకర్తలకు, నిర్వాహకులకు శిక్షణా శిబిరం ఒకటి తిప్పర్తిలో జనవరి మొదటి వారంలో నిర్వహించ బడింది. ఈ శిక్షణా శిబిరాన్ని కేంద్ర ప్రభుత్వ రైల్వేశాఖా మంత్రి, శ్రీ జగ్‌జీవన్‌రాం ప్రారంభించారు. జిల్లాలోని అన్ని పంచాయతీ సమితుల నుండి 26మంది — పురుషులు, స్త్రీలు హాజరయ్యారు.

రోడ్లకు రు. 0.73 లక్ష :— జిల్లా పరిషత్తు అధ్వర్యం క్రింద రోడ్డు పనులను నిర్వహించటానికి గాను ఈ సంవ

త్సరంలో ప్రభుత్వం రు, 0.73 లక్ష మొత్తాన్ని మంజూరు చేసింది.

పాఠశాలా భవనానికి ప్రారంభోత్సవం :- జిల్లా పరిషత్తు అధ్యక్షుడు, శ్రీ జి. యస్. రెడ్డి, 1960 జనవరి నెలలో నాన్-బ్లాకు ప్రాంతంలోవున్న పుంగోడ గ్రామంలోని పాఠశాలా భవనానికి ప్రారంభోత్సవం జేశారు. ప్రజల విరాళాలతో ఈ భవనం నిర్మించబడింది.

నాటకాలలో ద్వితీయ బహుమానం :- 1959లో జరిగిన కలెక్టర్ల సమావేశ సందర్భంలో నల్గొండ జిల్లా తరఫున ప్రదర్శించిన "నూతన కాంతులు" అనే నాటకానికి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ సమాచార పౌర సంబంధాల శాఖ వారు ద్వితీయ బహుమానాన్నిచ్చారు.

నెల్లూరు

పొదిలి బ్లాకు :- జిల్లా పరిషత్తు అధ్యక్షుడు, శ్రీ యన్. చెంచు రామానాయుడు, 4-2-60 తేదీన పొదిలి ప్రీ-ఎక్స్టెన్షన్ బ్లాకుకు ప్రారంభోత్సవం జరిపారు.

పతాక దినోత్సవ నిధి:- 1959 పతాక దినోత్సవ నిధికి నెల్లూరుకు జెందిన శ్రీ యస్.వి. నరసింహారావు నూటపదహారు రూపాయలను దానం చేశారు. శ్రీ రావు న్యాయవాద వృత్తి అవలంబిస్తున్నారు. ఆయన నెల్లూరు జిల్లా సైనికులు, నావికులు, వైమానికుల బోర్డులో అనధికార సభ్యుడు కూడ.

ఈ నిధిని మాజీ రక్షణ దళాలకు జెందిన సభ్యులూ, వారి మీద ఆధారపడి వున్నవారి యొక్క ఆర్థిక దుస్థితిని చక్కపరచటానికి, ప్రస్తుత సాయుధ దళ సభ్యులకు సదుపాయాలు సమకూర్చటానికి ఉపయోగించబడుతుంది.

శ్రీకాకుళం

శిక్షణా శిబిరం:- సీతంపేట ఏజన్సీ బ్లాకులోని కిల్లాడలో 23-10-59 నుండి 25-10-59 వరకు గ్రామ సహాయకులకు ప్రత్యేక శిక్షణా శిబిర మొకటి నడుపబడింది. ఈ శిబిరానికి 11 మంది స్త్రీలు, 46 మంది పురుషులు హాజరయ్యారు.

శ్రీకాకుళంలో కేంద్ర ఉప మంత్రి:- జనవరి 10 వ తేదీన శ్రీకాకుళంలో కేంద్ర సమాజాభివృద్ధిశాఖ ఉపమంత్రి జిల్లా అధికారుల నుద్దేశించి ప్రసంగిస్తూ, జిల్లా పరిషత్తును "జిల్లా మంత్రివర్గం"గా తీసుకోవచ్చునన్నారు. సమన్వయానికి గల ప్రాముఖ్యతను వివరిస్తూ ఆఫీసర్లు తమ పనులలో నిర్మాణయుతమైన విధానాన్ని తీసుకోవాలని కూడా ఆయన అన్నారు.

ఉపమంత్రి ఆముదాలవలసలోని విజ్ఞాన మందిరాన్ని, అడ్డాకుల గూడలోని పైలట్ వ్యవసాయ ఫారాన్ని, గొండి ఆదర్శ గ్రామాన్ని, సీతంపేటలోని మహిళా సంక్షేమ కేంద్రమూ, కార్పొరేషన్ గిడ్డంగిని, నారాయణపురం మీడియం ఇరిగేషన్ ప్రాజెక్టునూ, తదితర స్థలాలను సందర్శించారు.

విశాఖపట్టణం

పశు ప్రదర్శనం:- ప్రతి సంవత్సరం జరుపబడే జిల్లా వ్యవసాయక, పశు ప్రదర్శన ఈ యేడు కశింకోటలో జనవరి 23, 24 తేదీలందు జరుపబడింది.

''ఆరాం ఘర్'':- జిల్లా సైనికులు, నావికులు, వైమానికుల బోర్డు నిర్మించిన ''ఆరాం ఘర్''కు 16-1-60 తేదీన కేంద్ర ప్రభుత్వ రక్షణశాఖా కార్యదర్శి, శ్రీ ఓ. పుల్లారెడ్డి, ప్రారంభోత్సవం జరిపారు. విశాఖపట్టణంలో నిర్మించిన ఈ ''ఆరాం ఘర్'' రు. 32,000 ల వ్యయంతో కట్టబడింది.

కేంద్ర ఉపమంత్రి పర్యటన:- కేంద్ర సమాజాభివృద్ధి, సహకారశాఖ ఉపమంత్రి, శ్రీ బి.యస్. మూర్తి, జనవరి 12 న పరవాడ పంచాయతీ సమితి నెరపిన కార్యకలాపాలను తిలకించారు. లేమర్తిలోని ప్రభుత్వ విత్తనాల ఫారమ్‌ను కూడ సందర్శించారు. అదే రోజు మంత్రిగారు జిల్లా పరిషత్తు సభ్యుల నుద్దేశించి ప్రసంగించారు.

ద్వితీయ బాలభట విన్యాసం:- మర్రిపాలెంలో 29-1-60 నుండి 4-2-60 వరకు ద్వితీయ రాష్ట్ర బాలభట దళ విన్యాసాలు యేర్పాటు జేయబడ్డాయి. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి 1096 మంది బాలభటులు, గైడులు యీ విన్యాసాలలో పాల్గొన్నారు.

వరంగల్లు

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం:- ములుగు బ్లాకులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఒకటి నెలకొల్పటానికి ప్రభుత్వం మొత్తం రు. 10,000 లను మంజూరు జేసింది.

పశ్చిమ గోదావరి

సంగీత, నాటక గోష్ఠి:- పశ్చిమ గోదావరి జిల్లా సంగీత నాటక గోష్ఠికి ప్రాంతీయ పోటీలు 1959 డిసెంబరు మాసాంతానికి పూర్తి గావింపబడ్డాయి. ఉన్నత పాఠశాలలు కళాశాలల విద్యార్థులలో ప్రణాళికాభిరుచి యేర్పడటానికి, వారిలో అణగివున్న నటనాకౌశలం ద్వారా ప్రణాళిక, సమాజాభివృద్ధి కార్యక్రమాలు విజయవంతంగా అమలు పరచేందుకు అవసరమయిన ప్రజల సహకారాన్ని చేకూర్చుకోటానికి యీ సంగీత నాటక గోష్ఠి ఉద్దేశించబడింది.

ప్రభుత్వ నిర్ణయాలు

రాష్ట్రంలో భారీ, మధ్యరకం, చిన్నరకం పరిశ్రమల అభివృద్ధికై పారిశ్రామిక అభివృద్ధి సంస్థనొకదానిని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పథకం వివరాలు త్వరలోనే రూపొందించబడుతాయి.

రాజధానిలో స్త్రీలకు కొంతకాలం పనికల్పించేందుకు భారతీయ సాంఘిక సేవామహాసభ హైదరాబాదు శాఖ తయారుచేసిన 9 పథకాలను ప్రభుత్వం ఆమోదించింది. వీని అంచనా ఖర్చు రూ. 2.9 లక్షలు (రూ. $1\frac{1}{2}$ లక్షలు ఒక్కసారి అయ్యేది, రూ. 60,000 ఏటేటా అయ్యేది, రూ. 80,000 పెట్టుబడి (వర్కింగ్). ఈ పథకాలలో దుస్తులతయారీ, బట్టలకురంగు, అద్దకంపనులు, రంగు దారాలకట్టు, లేసు, అంబర్ చర్ఖా శిక్షణ కేంద్రం స్థాపనలు తల పెట్టబడినవి.

—:*:—

విశేషాలు

రాష్ట్ర ఎన్.సి.సి. కి ద్వితీయ స్థానం

జనవరి 26న ఢిల్లీలో జరిగిన రిపబ్లిక్‌డే అఖిల భారత విన్యాసంలో ఆంధ్ర ప్రదేశ్ ఎన్. సి. సి. దళానికి ద్వితీయ స్థానం వచ్చింది.

కుమారి సుమిత్రా లక్ష్మణ్ (ఆంధ్ర వైద్యకళాశాల, వాల్తేరు), కుమారి ధన్ పెస్టోన్జీ (సెయింటు ఆన్స్ హైస్కూలు, సికిందరాబాదు) లు వరుసగా సీనియర్ వింగ్ గరల్ కేడెట్, జూనియర్ వింగ్ గరల్ కేడెట్‌లలో ఉత్తములుగా నిర్ణయించబడ్డారు

ఆంధ్రప్రదేశ్ ఎన్. సి. సి. దళానికి వరుసగా మూడు సంవత్సరాలనుంచి బహుమతులు వస్తున్నాయి. మొదటి సారి ప్రథమ బహుమతి వచ్చింది.

ఈ దళంలో 29 మంది ఎన్. సి. సి. బాలురు. 13 మంది ఎన్. సి. సి. బాలికలు ఉన్నారు. వీరు 13 వ. ఆంధ్ర నేవల్ యూనిట్టుకి చెందిన సబ్—లెఫ్టినెంటు మెయింకార్. 15 వ. ఆంధ్ర వైమానిక స్క్వాడ్రన్‌కి చెందిన డి. వి. సంపత్, మూడవ ఆంధ్ర బ్యాటలైన్‌కి చెందిన కుమారి ఒ. డి. మెల్లోల క్రింద ఉన్నారు.

బహుమతి గెల్చుకొన్న ఒంగోలు వృషభం

15వ. అఖిల భారత పశు ప్రదర్శనంలో ఒంగోలు వృషభం ఉత్తమ పశువుగా నిర్ణయించబడింది. దీని వయస్సు 6 సంవత్సరాలు. ఈ ప్రదర్శనం కొత్తఢిల్లీలో 15-2-60 లో సమాప్తమయింది.

ఈ ఎద్దు బరువు 1,625 పౌనులు. ఇది శ్రీ పోలవరపు హనుమయ్యగారిది. దీనికి రూ. 800 రొక్కం బహుమతి, 3 సవాలు కప్పులు లభించాయి. బ్రెజిల్ ప్రభుత్వం ఒక ప్పుడు దీనికి రూ. 33,000 యిస్తానందిట.

చెఱకు పండించటంలో అగ్రేసరుడైన ఆంధ్రరైతు

కృషిక్ సమాజ్ జరిపిన అఖిల భారత చెఱకు పంట పోటీలో దక్షిణ ప్రాంతంలో ఉత్తమ చెఱకు పంట సాధించిన వారిలో శ్రీ భోపన్న శివరామ బ్రహ్మం అగ్రేసరులుగా ఉన్నారు. ఈయన 'ఏక్‌సాలిపంట'లో ఎకరానికి 4,098 మణుగుల చెఱకు పండించారు. ఉత్తర ప్రాంతంలో ప్రథమ బహుమతి ఉత్తర ప్రదేశ్‌కిచెందిన శ్రీ పి. ఎన్. మెహతాకి వచ్చింది. ఈయన ఎకరాకు 2,424 మణుగులు పండించారు. శ్రీ బ్రహ్మం పంట మొత్తం దేశంలో ఉత్తమంగా ఉన్నట్టుకూడా కనుగొన బడింది. బహుమతులు కొత్తఢిల్లీలో ప్రధాన మంత్రిచే 14-2-60 న ఇవ్వబడినవి.

అర్ధరూపాయి పెళ్ళికి ఆరురూపాయల బాణ సంచా.

* * *

ఉల్లి చేసిన మేలు తల్లయినా చేయదు.

— తెలుగు సామెతలు.

పాఠకుల లేఖలు

ఆకర్షణీయం

'ఆంధ్ర ప్రదేశ్' పత్రిక కథలు, వ్యాసాలు సూక్తులు గేయాలతో ఆకర్షణీయంగా వెలు వడుతూ వుండటం ముదావహం. క్రమ క్రమంగా కొత్త కొత్త శీర్షికలతో యీ పత్రిక పాఠకుల దృష్టిని ఆకర్షిస్తూవుంది. 1959 అక్టోబరు సంచిక నుండి ఆరంభమైన యీ నూతన విధానానికి పాఠక లోకం హృదయ పూర్వకంగా స్వాగతమిస్తున్నది.

ఇంత చవకగా, యింత అమూల్యమైన అంశాలతో వెలువడే ఆంధ్ర ప్రదేశ్ పత్రిక, రాష్ట్రంలోని ప్రతి గృహంలోనూ ఉండదగినదని నా అభిప్రాయము.

పి. వి.సుబ్బయ్య నాయుడు,
తిరుపతి; చిత్తూరు జిల్లా.

* * *

'సర్వాంగ సుందరం'

సంక్రాంతి సంచిక క్రొంగ్రొత్త శీర్షికలలో గేయాలతో, కథలూ, వ్యాసాలతో సర్వాంగ సుందరంగా వెలువడింది. సంతోషం. పాఠకుడిచ్చే 18 నయా పైసలూ ఒక్క కవరు పేజీ ముద్రణకే చాలదనే విషయం లోకవిదితమే. అయినా వ్యాపార రీత్యా కాకుండా, ప్రత్యేకంగా ఆంధ్ర దేశానికి సేవ జేయడానికి స్థాపించ బడినదనే విషయమూ అందరికీ తెలిసినదే. కానీ ఒక్క విషయం. పత్రికలో గేయాల ప్రచురణ హెచ్చుగావుంది. కథలూ, నాటికలూ మరీ పెద్దవిగా ఉన్నవి. పెద్ద పెద్ద కథలు, నాటికలూ, సీరియల్‌గా ప్రచురింప బడుతున్నప్పుడైనా సంచికలో యేడెనిమిది పేజీలు మించకుండా వుంటే పాఠకులకు చదువుకోడానికి అంతగా విసుగెత్తకుండా వుంటుందని నా ఉద్దేశం. ఉగాది సంచిక మరింత ఆకర్షణీయంగా వుంటుందని ఆశిస్తున్నాను—

యన్. వి. సీతారామ మూర్తి,
అలమూరు,
రామచంద్రపురం తాలూకా,
తూర్పు గోదావరి జిల్లా.

(ఇక వీలైనంత చిన్నవే ప్రకటించాలని మా ఉద్దేశమూనూ— సం॥.)

* * *

ఒక సలహా

"ఆంధ్ర ప్రదేశ్" వెనకటి కంటె ఈ మధ్య బాగుగా ఉంటున్నందుకు సంతోషం. అన్నిటితోను చాలా బాగుంది. ప్రముఖుల సూక్తులు, కథానికలు, గేయాలు వచ్చు చున్నవి. గాంధీజీ జీవితంలోని మంచి ఘట్టములు కొన్నాళ్లు ప్రకటిస్తే చాలా బాగుండునని మా ఆశయం.... కేవలం ప్రభుత్వ ప్రచార పత్రిక అనే మాకు అపోహ కలుగ నీయక. కథానిక, నాటిక, వ్యాసములు, ప్రముఖుల సూక్తులతో సర్వతోముఖంగా అన్ని విషయములతోను పత్రిక వెలువడగలదని, గాంధీజీ ప్రబోధములు మాకు జ్ఞాపకం చేస్తూవుండగలరని... ఆశించు చున్నాను—

త్రిపురారి సత్యనారాయణ,
మండపేట,
తూర్పు గోదావరి జిల్లా.

(అక్టోబరు సంచికలో గాంధీజీని గూర్చి ఉన్నది. అవకాశం వున్నప్పుడు అలానే చేయగలం—సం.)

ముఖ్య వార్తలు

21-1-60

దేశంలోని లెజిస్లేటివ్ సంస్థల ప్రిసైడింగ్ ఆఫీసర్ల 25 వ మహాసభ నగరంలో జరిగింది.

22-1-60

భారతదేశ భూసార పరిరక్షణ సంఘం 8 వ వార్షిక సమావేశాన్ని నగరంలో ముఖ్యమంత్రి ప్రారభించారు.

23-1-60

రాష్ట్ర పబ్లిక్ వర్క్సు శాఖా మంత్రి హైదరాబాదులోని వై.ఎమ్.సి ఎ. హాలులో రాష్ట్ర రహదార్ల ఇంజినీర్ల చతుర్థ వార్షిక సమావేశాన్ని ప్రారంభించారు.

రాష్ట్రాల ఉద్యోగుల తొలి అఖిల భారత కన్వెన్షన్‌ని ఉపముఖ్యమంత్రి ఆరంభించారు.

24-1-60

ప్రపంచ పరివ్యాప్తమయిన పరిపూర్ణ నిరాయుధీకరణ ప్రతిపాదనను అన్ని దేశాలు అంగీకరించినట్లయితే, యితర దేశాలతో పాటు రష్యాకూడా నిస్సైన్యీకరణకు పక్రమించి రాకెట్లను, అణ్వస్త్రాలను ధ్వంసం చేసివేయ గలదని అధ్యక్షుడు ఒరోషిలోవ్ ప్రకటించారు. ఢిల్లీ కార్పొరేషన్ సమర్పించిన పౌర సన్మాన పత్రానికి జవాబు చెబుతూ ఆయన యీ విషయం వెల్లడించారు.

25-1-60

11 వ రిపబ్లిక్ దినోత్సవాన రాష్ట్రపతి రాష్ట్ర శాసనసభ అధ్యక్షులు శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావుగారికి "పద్మ భూషణ్" బిరుదును ప్రసాదించినట్టు ప్రకటింపబడింది.

26-1-60

దేశంలోని యితర ప్రదేశాలలోవలెనే హైదరాబాదులో సమధికోత్సాహంతో రిపబ్లిక్ దినోత్సవాలు జరుపబడ్డాయి.

27-1-60

నేపాల్, భారతదేశాలమధ్య పెక్కు అనుబంధాలు కలవనీ, భావి సమస్యలను అవి "జతగా" యెదుర్కొన గలవనీ నేపాల్ ప్రధాని శ్రీ కోయిరాలామన ప్రధాని శ్రీ నెహ్రూ ఉద్ఘాటించారు.

28-1-60

ఆంధ్ర ప్రాంతం 11 జిల్లాల్లోనూ, తెలంగాణా ప్రాంతం జిల్లాలు వరంగల్లు, ఖమ్మంమెట్టు, నల్గొండలలోను ముందు తాలూకా స్థాయిలోనూ అంతకు క్రింద స్థాయిలోనూగల కార్యాలయాలన్నీ ప్రజలతో జరిపే ఉత్తర ప్రత్యుత్తరాలను తెలుగులో జరపాలని ప్రభుత్వం నిర్ణయించినదని ముఖ్య మంత్రి పత్రికా విలేఖరుల గోష్ఠిలో ప్రకటించారు.

29-1-60

రాష్ట్రంలో చిన్నపరిశ్రమల అభివృద్ధి సంస్థను ఏర్పర చాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నదని రాష్ట్ర చిన్న పరిశ్రమలు, కుటీర పరిశ్రమల శాఖామంత్రి పత్రికా విలేఖరులతో చెప్పారు.

30-1-60

ఈ సంవత్సరం పంట నుంచి 50,000 టన్నుల బియ్యాన్ని కొనాలని ప్రభుత్వం నిర్ణయించినదనీ, అవి సంవత్సరంలో సరుకు తక్కువగా ఉండేనెలల్లో లోటు ప్రాంతాలలో చవుక దుకాణాల ద్వారా సరఫరా చేయబడ తాయనీ నేటి ఒక పత్రికా ప్రకటనలో పేర్కొనబడింది.

31-1-60

నేడు ఉస్మానియా విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో సుమారు 2,218 మంది పట్టభద్రులు పట్టాలుతీసుకున్నారు. కేంద్రశాస్త్ర పరిశోధన, సాంస్కృతిక వ్యవహారాల మంత్రి ప్రొఫెసర్ హుమాయూన్ కబీర్ స్నాతకోపన్యాసం యిచ్చారు.

1-2-60

కేరళలో మధ్యకాలం (మిడ్.టరమ్) ఎన్నికకు పోలింగ్ జరిగింది. 80 లక్షల మంది ఓటర్లలోను 100 కి 80 మంది ఓటువేసినట్టు అంచనా.

2-2-60

రాష్ట్రంలో దేవాలయ శిల్పం, నిర్మాణం. తత్సంబంధ మయిన యితర విషయాల బోధనకై త్వరలోనే ఒక కళా శాల ప్రారంభింపబడగలదని సహకారం, దేవ ధర్మాదాయ శాఖా మంత్రి పత్రికా విలేఖరులకు చెప్పారు.

1957 ఆంధ్రప్రదేశ్ అమ్మకం పన్ను చట్టం సవరణబిల్లు రాష్ట్ర అమ్మకం పన్ను సలహాసంఘానికి చూపబడుతుందని ప్రభుత్వం ప్రకటించింది.

3-2-60

రాష్ట్రంలో రెండు చిన్న ఉక్కు ప్లాంటులను నెలకొల్పా లని ప్రభుత్వం సంకల్పించినట్టు హైదరాబాదు జిల్లా పరి షత్తు చేసిన సన్మానం సందర్భంలో రాష్ట్ర పరిశ్రమల మంత్రి వెల్లడించారు.

4-2-60

కేరళ ఎన్నికల పూర్తి ఫలితాలు ప్రకటింపబడ్డాయి. ఇందులో యునైటెడ్ డెమోక్రాటిక్ ఫ్రంటు 126స్థానాలలో 94 స్థానాలను గెల్చుకుంది.

5-2-60

వచ్చే విద్యా సంవత్సరం నుంచి కర్నూలు వైద్యకళా శాల, హైదరాబాదులోని గాంధీ వైద్యకళాశాలల స్థానాల సంఖ్యను 25 చొప్పున, గుంటూరు వైద్య కళాశాల స్థానాల సంఖ్యను 20 హెచ్చించాలని ప్రభుత్వం నిర్ణయించి నట్టు హైదరాబాదులో ఆర్థిక శాఖా మంత్రి పత్రికా విలేఖ రులకు చెప్పారు.

6-2-60

దక్షిణ ఆహార మండలాన్ని రద్దు చేసి ఆంధ్ర ప్రదేశ్‌కి విడిగా ఆహార మండలాన్ని ఏర్పరచాలన్న ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం కోరికను కేంద్ర ఆహార, వ్యవసాయ మంత్రి నిరాకరించారు.

భారతీయ కేంద్ర నూనెగింజల కమిటీ 13వ వార్షిక సమావేశం హైదరాబాదులో కేంద్ర ఆహార, వ్యవసాయ మంత్రిచే ప్రారంభించబడింది.

7-2-60

శ్రీ సత్యజిత్ రే రెండు పెద్ద అమెరికన్ ఫిల్మ్ అవా ర్డులను పొందినట్టు న్యూయార్కులో ప్రకటించబడింది.

8-2-60

కృత్రిమ రబ్బరు తయారీ యంత్రాగారం స్థాపనకు హైదరాబాదు ఎన్నిక చేయబడినట్టు మిస్టర్ జి. ఆర్. వలషేక్ నేడు హైదరాబాదులో చెప్పారు. ఈయన మాస్కో మందు సంస్థ డైరెక్టరు, అయిదుగురు సభ్యులు గల సోవి యెట్ మందుల నిపుణుల ప్రతినిధి వర్గ సభ్యులు అయి ఉన్నారు.

9-2-60

జూబ్లీ హాలులో మెకానికల్ ఇంజనీర్ల (ఇండియా) మహాసభ 38 వ వార్షిక సమావేశాన్ని ముఖ్యమంత్రి ప్రారం భించారు.

10-2-60

విద్యా విషయిక సౌకర్యాల ప్రస్తుత పద్ధతిని విశాల ప్రాతిపదికపై పునర్నిర్ణయించాలని ప్రభుత్వం సంకల్పిం చింది. ఈ కొత్త పద్ధతిలో షెడ్యూల్డుకులాలు, షెడ్యూల్డు జాతులు, యితర వెనుకబడిన తరగతుల విద్యార్థులతో పాటు తదితర కులాల పేద విద్యార్థులకు కూడా సౌకర్యం కలుగుతుంది.

11-2-60

రష్యా ప్రధాని శ్రీ నికితా కృశ్చేవ్ పాలం విమానాశ్ర యం చేరుకున్నారు. ఆయన ఇండియా, బర్మా, ఇండో నీషియా, ఆఫ్ఘనిస్తాన్‌లలో పర్యటిస్తారు

12-2-60

రాష్ట్రంలో సహకార వ్యవసాయం ముందుగా నెల్లూరు జిల్లా కందుకూరు తాలూకాలో 500 యెకరాలలో ఆరంభించ బడగలదని పరిశ్రమలు, మునిసిపలు పరిపాలన మంత్రి పత్రికా విలేఖరులకు చెప్పారు.

13-2-60

ఆర్థికంగా వెనుకబడి ఉండి ప్రజల నిత్యావసరాలను

కూడా సమకూర్చజాలని పంచాయతీల సహాయార్థం "పంచాయతీ సమతుల్య నిధి" అనే నాన్‌లాప్సబుల్ నిధి నొకదానిని ఏర్పాటుచేయాలని ప్రభుత్వం నిర్ణయించినదని ప్రణాళికలు. సమాచార మంత్రి హైదరాబాదులో చెప్పారు.

14-2-60

ఆర్థిక, తదితర సౌకర్యాల నిమిత్తం వెనుక బడిన తరగతులలో ప్రస్తుత మేర్పడి ఉన్న తరగతి వారీ విభజనలో యెటువంటి మార్పులను తీసుకురాకూడదనీ, అటువంటి ప్రతిపాదనను వెనుకబడిన తరగతులు వ్యతిరేకించాలనీ ముఖ్య మంత్రి హైదరాబాదులో జరిగిన సన్మాన సభలో పేర్కొన్నారు.

15-2-60

జూబ్లీ హాలులో ముఖ్యమంత్రి భారతీయ రేడియోలజీ 14వ మహాసభను ప్రారంభించారు.

16 2-60

ఆంధ్ర ప్రదేశ్ సాధారణ అమ్మకం పన్ను చట్టం సవరణ బిల్లులో వివాదాస్పదమయిన 3 క్లాజ్‌లు తొలగించ బడతాయని రాష్ట్ర ఆర్థిక మంత్రి హైదరాబాదులో చెప్పారు.

రాష్ట్ర శాసన సభ బడ్జెటు సమావేశం సాయంకాలం 4 గంటలకు ఆరంభమయింది.

17-2 60

కేంద్ర రైల్వేమంత్రి లోక్ సభలో 1960-61 బడ్జెట్‌ను ప్రతిపాదిస్తూ 1960-61లో రైలు ప్రయాణీకుల ఛార్జీలలో మార్పు ఉండదని ప్రకటించారు.

18-2-60

సీలేరు జల విద్యుచ్ఛక్తి ప్రాజెక్టు నిర్మాణం విషయంలో ఆంధ్ర ప్రదేశ్, ఒరిస్సా ప్రభుత్వాల మధ్య ఒప్పందం కుదిరినట్టు రాష్ట్ర ఆర్థిక మంత్రి శాసన సభ ప్రశ్నోత్తరాల సమయంలో చెప్పారు.

19-2-60

ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయేతర (నాన్-అగ్రి కల్చరల్) భూమి అసెస్‌మెంటు బిల్లు రాష్ట్ర శాసనసభచే 15 మంది సభ్యులుగల సెలెక్టు కమిటీకి పంపబడింది. ఉప ముఖ్య మంత్రి (రెవిన్యూ మంత్రి) యీ కమిటీ అధ్యక్షుడు.

20-2-60

రాష్ట్ర ఆర్థిక మంత్రి మిగులు బడ్జెటును సమర్పించారు.

——:0:——

తింటే కాని రుచి, దిగితే కాని లోతు తెలియదు.

* * *

బద్ధకం పరమ దరిద్రం.

* * *

ఏ కర్రని నిప్పంటే ఆ కర్రే కాలుతుంది.

— తెలుగు సామెతలు.

రచయితలు

శ్రీ విశ్వనాథ సత్యనారాయణ, కవిసమ్రాట్
(ప్రస్తుతం కరీమ్ నగరం కళాశాల
ప్రిన్సిపాలుగా వుంటున్నారు.)

శ్రీ నాయని సుబ్బారావు (విఖ్యాత కవి)
(ఇప్పుడు ఆకాశవాణి, హైదరాబాదు కేంద్రంలో
పని చేస్తున్నారు.)

శ్రీ కాటూరి వేంకటేశ్వరరావు (విఖ్యాత కవి)

శ్రీ దేవులపల్లి వేంకట కృష్ణ శాస్త్రి (విఖ్యాతకవి)
(ఆకాశవాణి, హైదరాబాదు కేంద్రంలో ఉన్నారు.)

శ్రీ పో. సు. శాస్త్రి
(మధ్యప్రదేశ్‌లోని సాగర్ విశ్వవిద్యాలయంలో
అధ్యాపకులుగా ఉన్నారు.)

శ్రీ శనగన నరసింహస్వామి
(గుణదలలోని కళాశాలలో
తెలుగు లెక్చరర్‌గా ఉన్నారు.)

శ్రీ యస్. వి. నరసింహారావు
(అడ్వకేటు, గూడూరు, నెల్లూరు జిల్లా)

ఆచార్య పోతుకూచి శ్రీరామావధాని
(మహాత్మా గాంధి మెమోరియల్ కాలేజి,
ఇటార్సీ, మధ్యప్రదేశ్.)

శ్రీ సందూరి రామకృష్ణమాచార్యులు
(అనంతపురంలోని ప్రభుత్వ కళాశాలలో
తెలుగు శాఖాధ్యక్షులు.)

శ్రీ కొడవటిగంటి కుటుంబరావు
(విఖ్యాత కథా రచయితలు. ఇప్పుడు 'చందమామ'
పత్రికలో పనిచేస్తున్నారు—మద్రాసు.)

శ్రీ వేములపల్లి సుధాకరరావు
(తెలుగు లెక్చరర్, ఆంధ్ర లయోలా కాలేజి, గుణదల.)

శ్రీ కుంటిమద్ది శేషశర్మ
(అనంతపురం జిల్లా ధర్మవరంలోని హైయర్ సెకండరీ
స్కూలులో తెలుగు పండితులు.)

యస్. సరస్వతి
(అంగలకుదురు, తెనాలి తాలూకా)

శ్రీ చల్లా బ్రహ్మానందమ్
(పొన్నూరు, గుంటూరు జిల్లా.)

శ్రీ దిగుమర్తి సీతారామస్వామి
(భీమవరంలోని డబ్ల్యు. జి. బి. కాలేజి
ప్రాచ్య భాషా విభాగాధ్యక్షులు)

శ్రీ కె. విశ్వేశ్వరరావు
(ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ఆర్థిక గణాంక
శాఖలో పని చేస్తున్నారు.)

శ్రీ బొడ్డు బాపిరాజు
(ఏలూరు)

నెల్లూరి కేశవస్వామి
(అసిస్టెంట్ రిసర్చి ఆఫీసర్, హైడ్రాలిక్
లాబొరేటరీ, హైదరాబాదు.)

భట్టారం మల్లికార్జున కవి
(రామమూర్తి నగర్, నెల్లూరు)

శిష్టా రామకృష్ణ శాస్త్రి
(తెలుగు లెక్చరర్, మద్రాసు విశ్వవిద్యాలయం.)

చిల్లర భావనారాయణరావు
(సీతాఫల్‌మండి, సికింద్రాబాద్.)

మంజుశ్రీ
(చిక్కడపల్లి, హైదరాబాదు.)

రావిపాటి లక్ష్మీనారాయణ
(షరిస్తాదార్, సబ్‌కోర్టు, తెనాలి.)

Statement about ownership and other particulars about newspaper (ANDHRA PRADESH) to be published in the first issue every year after the last day of February.

FORM IV.

(See Rule 8)

1.	Place of Publication	Hyderabad.
2.	Periodicity of the publication	Monthly.
3.	Printer's Name	Leela Puri
	Nationality	Indian
	Address	Vir Milap Press, Hyderabad.
4.	Publisher's name	Director of Information and Public Relations.
	Nationality	Indian.
	Address	Mukaramjahi Road, Hyderabad-1.
5.	Editor's Name	Narendra Luther, I.A.S.
	Nationality	Indian.
	Address	Director of Information and Public Relations, Governament of Andhra Pradesh, Mukaramjahi Road, Hyderabad-1.
6.	Names and Addreses of Individuals who own the newspapers and partners or share-holders holding more than one per cent of the total capital.	— ——

I, Sri Narendra Luther, Director of Information and Public Relations, Governament of Andhra Pradesh, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Sd. Narendra Luther.

Signature of Publisher.

* The Director, Govt. Printing Press, Hyderabad Dn. is the official printer but he may name any other printer when the Govt. Press cannot under-take printing of this journal.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం

వైశాల్యం	1,06,041 చదరపు మైళ్ళు
జనసంఖ్య	3,12,60,133
పురుషులు	1,57,42,912
స్త్రీలు	1,55,17,221
సగటు వర్షపాతం	35.65 "
అరణ్య ప్రదేశం	1,40,26,000 ఎకరాలు
జిల్లాలు	20
తాలూకాలు	183
రెవిన్యూ సర్కిళ్లు	1,000
పట్టణాలు	293
గ్రామాలు	26,450
పంటలక్రింది ప్రదేశం	2,93,81,000 ఎకరాలు
కొళ్ళ సంఖ్య	42,42,655
1958-59 లో నీటి పారుదలను పొందిన ప్రదేశం ...	68 లక్షల ఎకరాలు
1958-59 లో వుత్పత్తి అయిన ఆహారధాన్యాలు ...	61.56 లక్షల టన్నులు
పాల వుత్పత్తి	15.5 లక్షల గాలన్లు
రైలు మార్గాలు	2,902 మైళ్ళు
జాతీయ రహదార్లు	1,409 ,,
రాష్ట్ర రహదార్లు	2,072 ,,
జిల్లా పెద్ద రోడ్లు	2,527 ,,
జిల్లా ఇతర రోడ్లు	3,458 ,,
పాఠశాలలు	28,000
కళాశాలలు	64
వృత్తి విద్యా కళాశాలలు	31
ద్వితీయ పంచ వర్ష ప్రణాళిక ప్రమాణం	రూ. 175.37 కోట్లు

1960—61 బడ్జెటు:

ఆదాయం ...	రూ. 82.18 కోట్లు
వ్యయం .... ,,	81.98 ,,
పెట్టుబడి ఖర్చు ... ... ,,	32.44 ,,

